ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 5
జిల్లా వార్తలు
గురువారం 25, ఏప్రిల్ 2024


ఒంగోలులో ర్యాలీకి హాజరైన అశేష జనం (ఇన్‌సెట్‌లో) అభివాదం చేస్తున్న దామచర్ల, మాగుంట తదితరులు

ఊరూవాడా కదిలొచ్చారు. ఎటుచూసినా పసుపుమయం. కూటమి శ్రేణులతోపాటు, ప్రజలు పెద్దసంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొని తమ మద్దతు ప్రకటించారు. భారీగా పార్టీ జెండాలు చేతపట్టి పసుపు చొక్కాలు ధరించి సందడి చేశారు. జిల్లాలోని ఒంగోలు, కనిగిరి, గిద్దలూరుల్లో బుధవారం తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల నామినేషన్ దాఖలు అట్టహాసంగా సాగింది. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు జెండాలతో తరలిరాగా రాజకీయ ప్రత్యర్థులను సైతం అబ్బురపరిచేలా ర్యాలీలు సాగాయి. అన్నిచోట్లా జనం బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా పూలవర్షం కురిపించారు. రోడ్లన్నీ పసుపుమయంగా మారిపోయాయి. దారులన్నీ జన సంద్రమయ్యాయి. మేళతాళాలు, తప్పెట్ల మోతల మధ్య తెలుగుతమ్ముళ్లు కదం తొక్కారు.



పోటెత్తిన అభిమానం




కనిగిరిలో ర్యాలీకి పోటెత్తిన ప్రజలు (ఇన్‌సెట్‌లో) ఉగ్రను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

ఒంగోలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాధారణ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగియనుంది. కాగా బుధవారం పలు స్థానాలకు నామినేషన్లు భారీగా దాఖలయ్యాయి. అదేసమయంలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు కార్యక్రమాలు అట్టహాసంగా సాగాయి. జిల్లాలో ఒంగోలు పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు ఈనెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన విషయం విదితమే. టీడీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డితోపాటు మూడు స్థానాల అసెంబ్లీ అభ్యర్థులు ఇప్పటికే నామినేషన్లు వేశారు. బుధవారం ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్, కనిగిరి అభ్యర్థి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరు అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి దాఖలు చేశారు. ఈసందర్భంగా ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు నిర్వహించగా టీడీపీ శ్రేణులు, కూటమిలో మిగతా పార్టీలైన జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సా

- అట్టహాసంగా దామచర్ల, ఉగ్ర, అశోక్‌రెడ్డి నామినేషన్లు
- వెల్లువలా తరలివచ్చిన కూటమి శ్రేణులు
- స్వచ్ఛందంగా మద్దతు తెలిపిన ప్రజలు
- ఒంగోలు, కనిగిరి, గిద్దలూరుల్లో భారీ ర్యాలీలు
- కార్యకర్తల్లో వెల్లివిరిసిన ఉత్సాహం
- నేడు దాఖలు చేయనున్న బీఎన్, కందుల
- నేటితో ముగియనున్న నామినేషన్ల స్వీకరణ

హంగా పాల్గొన్నారు. నియోజకవర్గాల్లోని నలుమూలల నుంచి వేలాదిగా టీడీపీ శ్రేణులు తరలివచ్చి నామినేషన్ల కార్యక్రమంలో పాల్గొనడంతో బుధవారం ఉదయం ఒంగోలు, కనిగిరి, గిద్దలూరు పట్టణాలు పసుపుమయ మయ్యాయి.

స్వచ్ఛందం.. ఉరిమే ఉత్సాహం

ఒంగోలులో ఉదయం పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించిన టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ పది గంటల సమయానికి మినీ స్టేడియం వద్దకు చేరుకోగా వేలాదిమంది కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి ఇతర నియోజకవర్గ నాయకులతో కలిసి ప్రత్యేక వాహనంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీలో ముందుకు సాగారు. అయితే ఫర్లాంగు


ఒంగోలులో ర్యాలీ సందర్భంగా నృత్యం చేస్తున్న మహిళలు

దూరంలోని డీ మార్ట్ సెంటర్‌కు చేరేందుకు దాదాపు గంట పట్టగా నామినేషన్లు దాఖలు ముహూర్తం దగ్గరపడటంతో వాహనం దిగి బైక్‌పై ఆర్డీవో కార్యాలయానికి జనార్దన్, ఆయన కుటుంబసభ్యులు, పార్టీ నేతలు చేరుకున్నారు. అందరూ కలిసి నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే జనార్దన్ సోదరుడు టీడీపీ యువనేత దామచర్ల సత్య తన తండ్రి పూర్ణచంద్రరావుతో కలిసి వచ్చి పార్టీ డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. కాగా జనార్దన్ ర్యాలీ కోలాహలంగా, ఆకర్షణీయంగా సాగింది. కేరళ వాయిద్యాలు, పసుపు చీరలు, తలపాగాలతో మహిళలు, కేరింతలు కొడుతూ యువకులు పాల్గొనడం ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాగా కొత్తపట్నం మండలం పల్లెపాలెం టీడీపీ కార్యకర్తలు అక్కడి నుంచి 16 కి.మీ. దూరం పాదయాత్ర చేస్తూ ఒంగోలు వచ్చి ర్యాలీలో పాల్గొనడం విశేషం.

నేడు బీఎన్, కందుల

నామినేషన్ల దాఖలు గడువు గురువారంతో ముగియనుంది. చివరిరోజు కూడా భారీగానే అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు. ఎస్ఎన్‌పాడు అభ్యర్థి విజయ్‌కుమార్, మార్కాపురం టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డిలు గురువారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఆసందర్భంగా బీఎన్ నేతృత్వంలో చీమకుర్తిలో, కందుల ఆధ్వర్యంలో మార్కాపురంలో భారీ ర్యాలీలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి.

ఉగ్ర దండుతో ఉరకలెత్తిన కనిగిరి

కనిగిరిలో టీడీపీ అభ్యర్థి ఉగ్రనరసింహారెడ్డి నామినేషన్ దాఖలు సందర్భంగా కనిగిరి పట్టణం పసుపుదళంతో నిండిపోయింది. ఉగ్ర కార్యాలయం ఉన్న అమరావతి గ్రౌండ్‌కు ఉదయానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది పార్టీశ్రేణులు తరలివచ్చారు. అశేషంగా తరలివచ్చిన కార్యకర్తలతో ఉదయం పదిన్నరకు ర్యాలీని ఉగ్ర ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన వీధులు, పామూరు బస్టాండు మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకూ అది సాగింది. కేవలం ఒక కిలోమీటర్ దూరం మాత్రమే ఉన్న ఆ మార్గంలో ర్యాలీ సాగడానికి దాదాపు మూడు గంటలు సమయం పట్టింది. మార్గమధ్యంలో స్థానికులు స్వచ్ఛందంగా ఉగ్రపై పూలవర్షం కురిపించారు. వ్యాపారులు దుకాణాల నుంచి బయటకు వచ్చి తిలకించారు. జనసేన ఎమ్మార్పీఎస్, బీజేపీ కార్యకర్తలు కూడా పెద్దసంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఆరో రోజు.. నామినేషన్ల జోరు

- 75 మంది అభ్యర్థులు.. 89 సెట్లు ...
- ఒంగోలు పార్లమెంట్‌కు తొమ్మిది, అసెంబ్లీ స్థానాలకు 80 దాఖలు

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 24 : జిల్లాలోని ఒంగోలు పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు బుధవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. 75 మంది అభ్యర్థులు 89 సెట్లను ఆర్వోలకు సమర్పించారు. ఒంగోలు పార్లమెంట్‌కు 8 మంది అభ్యర్థులు తొమ్మిది సెట్లను అందజేశారు. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 67 మంది అభ్యర్థులు 80 దాఖలు చేశారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి ఏడుగురు అభ్యర్థులు తొమ్మిది సెట్లు, దర్శి నుంచి ఎనిమిది మంది 12 సెట్లు, సంతనూతలపాడు ఐదుగురు అభ్యర్థులు ఏడు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఒంగోలు నియోజకవర్గం నుంచి ఎనిమిది మంది అభ్యర్థులు 11 సెట్లు, కొండపి నుంచి నలుగురు అభ్యర్థులు నామినేషన్లు చేశారు. మార్కాపురం నియోజకవర్గం నుంచి 12 మంది అభ్యర్థులు 14 సెట్లు, గిద్దలూరు నుంచి 11 మంది అభ్యర్థులు, కనిగిరి నుంచి 10 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 18 నుంచి ప్రక్రియ ప్రారంభమైంది. ఆదివారం సెలవు పోను మిగిలిన ఆరు రోజులు అధికారులు నామినేషన్లను స్వీకరించారు.


గిద్దలూరులో జనసంద్రంలా సాగుతున్న ర్యాలీ (ఇన్‌సెట్‌లో) నమస్కరిస్తున్న ముత్తుముల, రాఘవరెడ్డి తదితరులు

జన సంద్రమైన గిద్దలూరు

గిద్దలూరులో టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ ఆకర్షణీయంగా సాగింది. ఆర్టీసీ డిపో నుంచి అశోక్‌రెడ్డి, మాగుంట రాఘవరెడ్డి కలిసి ప్రత్యేక వాహనంలో ప్రజలకు అభివాదం చేస్తూ ప్రదర్శనను చేపట్టారు. సుమారు రెండున్నర గంటలపాటు అది సాగింది. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పెద్దసంఖ్యలో జనం తరలి వచ్చారు. జనసేన కార్యకర్తలు కూడా అధికంగా పాల్గొన్నారు. బీజేపీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. పట్టణంలోని ప్రధానరోడ్లన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. రాచర్ల గేటు సెంటర్ జనసంద్రంగా మారింది.

458 ఆవాసాలకు తాగునీరు

- అనుమతిచ్చిన ప్రభుత్వం
- ఇప్పటికే 142చోట్ల ట్యాంకర్లతో నీరు
- మిగతా ప్రాంతాలకు అవసరమైనప్పుడు సరఫరా

ఒంగోలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వేసవి నీటి ఎద్దడి తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్లతో సరఫరాకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆమేరకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వేసవిలో జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లోని 25 మండలాల్లో ఉన్న 458 ఆవాసాల్లో నీటి సమస్య ఏర్పడుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అంచనా వేశారు. ఆమేరకు ప్రభుత్వానికి గతంలోనే నివేదించారు. ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరాకు అనుమతి కోరారు. తొలుత 58, తర్వాత మరో 84 హ్యాబిటేషన్లలో నీటి సరఫరాకు గతంలో ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. తదనుగుణంగా ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారు. ఆ 142 ఆవాసాలకు నీటి సరఫరాను జూన్ ఆఖరు వరకు కొనసాగించడంతోపాటు మిగిలిన 316 హ్యాబిటేషన్లలో కూడా జూన్‌లోపు ఎప్పుడు, ఎక్కడ అవసరమైతే అక్కడ సరఫరాకు చర్యలు తీసుకొనేందుకు జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం



అనుమతి ఇచ్చింది. ట్యాంకర్లతో నీటి సరఫరాకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఆయా హ్యాబిటేషన్‌లలో ఒక్కొక్కరికి రోజుకు 40 లీటర్లు సరఫరా చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. హ్యాబిటేషన్ యూనిట్‌గా జనాభా, మొత్తం నీటి అవసరాన్ని గుర్తించి స్థానికంగా అందుబాటులో ఉన్న అన్ని వనరుల నుంచి ఉన్న లభ్యతపోను మిగతా నీటిని ట్యాంకర్లతో సరఫరా చేయాల్సి ఉంటుంది. మొత్తం నీటి సమస్య ఎదురయ్యే 458 ఆవాసాల్లో దాదాపు 6.48 లక్షల మంది జనాభా ఉన్నట్లు అధికార వర్గాల సమాచారం.



పొగాకు కిలో రూ.284

- మరింత పెరిగిన గరిష్ఠ ధర
- లోగ్రేడ్ రేట్లపై కొండపిలో నిరసన

ఒంగోలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పొగాకు మార్కెట్‌లో మేలు రకం గ్రేడ్ ధర మెరిసిపోతోంది. బుధవారం దక్షిణాదిలో గరిష్ఠ ధర కిలో రూ.284 పలికింది. నాలుగు రోజుల క్రితం అత్యధిక ధర కిలో రూ.250లోపు ఉండగా సోమవారం రూ.256, మంగళవారం రూ.279 లభించింది. బుధవారం కిలోకు మరో ఐదు రూపాయలు పెరిగి రూ.284కు చేరింది. ఒంగోలు-1 కేంద్రంలో ఈ ధర దక్కింది. మిగతా అన్ని కేంద్రాల్లోనూ గరిష్ఠ ధర రూ.280పైనే ఉంది. అలాగే లోగ్రేడ్‌లలో నాణ్యత కలిగిన బ్రౌన్ రకం ధర కూడా బుధవారం అధికంగానే ఉంది. ఇంచుమించు అన్ని కేంద్రాల్లోనూ ఈ రకానికి కిలోకు రూ.250పైన లభించింది. అయితే లోగ్రేడ్‌లోని పచ్చ, ఇతర తక్కువ రకం ధరలు వారం నుంచి తిరోగమనంలో ఉండగా బుధవారం కూడా అదేపరిస్థితి కొనసాగింది. పలు కేంద్రాల్లో నోబిడ్‌లు అధికంగా కనిపించాయి. దీనిపై కొండపి వేలం కేంద్రంలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత సేపు కొనుగోళ్లను ఆపి నిరసన తెలిపారు. బోర్డు అధికారులు వారితో మాట్లాడి తిరిగి వేలాన్ని కొనసాగించారు.


దొంగల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ సుమిత్

దొంగలు దొరికారు!

- చీమకుర్తిలో భారీ చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- ఇద్దరు అరెస్టు
- రూ.45లక్షల సొత్తు స్వాధీనం
- వివరాలను వెల్లడించిన ఎస్పీ సుమిత్

ఒంగోలు (క్రైం), ఏప్రిల్ 24 : మండల కేంద్రమైన చీమకుర్తిలో ఈనెల 21న జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వారి వద్ద రూ.45లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వివరాలను బుధవారం ఒంగోలులో ఎస్పీ గరుడ సుమిత్ సునీల్ వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. చీమకుర్తి పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన పమిడి పద్మశ్రీ తన సోదరుడు మృతి చెందడంతో ఈనెల 21న బాపట్ల జిల్లా బల్లికురవ వెళ్లారు. 22వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా బద్దలు కొట్టి ఉంది. అందులో ఉంచిన 75 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు కనిపించలేదు. దీంతో ఆమె చీమకుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ కోసం ఎస్పీ స్వీయ పర్యవేక్షణలో మూడు బృందాలను ఏర్పాటు చేశారు.

దొంగలను పట్టించిన వేలిముద్రలు

రంగంలోకి దిగిన పోలీసులు సంఘటనా స్థలంలో దొరికిన వేలి ముద్రల ఆధారంగా నిందితులను గుర్తించారు. తాళ్లూరు మండలం తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని రామభద్రాపురంనకు చెందిన వదిసేన వేణుగోపాల్‌రెడ్డి, చీమకుర్తిలోని జగనన్న కాలనీకి చెందిన షేక్ తరుణ్ అలియాస్ రఫి ఈచోరీ చేసినట్లు నిర్ధారించుకున్నారు. ఇద్దరినీ బుధవారం రామభద్రాపురంలోని వేణుగోపాల్‌రెడ్డి ఇంటి వద్ద అరెస్టు చేశారు. వారి వద్ద రూ.45లక్షల విలువైన 75 సవర్ల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

నిందితుల్లో అంతర్‌రాష్ట్ర దొంగ

నిందితుల్లో ఒకరైన వేణుగోపాల్‌రెడ్డి అంతర్‌రాష్ట్ర దొంగ. మన రాష్ట్రంలో 13 కేసులతోపాటు తెలంగాణలో మరో ఆరు కేసుల్లో ఆయన నిందితుడిగా ఉన్నాడు. పగలు రోడ్ల వెంట తిరుగుతూ తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి రాత్రుళ్ల చోరీకి పాల్పడతాడు. చీమకుర్తిలో జరిగిన చోరీలో అతనితో షేక్ తరుణ్ కూడా కలిశాడు. ఇతనిపై కూడా కొన్ని చిన్నచిన్న కేసులు ఉన్నాయి. ముందుగానే వారిని అనుమానించిన పోలీసులు విచారించి వదిలేశారు. అయితే సంఘటనా స్థలంలో దొరికిన వేలిముద్రలతో వారి వేలిముద్రలు సరిపోలినట్లు నిపుణులు గుర్తించడంతో తిరిగి మరోసారి అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో చోరీ చేసింది తామేనని ఒప్పుకున్నారు. కేసును అత్యంత వేగంగా ఛేదించిన అదనపు ఎస్పీ (క్రైమ్స్) శ్రీధర్‌రావు, ఒంగోలు డీఎస్పీ ఎం.కిషోర్‌బాబు, చీమకుర్తి సీఐ దుర్గాప్రసాద్, సీసీఎస్ సీఐ టి.విజయకృష్ణలతోపాటు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.


ర్యాలీ సమయంలో ప్రణీత్‌రెడ్డితో ఉన్న కానిస్టేబుల్ రత్నబాబు

కానిస్టేబుల్ రత్నబాబుపై వేటు

- సస్పెండ్ చేసినట్లు ఎస్పీ సుమిత్ వెల్లడి
- వైసీపీ ర్యాలీలో పాల్గొనడమే కారణం

ఒంగోలు (క్రైం), ఏప్రిల్ 24 : ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి వైసీపీ ర్యాలీలో పాల్గొన్న కానిస్టేబుల్ డి.ఎస్.బి. రత్నబాబు అలియాస్ గోపిపై వేటు పడింది. ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ గరుడ సుమిత్ సునీల్ ఉత్తర్వులు ఇచ్చారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జస్వంతరావు ఒంగోలు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు రత్నబాబుపై కేసు కూడా నమోదు చేసినట్లు ఎస్పీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న రత్నబాబు ఎఫ్‌సీఐ గోదాం వద్ద చెక్‌పోస్టులో విధులు నిర్వర్తించాల్సి ఉంది. కానీ ఆయన కోడ్‌ను ఉల్లంఘించి వైసీపీ ఒంగోలు అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి నామినేషన్ సందర్భంగా సోమవారం నగరంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసు అధికారులు నివేదిక ఇవ్వడంతో ఎస్పీ చర్యలు తీసుకున్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఎవ్వరూ రాజకీయ పార్టీల ర్యాలీలో పాల్గొనడం కానీ, వారితో సన్నిహితంగా ఉండటం కానీ చేయకూడదన్నారు. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.


వల్లూరమ్మ ఆలయంలో దామచర్ల దంపతుల పూజలు


ర్యాలీకి భారీగా తరలివచ్చిన శ్రేణులు


ఆర్యవైశ్య మహిళలతో జనార్దన్

అట్టహాసంగా దామచర్ల నామినేషన్

- విజయం కాంక్షిస్తూ వెల్లువెత్తిన అభిమానం
- జనార్దన్ కోసం స్వచ్ఛందంగా కదిలిన జనసేన, బీజేపీ శ్రేణులు
- ఒంగోలులో టీడీపీ కూటమి ఆధ్వర్యంలో ర్యాలీ అదుర్స్..



నామినేషన్లను అందజేస్తున్న దామచర్ల జనార్దన్, నాగసత్యలత, ఇతర నాయకులు


ర్యాలీలో చిన్నారులతో..

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 24: తెలుగుదేశం పార్టీ కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ నామినేషన్ బుధవారం అభిమానుల మధ్య అట్టహాసంగా జరిగింది. కుటుంబసభ్యులతో కలిసి దామచర్ల ముందుగా వల్లూరులోని వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అభిమానుల మధ్య ర్యాలీగా నగరానికి చేరుకున్నారు. మినీ స్టేడియం నుంచి స్థానిక ఆర్డీవో కార్యాలయం వరకు వేలాదిగా తరలి వచ్చిన అభిమానులతో కలిసి ముందుకు సాగారు. ప్రత్యేకంగా ఏర్పాటు ప్రచార వాహనంపై నుంచి కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్‌తోపాటు, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, బీజేపీ జిల్లా అధ్యక్షులు శివారెడ్డి శ్రేణులకు అభివాదం చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక టీకే ఎన్‌క్లేవ్ వద్ద నుంచి నామినేషన్ ముహూర్తం సమయం దగ్గరపడుతుండటంతో బైక్‌పై ఆర్డీవో ఆఫీసు వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఇదిలా ఉండగా, దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత, దామచర్ల సత్య, ఆయన సతీమణిలు డమ్మీ నామినేషన్లు దాఖలు చేశారు. పార్టీ శ్రేణులు కొనసాగించిన ర్యాలీ మండుటెండలో సైతం నిర్విరామంగా సాగింది. దాదాపు మూడు గంటలపాటు సాగిన ర్యాలీ ఆద్యంతం తెలుగుదేశం పార్టీ విజయ సంకేతాన్ని చాటింది.

కదిలివచ్చిన ఊరూవాడా..

దామచర్ల నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఊరూవాడా కదిలి వచ్చింది. ఒంగోలు నగరంతో పాటు, కొత్తపట్నం, ఒంగోలు రూరల్, తదితర ప్రాంతాల నుంచి మహిళలు, యువత, పార్టీ శ్రేణులు, దామచర్ల అభిమానులు పెద్ద సంఖ్యలో కదలి రావడంతో జన హోరు కనిపించింది. స్థానిక మినీ స్టేడియం దగ్గర నుంచి మొదలైన ర్యాలీ నెల్లూరు బస్టాండ్ వరకు చేరుకుంది. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, కార్యకర్తలతోపాటు, ప్రజలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొని మద్దతు ప్రకటించారు. భారీగా పార్టీ జెండాలు చేతపట్టుకుని పసుపు చొక్కాలు ధరించి, పసుపు బెలెనూన్లతో సందడి చేశారు. మేళ తాళాలు, డీజే సౌండ్స్, తప్పెట్ల మోతలతో సాగిన ర్యాలీ ఆద్యంతం శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపించింది. అయితే దామచర్ల నామినేషన్ విజయవంతం కోసం జనం స్వచ్ఛందంగా తరలిరావడం విశేషం. ఎలాంటి నజరానాలు, తాయిలాలు లేకుండా తమ అభిమానాన్ని చాటడం ఇక్కడ కనిపించింది. సుమారు పదిహేనువేల మందికిపై ప్రజలు పాల్గొనగా, ర్యాలీ జరిగిన ప్రాంతమంతా పసుపు మయంగా మారింది.

టీడీపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు : దామచర్ల


విజయసంకేతం చూపుతున్న దామచర్ల కుటుంబసభ్యులు

సైకోపాలనకు గుణపాఠం చెప్పి, ప్రజలు కోరుకున్న సుపరిపాలన సాధించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ స్పష్టం చేశారు. ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ వేసిన అనంతరం దామచర్ల మీడియాపాయింట్ వద్ద మాట్లాడారు. గత ఐదేళ్ళలో రాష్ట్ర ప్రజలు నానా అవస్థలు పడ్డారన్నారు. నగరంలో ఇష్టారాజ్యంగా భూములు ఆక్రమించి ప్రజల సొమ్ము దోచుకున్నారని విమర్శించారు. ఒక్క అభివృద్ధి పని చేయకుండా మాయమాటలు, చేయలేని హామీలతో ప్రజలను పదేపదే మోసం చేస్తున్న వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని చెప్పారు. ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధి తెలుగుదేశం పార్టీ హయాంలోనే జరిగిందని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్ళు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు. అలాగే ప్రతిరోజు నగర ప్రజలకు తాగునీరు అందించేందుకు తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు రూ.163 కోట్లు నిధులు మంజూరు చేయగా, 80 శాతం పనులు పూర్తయ్యాయని, గడిచిన ఐదేళ్ళలో ఒక్కపని పూర్తి చేయకలేక వైసీపీ చేతులెత్తేసిందన్నారు. తాము అధికారంలోకి రాగానే రోజు నీరు అందించే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఒంగోలులో వైసీపీ నేతలు భూ ఆక్రమణలు, దందాలు, దౌర్జన్యాలు, ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని దామచర్ల పేర్కొన్నారు. అందుకు సమతానగర్‌లో జరిగిన ఘటన, రిమ్స్‌లో జరిగిన రౌడీయిజం అంతా ప్రజలు గమనించారన్నారు. అభివృద్ధి చేసే పార్టీ కావాలా. లేక అరాచకాలు చేసే పార్టీ కావాలా అనేది ప్రజలు గుర్తించాలని కోరారు. నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదిస్తారనే నమ్మకం ఉందని తెలిపారు. సమావేశంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ యోగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


రెపరెపలాడుతున్న పసుపు జెండాలు


ర్యాలీలో అభివాదం చేస్తున్న జనసేన, టీడీపీ శ్రేణులు

నేడు చదలవాడ రఘునాయకస్వామి కల్యాణోత్సవం

- ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 24: నాగులుప్పలపాడు మండలం చదలవాడలోని ప్రసిద్ధమైన శ్రీరఘునాయకస్వామి వారి కల్యాణోత్సవంలో గురువారం వైభవంగా జరగనుంది. అనంతరం స్వామివారి రథోత్సవం నేత్రపర్వంగా సాగనుంది. ఇందుకోసం ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.


రఘునాయక స్వామి వారి మూలవిరాట్

ఆలయ విశిష్టత : రఘునాయకస్వామి ఆలయానికి ఎంత విశిష్టత ఉంది. చదలవాడకు చతుర్వాటిక అని మరో పేరు ఉన్నట్లు స్థలపురాణం వెల్లడిస్తుంది. త్రేతాయుగంలో శ్రీరాముడు సీతను అన్వేషిస్తూ వానర సైన్యంతో చదలవాడ ప్రాంతానికి చేరుకున్నారు. వానర సైన్యాన్ని నాలుగు భాగాలుగా చేసి నాలుగు దిక్కులకు పంపారు. అందువల్ల ఈ ప్రాంతానికి చతుర్వాటిక అనే పేరు కల్గింది. దక్షిణ దిక్కుగా వెళ్ళిన హనుమంతుని రాక కోసం నిరీక్షిస్తున్నట్లుగా రఘునాయక స్వామి దక్షిణాభిముఖుడై ఆలయంలో దర్శనమిస్తారు. అగస్త్య మహర్షి సీతారామలక్ష్మణుల విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించినట్లు ప్రతీతి. సీతాదేవి విగ్రహం రాముడికి కుడివైపు భాగంలో ఉన్నట్లుగా ప్రతిష్ఠించడం ఇక్కడి విశేషం.

ఎర్రన అనుబంధం.. : చదలవాడ అనగానే మహా కవి ఎర్రన పేరు గుర్తుకు వస్తుంది. రెడ్డిరాజుల ఆస్థాన కవిగా వ్యవహరించిన ఎర్రన చదలవాడలో కొంతకాలం నివసించి స్వామివారిని సేవించారు. ఇక్కడే మహాభారతంలోని అరణ్యపర్వ శేషాన్ని పూర్తిచేసినట్లు పలువురు విశ్వసిస్తున్నారు.

గరుడ పక్షి ప్రదక్షిణలు : స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా తలంబ్రాలు పోసే సమయంలో ఎక్కడి నుంచో గరుడ పక్షి వచ్చి మూడు సార్లు ఆలయంపై ప్రదిక్షణ చేసి వెళ్తుంది. గరుడ పక్షి వచ్చిన తర్వాతనే స్వామి వారికి తలంబ్రాలు పోస్తారు. గరుడ పక్షిని చూసేందుకు, స్వామి కళ్యాణాన్ని కన్నులారా వీక్షించేందుకు వేల సంఖ్యలో భక్తులు విచ్చేస్తారు అదే రోజు సాయంత్రం చదలవాడ తిరుణాల రఘునాయకస్వామి రథోత్సవం జరుగుతాయి. ఈ ఉత్సవాల సమయంలో భద్రాచలంలోని శ్రీరాముడు, చదలవాడ రఘునాయక స్వామిలో ప్రవేశిస్తాడని భక్తుల విశ్వాసం. ప్రముఖ తరంగ గాయకుడు బొమ్మరాజు సీతారామదాసు 1942లో రఘనాయక స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొని స్వామి వారిపై కీర్తనలు ఆలపిస్తూ తనువు చాలించాడు. అప్పటి నుంచి ఆయన వంశీయులు ఈ ఉత్సవాల్లో తరంగ గానం చేయటం ఆనవాయితీగా మారింది. కాగా రఘునాయక స్వామి కళ్యాణమహోత్సవానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి అనీల్ తెలిపారు.

పోలీసుల బందోబస్తు : చదలవాడ రఘునాయక స్వామి తిరుణాల మహోత్సవంలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్సై బ్రహ్మనాయుడు తెలిపారు.

గజవాహనంపై దర్శనమిచ్చిన స్వామివారు

కాగా చదలవాడలోని శ్రీ రఘునాయకస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మద్దిరాలపాడుకు చెందిన పెనుబోతు రంగారావు, భాస్కరరావు, మల్లికార్జునరావు, భానుప్రసాదు, నిర్మల కుమార్, శంకరరావు, శ్రీనివాసరావు, శ్రీధర్‌బాబు, నాగేశ్వరరావు, వాసు బాబు, హైమావతి ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి గజవాహనంపై స్వామి విహరించారు. గంగాభవాని కోలాట సమాజం మాస్టార్ ఉన్నం ప్రసాద్‌చే కోలాటం, ఒంగోలు జేజే ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహించారు.

ఎన్నికల సందేహాలపై ఫిర్యాదు చేయవచ్చు : ఆర్వో

చీమకుర్తి, ఏప్రిల్24 : సంతనూతలపాడు, రేపల్లె, పర్చూరు, చీరాల నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్ ఖజాన్సింగ్ ఎన్నికల నిర్వహణను పరిశీలించటానికి బుధవారం విచ్చేశారు. చీరాలలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో బస చేశారని, ఆయా నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు, ఏజెంట్లు, ప్రజలు సందేహాల నివృత్తి, అలాగే ఫిర్యాదులు చేయాలంటే 8985382855 నంబర్‌కు కాల్ చేసి తెలుపవచ్చని ఆర్వో గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆదిలక్ష్మి సేవలు అమూల్యం

ఒంగోలు(కల్చరల్), ఏ ప్రిల్ 24: జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా కాసు ఆదిలక్ష్మి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో పలువురు ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, హార్టికల్చర్‌శాఖ డీడీ అన్నపూర్ణ, బొమ్మల కోటేశ్వరి, కె.సంపూర్ణ, కె.కృష్ణవేణి, జి.శాంసన్, డి.సందీప్, వై.మృదుల్‌కుమార్, లక్ష్మి, నున్నా ఆంజనేయులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం

- టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ ధ్వజం
- తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్న మాజీ ఎంపీపీ కుమారస్వామి
- భారీగా చేరికలు


కుమారస్వామిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయ్‌కుమార్


నాగులులప్పలపాడులో పార్టీలో చేరిన వారితో బీఎన్

మద్దిపాడు, ఏప్రిల్ 24: వైసీపీ పాలనలో రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ విమర్శించారు. బుధవారం లింగంగుంట గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకొని పోతే అధికార పార్టీ నాయకులు పట్టించుకోలేదని, రైతులు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు మహిళలకు అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అడకస్వాములు, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ మన్నం కృష్ణకిషోర్, నల్లూరి నరసింహారావు, ఆరికట్ల గోపి, పాలెపు చంద్రశేఖర్, చల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు మాజీ ఎంపీపీ చేరిక

మద్దిపాడు మండలం నుంచి తెలుగుదేశం పార్టీలో వలసలు జోరందుకున్నాయి. బుధవారం ఒంగోలులోని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ సమక్షంలో ఘడియపూడికి చెందిన మాజీ ఎంపీపీ అప్పల కుమారస్వామి తన అనుచరులతో తెలుగుదేశంలో చేరారు. బీఎన్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదర స్వాగతం పలికారు. అలాగే పెద్దకొత్తపల్లి వైసీపీ నాయకులు నర్రా సురేష్, వార్డు మెంబర్లు చందలూరి ఆంజనేయులు, కర్ల హరిబాబు, బూరేపల్లి గ్రామానికి చెందిన కురిచేటి శ్రీనివాసరావు, కురిచేటి బ్రహ్మయ్య, శ్రీను, శ్రీకాంత్, రాము, యల్లమందల పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో టీడీపీల చేరగా వారికి విజయ్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నల్లూరి రామచంద్రయ్య, కొమ్మాలపాటి సుబ్బారావు, నల్లూరి సంజీవరావు, నల్లూరి వెంకట్రావు, ముల్లూరి మురళి, దేవబత్తిన ప్రసాద్, మండవ గోపానాథ్ తదితరులు పాల్గొన్నారు.

నాగులులప్పలపాడులో..


నాగులుప్పలపాడు : నాగులుప్పలపాడుకు చెందిన వైసీపీ నాయకులు జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మారెళ్ళ వెంకట శేషయ్య, ఆయన తనయుడు ఓబన్నపాలెం సొసైటీ అధ్యక్షులు మారెళ్ళ కిరణ్‌కుమార్ టీడీపీలో చేరారు. అలాగే మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొనకల పున్నారావు, ఒమ్మెవరం వైసీపీ నాయకులు కొమ్మలపాటి రాముడు, శ్రీరామమూర్తితో పాటు మరో 100 కుటుంబాలు టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ సమక్షంలో బుధవారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ బీఎన్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాగా నాగులుప్పలపాడులో ఎన్డీఏ కూటమి కార్యాలయాన్ని బుధవారం బీఎన్.విజయ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి, పార్టీ మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్ కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి గుమ్మడి సాయిబాబా, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, మాజీ జడ్పీటీసీ షేక్ ఖాజావలి, యూనిట్ ఇన్‌చార్జి ఆళ్ళ నాగార్జున, గ్రామ అధ్యక్షులు ఉన్నం వెంకట్రావు, ఝాన్సీ, చుండూరి నాగేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షులు సురేష్, కొమ్మలపాటి సురేష్, హరినాథ్, చలపతి, కనగాల శ్రీనివాసరావు, జాన్సన్, సెల్వం, జనసేన పార్టీ ఉపాధ్యక్షులు ధనుష్, సాయి చరణ్, సర్పంచ్ బాలకోటయ్య పాల్గొన్నారు.

బీఎన్ విస్తృత ప్రచారం

చీమకుర్తి: మండలంలోని పి.నాయుడుపాలెం గ్రామంలో టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజల నుంచి అఖండస్వాగతం లభించింది. గ్రామంలో ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయుడుపాలెం అభివృద్ధికి తాను మంజూరు చేసిన నిధులు, పనులను గ్రామస్థులకు గుర్తుచేశారు త్వరలో జరిగే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, కూరాకుల కరుణాకరరెడ్డి, అలుగుండ్ల శ్రీనివాసరెడ్డి, తొరటి రోశయ్య, నరసింహారావు, సుబ్బారెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఏలూరివారిపాలెంలో..

ఏలూరివారిపాలెం గ్రామంలో టీడీపీ నాయకుడు గోగినేని రాజా ఆధ్వర్యంలో వైసీపీ కార్యదర్శి మన్నం శ్రీనివాసరావు, బక్కా ఏసోబు, గంగవరపు జేమ్స్, పాటిబండ్ల పెదకోటేశు, ఏసుపోగు కోటయ్య, బక్కా కోటేశు, కోటయ్య, శ్రీను, ఏలేషు, ప్రకాశం, మరియదాసు తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి విజయ్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతించారు.


ఏలూరివారిపాలెంలో పార్టీలోకి చేరిన వారితో విజయ్‌కుమార్


స్వామివార్ల కల్యాణోత్సవంలో పాల్గొన్న శిద్దా కుటుంబసభ్యులు

వైభవంగా శాంతికల్యాణం

చీమకుర్తి, ఏప్రిల్ 24 : చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రం వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం హరిహరుల శాంతికళ్యాణం అత్యంత రమణీయంగా జరిగింది. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, సతీమణి లక్ష్మీపద్మావతి కళ్యాణవేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరిహరులు కృపతో సమస్త మానవాళి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు వానే తెలిపారు. కార్యక్రమంలో శిద్దా పాండురంగారావు, శిద్దా హనుమంతరావు, శిద్దా బాలాజీ దంపతులు, ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

30లోపు టీచర్ల రెగ్యులరైజేషన్‌కు ప్రతిపాదనలు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 24: జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూలు అసిస్టెంట్లు, భాషా పండితులుగా డీఎస్సీలో ఎంపికై ఇప్పటి వరకు సర్వీసు రెగ్యులరైజేషన్ కాని టీచర్ల సర్వీసు క్రమబద్ధీకరణకు జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర చర్యలు చేపట్టారు. వారి సర్వీసు రెగ్యులరైజేషన్‌కు ఈనెల 30లోపు ప్రతిపాదనలు పంపించాలని ఉప విద్యాధికారులు, మండల విద్యాధిరులను ఆదేశించారు. పోలీస్‌శాఖ ఇంటెలిజెన్స్ విభాగం నుంచి ఎంటీసీడెంట్లు వచ్చిన టీచర్ల సర్వీసు రెగ్యులరైజేషన్‌కు ప్రతిపాదనలు పంపాలని పేర్కొన్నారు. పోలీస్‌శాఖ నుంచి ఎంటీసీడెంట్లు వచ్చిన ఉపాధ్యాయుల వివరాలు ఇప్పటికే ఎంఈవోలు, ఉప విద్యాధికారులు, హైస్కూలు ప్రధానోపాధ్యాయులకు డీఈవో కార్యాలయం నుంచి వివరాలు పంపించారు. వాటి ఆధారంగా ఎంటీసీడెంట్లు వచ్చిన టీచర్ల సర్వీసు రెగ్యులరైజేషన్‌కు మాత్రమే ప్రతిపాదనలు పంపాలి. గత మూడేళ్లుగా ఈ ప్రక్రియ నిలిచిపోవడంతో ప్రస్తుతం క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు. ఇంకా పోలీస్‌శాఖ నుంచి ఎంటీసీడెంట్లు రాని టీచర్ల వివరాలు జిల్లా ఎస్పీకి పంపి వారివి కూడా వెంటనే వచ్చేలా చర్యలు తీసుకోవాలని డీఈవో ఆదేశించారు.

పోస్టల్ బ్యాలెట్ సదుపాయం వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 24: పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సదుపాయం వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో నియోజకవర్గ స్థాయి పోస్టల్ బ్యాలెట్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోస్టల్‌బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 26వ వరకు ఉన్నందున సంబంధిత దరఖాస్తులను సిబ్బంది నుంచి పూర్తి స్థాయిలో సేకరించాలన్నారు. ఈ దిశగా ఇప్పటికే సేకరించిన దరఖాస్తులను సంబంధిత నియోజకవర్గాలవారీగా అధికారులు పరస్పరం బదిలీ చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో డీఆర్వో ఆర్.శ్రీలత, బ్యాలెట్ జిల్లా నోడల్ అధికారి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 23: జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో ఒంగోలుకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటారు. నగరంలోని ది లార్డ్ కృష్ణ షటిల్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన దండు ఆశ్రీ, విష్ణుకేదార్ మంగళవారం విజయవాడలో జరిగిన అండర్-11, అండర్-17 విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చాటారు. దీంతో రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులో అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ద్వారకానాథ్, అంకమ్మచౌదరిలు మాట్లాడుతూ చిన్నారులు జాతీయ స్థాయిలో రాణించి అకాడమీకి, జిల్లా అసోసియేషన్‌కు మంచి పేరు తీసుకువచ్చారని అభినందించారు. కార్యక్రమంలో ది లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్ శిద్దా సుధీర్‌కుమార్, ఫౌండర్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, పీడీబీఏ అధ్యక్షుడు లక్ష్మణ్‌రెడ్డి, కార్యదర్శి పి.విజయ్ కృష్ణ, ట్రెజరర్ అశోక్‌రెడ్డి, దండు శ్రీనివాసరావు, రఘుబాబు, కోడే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఒంగోలు అసెంబ్లీకి 8 మంది..11 సెట్ల నామినేషన్లు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 24: ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎనిమిది మంది అభ్యర్థులు 11 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి సుబ్బారెడ్డికి బుధవారం నామినేషన్లను దాఖలు చేశారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా దామచర్ల సత్యనారాయణ మరో రెండు సెట్ల నామినేషన్లు అందజేశారు. స్వతంత్ర అభ్యర్థిగా షేక్ హుస్సేన్‌బీ, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి బ్రహ్మనాయుడు బిళ్ళా రెండు సెట్ల నామినేషన్లు, జైమహాభారత్ పార్టీ అభ్యర్థి సింగమనేని శ్రీకాంత్, స్వతంత్ర అభ్యర్థి పటాపంజుల శ్రీనివాసరావు, ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థి వెంకటేషన్ బాబురావు, స్వతంత్ర అభ్యర్థి అక్కరాజు నిర్మల్ నామినేషన్ దాఖలు చేశారు.

ఒంగోలు పార్లమెంట్‌కు ఎనిమిది...

ఒంగోలు లోక్‌సభ స్థానానికి ఎనిమిది మంది అభ్యర్థులు 9 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్‌ఛాంబర్‌లో ఎన్నికల అధికారి దినేష్‌కుమార్‌కు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా దేవిరెడ్డి బాలాంజనేయులు. స్వతంత్ర అభ్యర్థి కాటమాల వెంకటేశ్వర్లు, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థి షేక్ జిలాని, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియాఅభ్యర్థి బడుగు నరసింగరావు రెండు సెట్లు దాఖలు చేయగా, జాతీయసేన పార్టీ అభ్యర్థి కోనింటి పవన్ కళ్యాణ్, స్వతంత్ర అభ్యర్థి కరాటపు రాజు, జైభారత్ జాతీయపార్టీ అభ్యర్థి ఓర్సు వీణ, స్వతంత్ర అభ్యర్థి మోహన్‌గౌడ్ నామినేషన్లు దాఖలు చేశారు.

ఏకేయూ బీపీఈడీ ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ అంజిరెడ్డి

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 24: ఒంగోలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం బీపీఈడీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాలను వైస్ చాన్సలర్ మారెడ్డి అంజిరెడ్డి బుధవారం విడుదల చేశారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో 65.6శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతలో బాలుర కంటే బాలికలదే పైచేయి సాధించారు. బాలురు 62.9శాతం, బాలికలు 73.6శాతం పాసయ్యారు. గిద్దలూరు కళాశాల విద్యార్థి జె. కుమార్ 8.29 ఎస్‌జీపీఏతో యూనివర్శిటీ ప్రథమ స్థానంలో నిలిచారు. సింగరాయకొండ ఎస్.మల్లికార్జునరెడ్డి, టి.వెంకటశ్రీవిద్యలు 7.99తో రెండో స్థానం, జి.తేంద్రహరిజన్ 7.99శాతంతో మూడో స్థానంలో నిలిచారు. అలాగే డీపీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో కేవలం 48.3శాతం మంది మాత్రమే పాసయ్యారు. దీనిలోనూ బాలుర కంటే బాలికలే ఉత్తీర్ణత సాధించారు. బాలురు 45.5శాతం, బాలికలు 12శాతం అదనంగా 57.2శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను వీసీ అంజిరెడ్డి, రిజిస్ట్రార్ హరిబాబు, సీఈ కేవీఎస్.రాజు, ప్రిన్సిపాల్ రాజమోహన్, ఆర్.శ్రీనివాసులు అభినందించారు. కాగా విద్యార్థుల వివరాలు లేకుండా ఫలితాలు ప్రకటనపై పలువురు ప్రశ్నిస్తున్నారు.

వైభవంగా చెన్నకేశవుని రథోత్సవం

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 24: ఒంగోలు నగరం కేశవస్వామిపేటలోని శ్రీప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి స్వామివారి రథోత్సవం కన్నులపండుగగా జరిగింది. ఈ సందర్భంగా సర్వాలంకార భూషితుడైన స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి ఆలయ అర్చకులు వేదోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం నగరంలోని పలు ప్రధాన వీధుల్లో వాహనసేవ వైభవంగా కొనసాగింది. కాగా ఉదయం కుంభారాధన, గజవాహన సేవ జరిగాయి. రథోత్సవం సందర్భంగా శ్రీలక్ష్మీ వెంకటరమణ మహిళా కోలాట భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాటం, పద్మశ్రీ ఘంటసాల, వి.రామకృష్ణ సాంస్కృతిక సేవాసమితి వారి సంగీత విభావరి భక్తులను విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో డి.రజనీకుమారి, కమిటీ ప్రతినిధులు గురునాథరావు, నెమ్మాని హరిప్రియా దేవి, కరేటి కిరణ్, పి.గోవర్ధన్‌రెడ్డి, దార్ల వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

మంత్రి నాగార్జున నామినేషన్ దాఖలు

చీమకుర్తి, ఏప్రిల్ 24 : మంత్రి మేరుగ నాగార్జున బుధవారం చీమకుర్తిలో నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు ఉన్నారు.

హనుమారెడ్డిసాహిత్య సేవలు చిరస్మరణీయం


నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 24: జిల్లా సాహిత్య రంగానికి ప్రకాశం జిల్లా రచయితల సంఘం (ప్రరసం) పూర్వ అధ్యక్షులు బి.హనుమారెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. బుధవారం హనుమారెడ్డి జయంతిని స్థానిక రాజాపానగల్ రోడ్డులోని సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పొన్నూరి వేంకటశ్రీనివాసులు, యత్తపు కొండారెడ్డి, దివాకర్ దత్తు, మహబూబ్‌జాన్, మోడమంచు వెంకటేశ్వర్లు, కేఎస్‌వీ.ప్రసాద్, విజయకుమారి, సాయికుమార్, సయ్యద్‌ఇస్మాయిల్, గంగిశెట్టి నరసింహారావు, ఒరుగంటి ప్రసాద్, పొత్తూరి బదరి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న టీడీపీ కూటమి నాయకులు

దళితుల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

● ఇంటింటికీ శంఖారావం ప్రచారంలో నేతలు

టంగుటూరు, ఏప్రిల్ 24 : ఎస్సీ సామాజిక వర్గాల వారి సంక్షేమం తెలుగుదేశం పార్టీకే సాధ్యమని పలువురు టీడీపీ నాయకులు అన్నారు. టంగుటూరు బాపూజీకాలనీలో బుధవారం ఇంటింటికీ తెలుగుదేశం శంఖారావం ప్రచార కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ఎస్సీ సామాజిక వర్గాల అభ్యున్నతికి ఎస్సీ వర్గాల వారంతా తెలుగుదేశం కూటమి అభ్యర్థులకే మద్దతుగా నిలవాలని కోరారు. షెడ్యూల్ కులాల పిల్లల విద్యాభ్యాసానికి తెలుగుదేశం ప్రభుత్వం 1984లోనే భరోసా కల్పించిందన్నారు. ప్రత్యేక సొసైటీని నెలకొల్పి దీని ద్వారా గురుకుల పాఠశాలలు నెలకొల్పారని గుర్తు చేశారు. పెరిగిన ఎస్సీ జనాభా కోసం అప్పటి వరకు ఉన్న 14శాతం రిజర్వేషన్లను 15శాతానికి పెంచింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, అరాచకాలను అరికట్టేందుకు కోర్టులోని కేసులు త్వరగా పరిష్కరించేలా టీడీపీ ప్రభుత్వం 22 మొబైల్ కోర్టులు, 23 ప్రత్యేక కోర్టులను మంజూరు చేసిందన్నారు. దళిత యువతను ఆర్థికంగా ఆదుకునేందుకు ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, సబ్‌ప్లాన్ నిధుల వినియోగం, భూమి కొనుగోలు పథకం, కులాంతర వివాహాల ప్రోత్సాహం, బ్యాక్ లాగ్ ఉద్యోగాల నియామకం, ఎస్సీ, ఎస్టీ కారుణ్య నియామకాలు, ప్రమోషన్లలో రిజర్వేషన్లు, భవన నిర్మాణ కార్మికులకు ప్రోత్సాహకాలు, జగ్జీవన్ జ్యోతి ఉచిత విద్యుత్ పథకం అమలు పరచి దళితుల ఉద్ధరణకు పాటుపడింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కామని విజయకుమార్, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నేత బెజవాడ వెంకటేశ్వర్లు, తెలుగుయువత నేత అబ్బూరి అభిషేక్, స్థానిక ఎస్సీ నాయకుడు జక్కుల శ్రీను, ఈశ్వరరావు, పార్టీ నాయకులు మొలకలపల్లి శ్రీనివాస్, పెద్దోడు, యజమాని, కంద్ర శ్రీను, కుందేటి వెంకట్రావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే స్వామి భార్య రాజేశ్వరి తరుపున నామినేషన్ వేస్తున్న టీడీపీ నాయకులు

నాలుగు నామినేషన్లు దాఖలు

కొండపి, ఏప్రిల్24: కొండపి అసెంబ్లీ స్థానానికి బుధవారం నలుగురు తమ నాయకుల తరుపున నామినేషన్లను దాఖలు చేశారు. తెలుగుదేశం పార్టీ తరుపున ఎమ్మెల్యే స్వామి భార్య రాజేశ్వరి తరుపున సింగరాయకొండ మండలానికి చెందిన టీడీపీ నాయకుడు మించల బ్రహ్మయ్య ఒకసెట్ నామినేషన్ వేశారు. పొన్నలూరు మండలం అగ్రహారానికి చెందిన మామిడి మాల్యాద్రి, మార్కాపురం మండలంలోని గజ్జలకొండ గ్రామానికి చెందిన జమ్ములమూడి పోలయ్య ఇండిపెండెంట్‌లుగా నామినేషన్‌లు వేశారు. అదేవిధంగా ఒంగోలు అంజయ్య రోడ్డుకు చెందిన వంగేపురం కసిరాజు సమాజ్ వాదీ పార్టీ తరుపున నామినేషన్ వేశారు.



టంగుటూరు కేంద్రంలో కొనసాగుతున్న పొగాకు వేలం

పొగాకు గరిష్ఠ ధర రూ. 283

టంగుటూరు, ఏప్రిల్ 24 : టంగుటూరులోని పొగాకు వేలం కేంద్రంలో పొగాకు ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. బుధవారం జరిగిన పొగాకు వేలంలో మేలురకం పొగాకు గరిష్ఠ ధర రూ.283 పలికింది. కనిష్ఠ ధర రూ. 220 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. బుధవారం ఎం నిడమలూరు రైతులు 1,066 పొగాకు బేళ్లు అనుమతించారు. ఇందులో 943 బేళ్ల కొనుగోలు జరుగగా మిగిలిన బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిఉన్న బేళ్లలో ఎన్‌బీ-82 కాగా, ఆర్‌ఆర్-10 బేళ్లు, సీఆర్-19బేళ్లు అయ్యాయి. గరిష్ఠ ధర రూ. 283 కాగా, కనిష్ఠ ధర రూ.220 రైతులకు లభించింది. కొనుగోళ్లలో 19 కంపెనీలు పాల్గొన్నాయి. సరాసరి ధర రూ.243.97 లభించింది.



గుంటిగంగలోని గంగాభవానీ ఆలయం (ఇన్‌సెట్లో) అమ్మవారి మూలవిరాట్

నేడు గుంటిగంగ తిరునాళ్ల

తాళ్లూరు ఏప్రిల్ 24: మండలంలోని గుంటిగంగలో కొలువై ఉన్న గంగాభవానీ అమ్మవారు తిరునాళ్లకు ముస్తాబైంది. జిల్లాప్రజల ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా దేవదాయ శాఖ ఏర్పాట్లుచేసింది. ఏటా చైత్రబహుళ విదియ రోజున గంగా భవానీ అమ్మవారికి తిరునాళ్ల నిర్వహించటం ఆనవాయితీ. సోమవరప్పాడు, తూర్పుగంగవరం, రామభద్రాపురం గ్రామాల్లో ఉత్సవాలు ఆరంభమయ్యాయి. బుధవారం రాత్రి సోమవరప్పాడు గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం గురువారం ఉదయం 6 గంటలకు ఉత్సవాలు మొదలవుతాయి.

గతంలో గంగమ్మకు మొక్కుబడిగా రాజకీయనేతలు పోటాపోటీగా అధికసంఖ్యలో విద్యుత్తుప్రభలు ఏర్పాటుచేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈఏడాది ఎన్నికల కోడ్ ఉన్నందున పార్టీపరంగా కార్యక్రమాలు ఏర్పాటుచేసే అవకాశంలేదు. తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేందుకు పోలీసుబందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ వైవీ రమణయ్య తెలిపారు. తిరునాళ్లకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఆయా సత్రాల్లో ఉచిత భోజన వసతికి ఏర్పాట్లు చేశారు.

గంగమ్మ పేరు ఇలా..

గంగాభవానీ గుడికి దక్షిణంవైపు రాతి గుండు కిందుగా ఒక నీటిధార ప్రవహిస్తూ ఉండేది. పూర్వం దీనిని గుండుగంగ అని పిలిచేవారు. చుట్టుప్రక్కలగ్రామాల వారు కాలువ తవ్వి ఆనీటితో తమచవుడు భూములను పంట భూములుగా మార్చుకునేందుకు యత్నించారు. ఆ రాతి గుండును తొలగిస్తే పెద్దజల ఉంటుందని భావించి ఆయా గ్రామాలకు చెందిన రైతులు రాతిగుండును తొలగించారు. జల పెరగకపోగా పెద్దగుంత ఏర్పడింది. అలా అక్కడవెలసిన గుంటగంగ కాలక్రమేణ గుంటిగంగగా మారింది.

చంద్రన్న సారథ్యంలోనే సంక్షేమ ప్రభుత్వం

● అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాల్లా సాగుతాయి

● ప్రచారంలో ఎమ్మెల్యే స్వామి



ముప్పాళ్లలోని ఎస్సీ కాలనీలో ప్రచారంలో ఎమ్మెల్యే స్వామి

పొన్నలూరు (కొండపి), ఏప్రిల్ 24: ఎన్నికల అనంతరం రాష్ట్రంలో చంద్రబాబు సారథ్యంలో నిజమైన సంక్షేమ రాజ్యం రాబోతోందని కొండపి ఎమ్మెల్యే, టీడీపీ కూటమి బలపరుస్తున్న కొండపి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని ముత్తరాజుపాలెం శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోని ముప్పాళ్ల, కొత్త,పాతసింగరబొట్లపాలెంలు, వెల్లటూరు, వేంపాడు, ఉప్పలదిన్నె, రావులకొల్లు, తేటుపేట, వెంకుపాలెం, ముండ్లమూరివారిపాలెం, రామన్నపాలెం గ్రామాల్లో స్వామి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని కూడళ్లలో స్వామి ప్రచార రథంపై నుంచి ఆయా గ్రామాల నాయకులతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాల మాదిరిగా పరిగెడనున్నాయన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. సీఎం జగన్ మద్యం, ఇసుక, గంజాయి మాఫియా కేంద్రంగా రాష్ట్రాన్ని మార్చారని విమర్శించారు. పార్టీ పేరుతో కొందరికి సంక్షేమ ఫలాలు దక్కకుండా నాయకులు చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న అందరికీ సంక్షేమ పథకాలు అందేలా చేస్తామన్నారు. పొన్నలూరు మండలంలోని మారుమూల గ్రామాలకు సైతం తొలుత మెటల్ రోడ్లు, తర్వాత తారురోడ్లు వేసిన ఘనత దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులుకు, తర్వాత తనకే దక్కుతుందని స్వామి అన్నారు. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రోడ్డుకూడా వేసిన దాఖలాలు లేవని స్వామి అన్నారు. టీడీపీ హయాంలో వేసిన రోడ్లు మాత్రమే ఇప్పుడు కూడా ఉన్నాయని ఆయన అన్నారు. మద్యం నిషేధం చేసి ఓట్లు అడుగుతానన్న జగన్ మద్యం నిషేధంపై మాటతప్పి మడంతిప్పాడని విమర్శించారు. తొలి ఏడాదిలో పింఛన్ వెయ్యి రూపాయలు పెంచి ఇస్తానన్న జగన్ సంవత్సరానికి 250 రూపాయలు చొప్పున పెంచుకుంటూ పోయాడన్నారు. ఇది మాటతప్పడం కాదా అని స్వామి ప్రశ్నించారు. అమ్మఒడి ఎంతమంది పిల్లలు ఉన్నా 15 వేల రూపాయలు ఇస్తామని, 13 మాత్రమే ఇచ్చారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, బీసీలపై దాడులు, మహిళలపై అత్యాచారాలు పెరిగాయని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందజేస్తామన్నారు. రైతులకు ఏడాదికి 20వేల రూపాయల పెట్టుబడి సాయం, తల్లికి వందనం పేరుతో చదువుకునే వారు ఎంతమంది ఉంటే అంతమందికి ఏడాదికి 15వేల రూపాయల చొప్పున అందించడం జరుగుతుందన్నారు. నిరుద్యోగ భృతితోపాటు ఎస్సీకాలనీల్లో మిగిలిపోయిన సీసీరోడ్లు, సైడు కాల్వలు నిర్మిస్తామని స్వామి ఈసందర్భంగా హామీనిచ్చారు.

టీడీపీలో చేరిక

స్వామి ప్రచారం సందర్భంగా వేంపాడు గ్రామంలో మద్దిరాల నాగులు, మద్దిరాల మణికంఠ, తాటి మధు, మద్దిరాల నాగరాజు, మద్దిరాల బాలకోటయ్య, షేక్ సుల్తాన్ బాషా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వారందరికీ పార్టీ కండువాలు మెడలో వేసి స్వామి స్వాగతం పలికారు. ప్రజలు వైసీపీ పాలనలో రాష్ట్రం దెబ్బతినిపోయిన విషయాన్ని గుర్తించారని, గ్రామాల నుంచి భారీగా పార్టీలోకి వస్తున్నారని, ఇది మంచి పరిణామమని స్వామి ఈసందర్భంగా అన్నారు.



ప్రచారం సందర్భంగా వెల్లటూరులో స్వామికి భారీ గజమాల వేస్తున్న స్థానికులు

స్వామికి భారీ స్వాగతం....

స్వామికి అన్నిగ్రామాల్లో గ్రామస్థులు భారీగా స్వాగతం పలికారు. వెల్లటూరులో గజమాలతో స్వాగతం పలికారు. స్వామి ప్రచార రథం వెంట యువకులు మోటార్ సైకిళ్లతో ర్యాలీగా సాగారు. గ్రామాల్లో మహిళలు హారతులిచ్చి, గుమ్మడికాయలతో దిష్టితీశారు. యువకులు స్వామికి కరచాలనం చేసి సెల్ఫీలు దిగారు. కొత్తగా ఓటర్లుగా నమోదైన యువతీ యువకులు రాష్ట్రాభివృద్ధికోసం పార్టీకి అండగా ఉంటామని ఈసందర్భంగా స్వామికి హామీనిచ్చారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, పొన్నలూరు మండల మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్, బీజేపీ నియోజవకర్గ అధ్యక్షుడు బాలకోటయ్య, జనసేన నాయకుడు శ్రీనివాస్, తెలుగు యువత మండల నాయకుడు అనుమోలు సుధాకర్, టీడీపీ నాయకులు కర్నా కోటిరెడ్డి, పిల్లి వెంకట నారాయణరెడ్డి, మాధవరెడ్డి, సుందర్‌రెడ్డి, యల్లమంద, మాల్యాద్రి, లింగయ్య, రమణారెడ్డి, రాఘవరెడ్డి, దాసరి కృష్ణారావు, వెంకయ్య, అప్పారావు, నరేంద్ర, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకుడు చిడిపోతు హరిబాబు

రావులకొల్లులో వైసీపీకి షాక్

● సీనియర్ నాయకుడు చిడిపోతు హరిబాబు టీడీపీలో చేరిక

● ఉప్పలదిన్నెలో పది కుటుంబాలు కూడా..

పొన్నలూరు (కొండపి), ఏప్రిల్24: కొండపి నియోజకవర్గ ఉమ్మడి టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే స్వామి ఎన్నికల ప్రచారం సందర్భంగా బుధవారం రాత్రి రావులకొల్లులో వైసీపీకి పెద్ద షాక్ తగిలింది. గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకుడు చిడిపోతు హరిబాబు ఎమ్మెల్యే స్వామి ప్రచారం రథంపైకి ఎక్కి పార్టీలో చేరారు.హరిబాబుకు పార్టీ కండువా కప్పి స్వామి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామంలో మంచి పట్టుఉన్న హరిబాబు టీడీపీలో చేరికతో వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. అదేవిధంగా ఉప్పలదిన్నె గ్రామంలో మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పది కుటుంబాలు వైసీపీని వీడాయి. గ్రామానికి చెందిన పోలినేని నాగేశ్వరరావు, బుడంగుంట్ల సుందర్‌రావు, బిరుదల సామేలుకు సంబంధించిన పదికుటుంబాలు పార్టీలో చేరాయి. ఎమ్మెల్యే స్వామి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

వైసీపీ ఆర్యవైశ్య నాయకుడు టీడీపీలో చేరిక

సింగరాయకొండ, ఏప్రిల్ 24 : మండలంలోని ఊళ్లపాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు తుమ్మపూడి వరలక్ష్మమ్మ కుమారుడు, వైసీపీ ఆర్యవైశ్య నాయకుడు తుమ్మపూడి సుధాకర్ ఆపార్టీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. ఆయనకు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు బాయిరెడ్డి మురళి, కానాల బాలజీ, వేల్పుల వెంకట్రావు, నూతలపాటి కృష్ణ చైతన్య, గొల్లపోతు నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ

● వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

● అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



నూతన ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు (ఇన్‌సెట్లో) ప్రాణపతిష్ఠ చేస్తున్న అర్చకులు



సింగరాయకొండ, ఏప్రిల్ 24: దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధి గాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో యోగానంద లక్ష్మీనరసింహస్వామి నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ సంప్రోక్షణ కార్యక్రమాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని శ్రీదేవి, భూదేవి సమేత వరాహ లక్ష్మీనరసింహస్వామికి, యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడిని ప్రత్యేక పూలతో విశేషంగా అలంకరించారు. అనంతరం స్వామివారికి మహాశంతి అభిషేకం, కలశరాధన, ఉక్తహోమం, పూర్ణాహుతి, సద్యప్రదక్షిణం, ప్రోక్షణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నూతన ధ్వజస్తంభానికి ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం నూతన ధ్వజస్తంభానికి అర్చకులు ప్రాణప్రతిష్ఠ చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. తదనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. రాత్రికి ధ్వజఅవరోహణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పామర్తి మాధవరావు, ఈవో పి. కృష్ణవేణి, ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు, నరసింహాచార్యులు, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీరుస్తా

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి



మేదరమెట్లలో కరపత్రాలు అందజేస్తున్న గొట్టిపాటి

మేదరమెట్ల, ఏప్రిల్ 24 : మేదరమెట్లలో ప్రజల తాగునీటి సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఏర్పాటు చేస్తామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు. బుధవారం మేదరమెట్లలో ఎస్సీ కాలనీలో ఇంటింటికీ తిరిగి మేనిఫెస్టోలోని వివరాలు చంద్రబాబు ముఖ్యమంత్రి అమలు చేసే పథకాలను వివరించారు. 25 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు వేసిన నాయకుడిని వదులుకున్నామన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారన్నారు. డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళలకు పొదుపు నేర్పించిన నేత చంద్రబాబు అన్నారు. అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి ఐదు రూపాయలకే పేదల ఆకలి తీర్చిన మహానేత చంద్రబాబు అన్నారు. రూ.16వేల కోట్ల రుణమాఫీ చేసి విపత్తుల సమయంలో రైతులకు అండగా ఉన్నారన్నారు. టిడ్కో ఇళ్లు, కట్టించి పేదలకు సొంత ఇంటి కళ నెరవేర్చడానికి ఆయన చేసిన ప్రయత్నాన్ని జగన్‌రెడ్డి తుంగలోకి తొక్కారన్నారు. పరిశ్రమలు తెచ్చి 6 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించడంతో పాటు నిరుద్యోగ యువతకు భృతి ఇచ్చింది టీడీపీ అన్నారు. అధికారంలోకి రాగానే సైకో పాలన ఎలా ఉండబోతుందో రూ.14 కోట్ల విలువైన ప్రజల ఆస్తిని ధ్వంసం ద్వారా జగన్ చూపించారన్నారు. కూల్చడం తప్ప నిర్మించడం చేతకాని జగన్ ఏపీ అభివృద్ధిని ఆర్థిక పరిస్థితిని, ప్రజాస్వామ్య వ్యవస్థలను యువత భవిష్యత్‌ను నాశనం చేశారన్నారు. ఎస్సీలకు 26 పథకాలను రద్దు చేయడంతో పాటు సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిన వ్యక్తి జగన్‌రెడ్డి అన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయి రెండేళ్లు అవుతున్నా.. నేటికీ ఏర్పాటు చేయలేని అసమర్థులు వైసీపీ పాలకులన్నారు. దీంతో అటు రైతులకు, జాలర్లు జీవనోపాధి లేకుండా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుండ్లకమ్మలో ఇసుకను దోచేసేందుకే గేట్లు బిగించలేదని ఆయకట్టుదారులందరూ ఆరోపిస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమం అభివృద్ధి చేసి చూపుతామన్నారు. మే 13న పోలింగ్ రోజు ఎమ్మెల్యేగా తనను, బాపట్ల ఎంపీగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఆయన వెంట గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో పలు కుటుంబాల చేరిక

మండలంలోని తిమ్మనపాలెం ఎస్టీ కాలనీకి చెందిన 12 కుటుంబాల వారు అద్దంకి టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. బుధవారం తిమ్మనపాలెం ఎస్టీ కాలనీకి చెందిన అన్నంగి అంజయ్య, పసుమర్తి రవి, అనపర్తి మరియదాసు, తాటిపర్తి రాంబాబు, పసుమర్తి మస్తాన్, తాటిపర్తి యహోషువా, పాలపర్తి జాన్, అన్నంగి ప్రేమ్‌కుమార్, మహేష్, చంటి, యోహాను తదితరులు వైసీపీని వీడి చిలకలూరిపేటలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనకు సంఘీభావం ప్రకటించి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.., వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపుఖాయమన్నారు. వైసీపీ పట్ల రోజురోజుకు ప్రజల్లో నమ్మకం పోతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు.ఈ కార్యక్రయం వారి వెంట గ్రామ టీడీపీ నాయకులున్నారు.

వైసీపీని వీడిన రామాంజనేయపురం వాసులు

బల్లికురవ, ఏప్రిల్ 24 : మండలంలోని రామాంజనేయపురం గ్రామానికి చెందిన 15 కుటుంబాలు వైసీపీని వీడి బుధవారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో సైకిలెక్కారు. పార్టీలో చేరిన కుంచాల వెంకట్రావు, దాసు, శ్రీనివాసరావు, రవి, అంకమ్మ, ఉప్పుతల సత్తయ్య, గుంజి వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి శ్రీనివాసరావు మరి కొందరిని రవికుమార్ పార్టీలోకి ఆహ్వానించి రానున్న ఎన్నికలలో టీడీపీ విజయానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

వైసీపీని తరిమేయండి

పంగులూరు : ఎడాపెడా పన్నులతో ప్రజలను బాదిన వైసీపీని ఓటుతో తరిమి వేయాలని గొట్టిపాటి రవికుమార్ సతీమణి గొట్టిపాటి ఝాన్సీ ఓటర్లకు ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యేగా గొట్టిపాటిని, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను భారీ ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.



టీడీపీలో చేరిన వారితో గొట్టిపాటి

నో డ్యూస్ కోసం అసెంబ్లీ అభ్యర్థి పడిగాపులు

● ససేమిరా అన్న ప్రిన్సిపాల్

టంగుటూరు, ఏప్రిల్ 24 : కొండపి అసెంబ్లీకి మంగళవారం నామినేషన్ వేసిన విప్పుం సుజాత నో డ్యూస్ కోసం పడిగాపులు కాశారు. రిటర్నింగ్ అధికారి ఆమె పని చేసిన బీసీ గురుకుల పాఠశాల నుంచి నోడ్యూస్ సర్టిఫికెట్ కావాలని కోరారు. నామినేషన్ స్వీకరించిన ఆర్వో గురువారం సాయంత్రం 3గంటలకల్లా నోడ్యూస్ తెచ్చి సబ్‌మిట్ చేయాలని సూచించారు. దీంతో బుధవారం సుజాత గురుకుల పాఠశాల వద్దకు వెళ్లింది. సెలవులు కావడంతో కార్యాలయ సిబ్బంది మాత్రమే ఉన్నారు. నోడ్యూస్ కావాలని సుజాత కార్యాలయ సిబ్బందిని కోరారు. ఆమె వద్ద నుంచి సిబ్బంది రిక్వెస్ట్ లెటర్, ఆర్వో లెటర్ రెండూ తీసుకొని వాట్సాప్ ద్వారా ప్రిన్సిపాల్‌కు పంపించి ఆయనకు విషయం తెలియజేశారు. ఇందుకు ప్రిన్సిపాల్ సమాధానం చెబుతూ ఆమె కేవలం గెస్ట్ ఫ్యాకల్టీ అయినందున ఆధారాలేమీ లేవని, కనుక నోడ్యూస్ ఇవ్వలేమని, కలెక్టరేట్‌లో సంప్రదించి నోడ్యూస్ తీసుకోవాలని సూచించారు. దీంతో ఆమె మధ్యాహ్నం మండుటెండలో ఒంగోలు కలెక్టరేట్ దారి పట్టింది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థికి కావలసిన సర్టిఫికెట్లు అధికారులు ఆఘమేఘాలపై ఇస్తుంటే నన్ను ప్రిన్సిపాల్ ఇబ్బంది పెడుతున్నారని సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. ఇదంతా కావాలనే చేస్తున్నారని, ఏ కారణం చేతనైనా నా నామినేషన్ తిరస్కరణకు గురైతే అందుకు కారణం ప్రిన్సిపాల్ రాజారావేనని ఆమె తేల్చిచెప్పారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన

సింగరాయకొండ, ఏప్రిల్ 24 : మండలంలోని పాకల జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను బుధవారం పాఠశాల హెచ్‌ఎం డీవీఎస్ ప్రసాద్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షలకు 96 మంది హాజరుకాగా 76 (80శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. వీరిలో గొల్లపోతు గాయత్రి 554 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. పసుమర్తి మేఘన 516, కొక్కిలగడ్డ దీక్షిత 509 మార్కులు సాధించి పాఠశాల ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారని వివరించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయబృందం, గ్రామస్థులు, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

రూ. 2,12,680 సీజ్

సింగరాయకొండ, ఏప్రిల్ 24 : జాతీయ రహదారిపై పాతసింగరాయకొండ పంచాయతీ పరిధి పెరల్స్ డిస్టలరీ సమీపంలో ఉన్న జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ. 2,12,680 నగదును బుధవారం స్టాటిక్ సర్వైలెన్స్-2 టీం ఇన్‌చార్జి సి. శ్రీధర్‌రెడ్డి సీజ్ చేశారు. అనంతరం నగదును ఎస్సై టి. శ్రీరామ్‌కు అప్పగించారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన అబ్బూరి ప్రవీణ్ చిలకలూరిపేటలో పీఎస్ 5 రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్నారని, అందులో పనిచేస్తున్న సిబ్బందికి నగదు చెల్లించడానికి తీసుకెళ్తున్న తరుణంలో సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారని ఎస్సై తెలిపారు.



దిష్టితీస్తున్న మహిళ

ఆ అభిమానం.. మండుటెండను పండు వెన్నెలగా మార్చింది..!

ఆ తెగువ.. అరికాళ్లు బొబ్బలెత్తుతున్నా ముందుకు సాగనిచ్చింది..!

ఆ ఉత్సాహం.. గొంతు పిడచగట్టుకు పోతున్నా జెండా విడవనంది..!

ఒంగోలులో టీడీపీ అభ్యర్థి దామచర్ల నామినేషన్ కార్యక్రమానికి కొత్తపట్నం పల్లెపాలెం నుంచి మత్స్యకారులు పాద యాత్రగా వచ్చి సంఘీభావం తెలపడం కార్యక్రమానికి హైలైట్‌గా నిలిచింది.



జనార్దన్‌తో ఆర్యవైశ్యులు



నామినేషన్‌కు హాజరైన మహిళలు





ఈ జైత్రయాత్ర ఆగబోదంటున్న ఓ యువతి



గుర్రంమీద మాగుంట

దామచర్ల నామినేషన్‌కు మత్స్యకారుల పాదయాత్ర

వందలాది మంది మత్స్యకారులు నామినేషన్ కార్యక్రమానికి హాజరు

ఆ వర్గంలో టీడీపీకి పెరుగుతున్న ఆదరణ

ఒంగోలు నగరం, ఏప్రిల్ 24 : ఒంగోలు నియోజకవర్గంలో టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ నామినేషన్ కార్యక్రమానికి మత్స్యకారులు పోటెత్తారు. కొత్తపట్నం పల్లెపాలెం నుంచి దాదాపు 700 మందికిపైగా బుధవారం ఉదయం ఒంగోలుకు పాదయాత్రగా బయలుదేరి ఆయన నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ అధికారంలో ఉండగా దామచర్ల జనార్దన్ ఎమ్మెల్యేగా కె పల్లెపాలెంలోని మత్స్యకారులకు వందల సంఖ్యలో పడవలు, వలలు ప్రభుత్వం నుంచి సబ్సిడీపై ఇప్పించారు. ఆయన హయాంలో తీర ప్రాంత గ్రామాల్లో రోడ్లు, మంచినీరు, ఇతర అనేక అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశారు. దీంతో వారు కృతజ్ఞతగా జనార్దన్ నామినేషన్ కార్యక్రమానికి పాదయాత్రగా వచ్చి సంఘీభావం తెలిపారు. పల్లెపాలెంలో ప్రారంభమైన పాదయాత్ర కొత్తపట్నం, అల్లూరు, చింతల, కొప్పోలు మీదుగా సాగింది. ఒంగోలులోని మినీ స్టేడియం నుంచి ప్రారంభమైన నామినేషన్ ర్యాలీలో మత్స్యకారులు పాల్గొన్నారు. పాదయాత్రలో భాగంగా గ్రామగ్రామాన జనార్దన్ గెలుపు కోరుతూ ప్రచారం చేశారు. సైకో మళ్లీ వస్తే మన గతి అధోగతే.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే చంద్రబాబే సీఎం కావాలంటూ ప్రచారం చేశారు. టీడీపీ జెండాలతో కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా పాదయాత్రలో పాల్గొన్నారు. తొలుత పల్లెపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు నరసింహారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు బాల కోటయ్య, తమ్ము శ్రీను, దేవప్రసాదు, మాజీ సర్పంచి ప్రభుప్రకాష్, చాపల జాలరామ్, బాంబే శ్రీను పాదయాత్రకు సారథ్యం వహించారు.

పోలీసుల ఓవరాక్షన్

దామచర్ల వాహనాలను దరిదాపుల్లోకి కూడా అనుమతించని పోలీసులు

ఆర్డీవో కార్యాలయం వరకు నడిచి వెళ్లి నామినేషన్ దాఖలు

ప్రశ్నించడంతో సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన సీఐ లక్ష్మణ్



నామినేషన్ వేసి నడిచి వస్తున్న జనార్దన్

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 23 : ఎన్నికల సంఘం నియమావళి అమలులో ఉన్నా, పోలీసులు మాత్రం అధికార వైసీపీకి జీహుజూర్ అంటూనే ఉన్నారు. వైసీపీకి నమ్మినబంట్లుగా వ్యవహరిస్తూ, టీడీపీకి వ్యతిరేకంగా నిబంధనలను సైతం అమలుచేయకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం టీడీపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థిగా దామచర్ల జనార్దన్ స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ వేసేందుకు వెళ్లగా పోలీసుల తీరును ఆ పార్టీ శ్రేణులతోపాటు, ప్రజలు కూడా తప్పుబడుతున్నారు. జనార్దన్ ర్యాలీలో పాల్గొన్న అనంతరం బైక్‌పై బయలుదేరారు. ఆయనతోపాటు ఆయన కార్లు కూడా ఉన్నాయి. అయితే స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద పోలీసులు అడ్డుకుని వాహనాలకు అనుమతి లేదంటూ ఆయన్ను నిలబెట్టారు. దీంతో అభ్యర్థి అయిన దామచర్ల నడుచుకుంటూనే ఆర్డీవో కార్యాలయానికి వెళ్లారు. ఇదిలా ఉంచితే.. సోమవారం వైసీపీ అసెంబ్లీ అభ్యర్థిగా బాలినేని శ్రీనివాస రెడ్డి నామినేషన్ వేసేందుకు వెళ్లగా, ఆయనతోపాటు మూడు వాహనాలను ఆర్డీవో కార్యాలయం వరకూ అనుమతించారు. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ శ్రేణులను సైతం కార్యాలయం ఆవరణ లోపలకు అనుమతించారు. ఇదే విషయాన్ని టీడీపీ శ్రేణులు సీఐ లక్ష్మణ్‌ను ప్రశ్నించగా తనకు ఆ విషయం తెలియదన్నారు. నిబంధనల మేరకు మూడు వాహనాలకు అనుమతి ఉందని దాటవేశారు. ఈ సందర్భంగా దామచర్ల కుమార్తె సీఐ తీరును తప్పుబట్టారు. నాలుగైదుసార్లు ఫోన్ చేసినా మీరు ఎందుకు తీయలేదని, తమ వాహనాలను ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు. దీంతో సీఐ జరిగిన తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. అయితే పోలీసులు వ్యవహరించిన తీరుపై టీడీపీ శ్రేణులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యాయి.



టీడీపీ నేతలను వెళ్లాలని చెబుతున్న సీఐ లక్ష్మణ్

జన కేతనం

ప్రకాశం జిల్లా వార్తలు

గురువారం 25 ఏప్రిల్ 2024

హామీలు.. కౌంటర్లు..!

మంత్రి సురేష్ వాగ్దానాలపై ఎమ్మెల్యే స్వామి ప్రతిస్పందన

కొండపి నియోజకవర్గ ప్రజల్లో ఆసక్తికర చర్చ

ఇరువురునీ బేరీజు వేసుకుంటున్న ఓటర్లు

సింగరాయకొండ, ఏప్రిల్ 24 : వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండపి బరిలో ఉన్న మంత్రి ఆదిమూలపు సురేష్ తన ప్రచారంలో ప్లీజ్ ఒక్క అవకాశం ఇవ్వండి.. నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నెంబర్ వన్ చేసి చూపిస్తానని ఊరూ వాడా తిరిగి పదేపదే అభ్యర్థనలు చేస్తున్నారు. సింగరాయకొండలో వైసీపీ నేతలతో నిర్వహించిన సమావేశాలలో, ప్రచారాలలో మేజర్ పంచాయతీగా ఉన్న సింగరాయకొండను మున్సిపాలిటీగా అభివృద్ధి చేసి సుందరనగరంగా తీర్చిదిద్దుతానని హామీలు గుప్పిస్తున్నారు.

పదునైన ప్రశ్నలతో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే స్వామి

- ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తన ప్రచారంలో ప్రజల ముందు సూటిగా సురేష్‌పై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.
- వైపాలెం ప్రజలు రెండు దఫాలు గెలిపించి మంత్రిని చేస్తే ఐదేళ్లు అందుబాటులో లేకుండా హైదరాబాద్ చుట్టూ తిరిగారని ఓటర్లకు వివరిస్తున్నారు.
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సురేష్, అతని భార్యపై కేసులు ఉన్నాయని, బెయిల్‌పై ఇరువురు బయట తిరుగుతున్నారని ఏదో ఒకరోజు జైలుకి పోవడం తప్పదంటూ చెబుతున్నారు.



మంత్రి సురేష్



ఎమ్మెల్యే స్వామి

ప్రజల్లో చర్చోపచర్చ

మంత్రి చెబుతున్న హామీలను, ఆ హామీలకు ఎమ్మెల్యే స్వామి వేస్తున్న కౌంటర్లు, చేస్తున్న విమర్శలపై నియోజకవర్గ ప్రజల్లో విస్తృతంగా చర్చ నడుస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కొండపి నియోజకవర్గంలో స్వామి చేసిన అభివృద్ధిని, వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏమి అభివృద్ధి జరిగిందో ప్రజలు బేరీజు వేస్తున్నారు. అంతేకాకుండా ఇక్కడ పోటీ చేస్తున్న సురేష్ వైపాలెంలో ఏమీ అభివృద్ధి చేశారు.. ఆయన నైజంపై కూడా ఓటర్లు ఆరా తీస్తున్నారు. అంతేకాకుండా ఆయన స్థానికేతరుడు, ప్రజలకు అందుబాటులో ఉండరని స్వామి చేస్తున్న ఆరోపణలపై కూడా నియోజకవర్గ ప్రజల్లో చర్చ నడుస్తోంది.

మంత్రి సురేష్ హామీలపై ఎమ్మెల్యే స్వామి కౌంటర్లు

- పోటీ చేసే ప్రతిసారీ నియోజకవర్గాన్ని మార్చే మంత్రి ఆదిమూలపు సురేష్ హామీలపై ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కౌంటర్లు వేస్తున్నారు.
- మంత్రిగా ఐదేళ్లు పని చేసి వైపాలేన్ని ఎందుకు అభివృద్ధి చేయలేకపోయారు?
- యర్రగొండపాలేన్ని సుందరనగరంగా అభివృద్ధి చేస్తానని మురికి కూపంగా ఎందుకు మార్చారు? మున్సిపాలిటీగా ఎందుకు మార్చలేకపోయారు?
- నియోజకవర్గ కేంద్రం నుంచి మండల కేంద్రాలకు డబుల్ రోడ్లు వేస్తానని హామీ ఇచ్చి ఎందుకు నేరవేర్చలేకపోయారు?
- ప్రతి కాంట్రాక్ట్‌ను బినామీలకు అప్పనంగా కట్టబెట్టడంలో ఆంతర్యమేమిటి..? ప్రతి పనికీ రేటుకట్టి నగదు ఎందుకు దండుకున్నారు..?
- గెలిపించిన నాయకులు, కార్యకర్తలను ఎందుకు గాలికి వదిలేశారు?
- మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఎందుకు సాధించలేకపోయారు?
- వెలిగొండను ఎందుకు పూర్తి చేయించలేకపోయారు?

రాజకీయ చిత్ర విచిత్రాలు

భర్తలకు తోడుగా సతీమణుల నామినేషన్

ప్రధాన పార్టీల అభ్యర్థుల సరికొత్త ట్రెండ్



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న గొట్టిపాటి ఝాన్సీ

అద్దంకి, ఏప్రిల్ 24 : అద్దంకి అసెంబ్లీ బరిలో ఉన్న మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులకు తోడుగా వారి సతీమణులు బుధవారం నామినేషన్‌లు దాఖలు చేశారు. టీడీపీ తరఫున గొట్టిపాటి రవికుమార్ పోటీలో ఉండగా, అతని భార్య ఝాన్సీ నామినేషన్ వేశారు. వైసీపీ అభ్యర్థి పానెం చినహనిమిరెడ్డి సోమవారం నామినేషన్ వేయగా బుధవారం మరో మూడు సెట్లు అందజేశారు. అదే సమయంలో భార్య ఆదిలక్ష్మి కూడా నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి అడుసుమల్లి కిషోర్‌బాబు తరఫున అతని భార్య పార్వతి బుధవారం నామినేషన్ వేశారు. ముగ్గురు అభ్యర్థుల సతీమణులు నామినేషన్‌లు వేయడం చర్చనీయాంశంగా మారింది. వీరితో పాటు బుధవారం మరో ముగ్గురు నామినేషన్‌లు వేశారు. భారత చైతన్య యువజన పార్టీ తరఫున మీసాల సామ్రాజ్యం, ఇండిపెండెంట్‌గా జీ వెంకటాచారి, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరఫున కందుల యాకోబ్ నామినేషన్‌లు వేశారు. ఏవైనా అనుకోని కారణాలతో భర్తల నామినేషన్లు తిరస్కరణకు గురైతే అదే పార్టీ తరఫున భార్యలను రంగంలోకి దించేందుకు వారితోనూ నామినేషన్ వేయించారు. గతంలో తమ పార్టీలోనే సన్నిహితుల చేత నామినేషన్‌లు వేయించే వారు. కాస్తా కొత్తగా భార్యలతో నామినేషన్‌లు వేయించడం గమనార్హం.

ఎస్ఎన్‌పాడు టీడీపీలోకి భారీ చేరికలు

బీఎన్ సమక్షంలో చేరిన మారెళ్ల, కుమారస్వామి పలు గ్రామాల నేతలు



బీఎన్ సమక్షంలో టీడీపీలో చేరిన జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మారెళ్ల శేషయ్య ఇతర నాయకులు

ఒంగోలు, ఏప్రిల్ 24, (ఆంధ్రజ్యోతి) : సంతనూతలపాడు నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు జోరు కొనసాగుతున్నాయి. ఇప్పటికే చాలా గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో వైసీపీ ముఖ్యనేతలు, గ్రామ స్థాయిలోని క్రియాశీలక కార్యకర్తలు చేరగా, తాజాగా బుధవారం మరికొంత మంది నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ సమక్షంలో చేరారు. నాగులుప్పలపాడు మండల కేంద్రంలో టీడీపీ ఎన్నికల కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం జరగ్గా అక్కడ జరిగిన సభలో ఆ మండలంలోని వైసీపీ కీలక నేతగా ఉన్న రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య మాజీ చైర్మన్ మారెళ్ల వెంకటశేషయ్య టీడీపీ కండువా కప్పుకున్నారు. గతంలో ఆయన జడ్పీ వైస్ చైర్మన్‌గా కూడా పనిచేశారు. శేషయ్యతో పాటు ఆయన కుమారుడు కిరణ్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పొనకల పున్నారావులతోపాటు సుమారు వంద కుటుంబాలు వారు చేరారు. అలాగే ఒమ్మెవరానికి చెందిన కొమ్మలపాటి రాముడు, శ్రీరామమూర్తిలతో పాటు పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మద్దిపాడు మండల మాజీ ఎంపీపీ ఎ.కుమారస్వామి, పెద్దకొత్తపల్లికి చెందిన వైసీపీ పంచాయతీరాజ్ విభాగం నాయకుడు నర్రా సురేష్, వార్డు సభ్యులు చందలూరి ఆంజనేయులు, కరి హరిబాబు మరో 20 కుటుంబాలు, బూరేపల్లికి చెందిన వైసీపీ బీసీ సెల్ సెక్రటరీ కురిచేటి శ్రీనివాసరావు, కురిచేటి బ్రహ్మయ్య మరికొంతమంది, చీమకుర్తి మండలం ఏలూరివారిపాలెం నుంచి వైసీపీ ఆ గ్రామ కార్యదర్శి మన్న శ్రీనివాసరావు మరికొంత మంది ఒంగోలులోని బీఎన్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీలో చేరారు. తాజా చేరికలతో ఎన్‌జీపాడు మండలంలో అనేక మంది వైసీపీ ముఖ్యనాయకులు టీడీపీలోకి వచ్చినట్లయింది. ఇతర మండలాల్లోనూ అదే పరిస్థితి కనిపిస్తుండగా, మరికొంత మంది మండల, గ్రామ స్థాయి నాయకులు టీడీపీలో చేరనున్నట్లు తెలుస్తోంది.



డాక్టర్ బాచిన చెంచు గరటయ్య

బాపట్ల పార్లమెంట్ ఎలక్షన్ కోఆర్డినేటర్‌గా గరటయ్య

అద్దంకి, ఏప్రిల్ 24 : టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఎలక్షన్ కోఆర్డినేటర్‌గా అద్దంకి మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు డాక్టర్ బాచిన చెంచుగరటయ్యను నియమించారు. నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో ఉన్న గరటయ్య టీడీపీ తరఫున పలు పర్యాయాలు అద్దంకి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దశాబ్దకాలంగా వైసీపీలో ఉన్నారు. గత ఎన్నికలలో వైసీపీ తరఫున అద్దంకి నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. కుమారుడు కృష్ణచైతన్య నాలుగేళ్లుగా అద్దంకి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా ఉండగా, 4 నెలల క్రితం పానెం హనిమిరెడ్డిని ఇన్‌చార్జిగా నియమించడంతో.. దీంతో గరటయ్య, కృష్ణచైతన్య వైసీపీని వీడి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఇటీవల లోకేష్‌ను కలిసి పలు అంశాలపై వారు చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ ఎలక్షన్ కోఆర్డినేటర్లను నియమించిన నేపథ్యంలో అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలలో 4 దశాబ్దాలకు పైగా రాజకీయంలో ఉన్న గరటయ్యకు సముచిత స్థానం కల్పించడంపై బాచిన వర్గీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాకు బీఫాం ఇవ్వకపోతే ఆత్మాహుతే

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 24 : నాకు బీఫాం ఇవ్వకపోతే గురువారం పీసీసీ కార్యాలయం ఎదుట ఆత్మాహుతికి సిద్ధపడతానని శ్రీపతి సతీష్ హెచ్చరించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో పీసీసీ చీఫ్ షర్మిలపై సతీష్ మండిపడ్డారు. కొండపి అసెంబ్లీ నియోజకవర్గం టికెట్ తనకు ప్రకటించి బీఫాం పసుమర్తి సుధాకర్‌కు ఇవ్వడం ఏమిటి అని ప్రశ్నించారు. సుధాకర్ వైసీపీ శ్రేణులతో అత్యంత సన్నిహితంగా ఉంటాడని తెలిపారు. షర్మిల వైసీపీ కోవర్టులా పనిచేస్తోందని అనుమానం వ్యక్తం చేశారు.

మద్యం కోసం బారులు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 24 : ఎర్రగొండపాలెంలోని వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ నామినేషన్‌కు వచ్చేవారికి, గ్రామాల్లో మందుతాగే వారికి ఒక క్వార్టర్ మద్యం, తాగని వారైతే, రూ.200 నగదు పంపిణీ చేశారు. రానుపోను వాహనాలు ఏర్పాటు, ఎర్రగొండపాలెంలో భోజనాలు ఏర్పాటు చేశారు. అయితే ర్యాలీ కోసం వచ్చిన వారికి మద్యం చాలలేదు. దీంతో వారికి డబ్బులు ఇవ్వడంతో మందు కోసం ప్రభుత్వ మద్యం దుకాణాల ఎదుట క్యూకట్టారు. ఎర్రగొండపాలెంలో మూడు మద్యం దుకాణాల వద్ద ఉదయం 10 గంటల నుంచే మద్యం కోసం వైసీపీ కార్యకర్తలు కిక్కిరిసిపోయారు. ఆ దుకాణాల సమీపంలోనే వారు తాగడం గమనార్హం



ఇళ్ల ముంగిటే సేవిస్తున్న మందుబాబులు



ప్రభుత్వ మద్యంషాపు వద్ద బారులుతీరిన మందుబాబులు





ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌రెడ్డి, రహదారి వెంబడి కార్యకర్తలకు కరచాలనం చేస్తున్న అశోక్‌రెడ్డి, ర్యాలీకి హాజరైన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు

అట్టహాసంగా నామినేషన్

- టీడీపీ కూటమి నుంచి అశోక్‌రెడ్డి నామినేషన్
- బస్టాండ్ నుంచి ఆర్వో కార్యాలయానికి ర్యాలీ
- మండుటెండను సైతం లెక్కచేయని కేడర్
- వెంట వచ్చిన జనసేన, బీజేపీ నేతలు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 24 : గిద్దలూరు నియోజకవర్గానికి టీడీపీ కూటమి అభ్యర్థిగా ముత్తుముల అశోక్‌రెడ్డి బుధవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలతో గిద్దలూరు పట్టణం పసుపుమయంగా మారింది. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కూటమి అభ్యర్థి అశోక్‌రెడ్డికి మద్దతు తెలిపాయి. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అటవీశాఖ కార్యాలయం వరకు చేరడానికి సుమారు రెండు గంటలు సమయం పట్టింది. ప్రత్యేకంగా పూలతో తయారు చేసిన వాహనంలో టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆయన కుమారుడు మాగుంట రాఘవరావు, గిద్దలూరు జనసేన ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబా, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్‌తోపాటు ఆయా పార్టీల ముఖ్య నాయకులు మహాప్రదర్శనగా నామినేషన్‌కు తరలి వెళ్లారు. ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్ నుంచి రాచర్లగేటు, పాములపల్లి గేటు వరకు భారీగా నిర్వహించారు. మార్గ మధ్యలో పార్టీశ్రేణులు నృత్యాలతో హోరెత్తించారు. నియోజకవర్గంతో పాటు మండలాల నుంచి కూడా టీడీపీ శ్రేణులు భారీగా హాజరయ్యాయి. దారి పొడవునా అన్ని గ్రామాల నుండి వచ్చిన శ్రేణులు ముత్తుముల అశోక్‌రెడ్డికి నీరాజనాలు పలికారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా కూటమి కార్యకర్తలు ఉత్సాహంతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాచర్ల గేటు వద్ద కార్యకర్తలను ఉద్దేశించి అశోక్‌రెడ్డి మాట్లాడారు. 'గిద్దలూరు గడ్డపై టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే గెలుపు' అన్నారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రానికి వైసీపీ చేసిందేమి లేదన్నారు. తాను స్థానికుడినని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. తనపై పోటీ చేసే వ్యక్తి పక్క నియోజకవర్గం నుండి వలస వచ్చాడన్నారు. మాగుంట రాఘవరావు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఈ నియోజకవర్గంతో తమ కుటుంబానికి సత్సంబంధాలు ఉన్నాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి మాగుంట శ్రీనివాసులరెడ్డి సహకరించారన్నారు. మే 13న జరిగే ఎన్నికలలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి, పార్లమెంట్ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డిలకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం అభిమానుల మధ్య ఊరేగింపుగా ఎన్నికల అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. టీడీపీ కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి, మాగుంట రాఘవరావు, జనసేన ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబా, మాజీ సర్పంచ్ దప్పిలి విజయ భాస్కర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి సోదరుడు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డిలతో కలిసి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారిణి డి.నాగజ్యోతికి సమర్పించారు. నామినేషన్ల కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు.

ముత్తుముల ప్రత్యేక పూజలు

నామినేషన్ సందర్భంగా టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పలు దేవాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. నామినేషన్‌కు ముందు ముత్తుముల అశోక్‌రెడ్డి స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.. దేవస్థాన కమిటీ సభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డికి వేదమంత్రాల మధ్య స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆదర్శ విద్యా సంస్థల అధినేత బుడత తిమ్మయ్య, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, దేవస్థాన కమిటీ అధ్యక్షులు ఓ.వెంకటయ్య, పీరయ్య, పాల్గొన్నారు.



వేణుగోపాలస్వామి ఆలయ కమిటీతో ముత్తుముల

ఆర్యవైశ్యుల సంఘీభావ ర్యాలీ

నామినేషన్ సందర్భంగా అశోక్‌రెడ్డి అభయాంజనేయ స్వామి దేవాలయంలోనూ ప్రత్యేకపూజలు చేశారు. టీడీపీ నాయకులు అశోక్‌రెడ్డి ఘనవిజయం సాధించాలని కోరుతూ 101 కొబ్బరికాయలు కొట్టారు. ఇక స్థానిక ఆర్యవైశ్య నాయకులు నటుకుల శ్రీనివాసులు, ఆరవీటి సత్యనారాయణ, వాడకట్టు శివప్రసాద్, ఆరవీటి సుబ్రహ్మణ్యం టీవీఎస్, దమ్మాల జనార్దన్, వాడకట్టు రామాంజనేయులు, సి.వి.ఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో ముత్తుముల అశోక్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా పట్టణంలోని అమ్మవారిశాల నుండి ర్యాలీ నిర్వహించి అశోక్‌రెడ్డికి మద్దతు పలికారు. అమ్మవారిశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆర్యవైశ్య నాయకులు అశోక్‌రెడ్డి ఇంటి వద్దకు వెళ్ళి మద్దతు పలికారు. అశోక్‌రెడ్డి విజయానికి తామంతా కృషి చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- ఆటోకు గేదె అడ్డం రావడంతో ఘటన



బాధితులను పరామర్శిస్తున్న అశోక్‌రెడ్డి

కంభం, ఏప్రిల్ 24 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని యర్రబాలెం సమీపంలో చోటు చేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అర్ధవీడు మండలం మొహిద్దీన్ పురానికి చెందిన రావులపల్లి లక్ష్మయ్య, రావులపల్లి ఆంజనేయులు, రావులపల్లి పెద్దకాశయ్య, రావులపల్లి చిన్నకాశయ్యలు గిద్దలూరు నుంచి స్వగ్రామానికి ఆటోలో వస్తున్నారు. ఈ క్రమంలో యర్రబాలెం మూలమలుపు వద్ద వేగంగా వస్తున్న ఆటోకు గేదె అడ్డువచ్చింది. దీంతో గేదెను తప్పించే క్రమంలో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో రావులపల్లి లక్ష్మయ్య(60) తీవ్రగాయాలపాలై మృతిచెందాడు. రావులపల్లి ఆంజనేయులు, రావులపల్లి పెద్దకాశయ్య, రావులపల్లి చిన్నకాశయ్యలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన ఆంజనేయులును మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. గాయపడిన వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హుటాహుటిన కంభం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి గాయపడిన వారిని పరామర్శించారు. మృతుడు లక్ష్మయ్య భార్య తిరుపతమ్మను పరామర్శించారు. గాయపడిన వారిని టీడీపీ ఆదుకుంటుందని వారికి భరోసా కల్పించారు.

ప్రమాదవశాత్తు రెండు పూరిళ్లు దగ్ధం



దగ్ధమైన పూరి గుడిసెలు

తర్లుపాడు, ఏప్రిల్ 24: గ్యాస్ సిలెండర్లు పేలి రెండు పూరిళ్లు దగ్ధమైన ఘటన మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీ లింగారెడ్డి కాలనీలో చోటుచేసుకొంది. ఈ ఘటనలో సుమారు రూ.3లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన కొమ్ము యలమందయ్య ఇంట్లో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో కొమ్ము కోటమ్మ బయటకు పరుగులు తీసింది. ఈ క్రమంలోనే పక్కనే ఉన్న మందా ఎలికర్ ఇంటికి మంటలు వ్యాపించాయి. దీంతో రెండు పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. మార్కాపురం ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. కొమ్ము కోటమ్మ ఇంట్లో రూ.50వేల నగదు, 30 బస్తాల సిమెంట్, ఎలికర్ ఇంటిలోని సామాన్లు దగ్ధమయ్యాయి. దీంతో ఇరువురి ఇళ్లల్లో రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఘటన



మృతిచెందిన వెంకటలక్ష్మి

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 24 : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన ఎర్రగొండపాలెం సమీపంలో మంగళవారం చోటుచేసుకొంది. మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన జంగా వెంకటలక్ష్మి(37) ఎర్రగొండపాలెం సమీపంలో రోడ్డు దాటుతుండగా జీబు ఢీ కొట్టింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన జంగా వెంకటలక్ష్మి ఇటీవల కుమార్తె వివాహం చేసి దైవదర్శనం కోసం శనివారం బంధువులతో కలసి తిరుపతి వెళ్లారు. దేవుని దర్శనం చేసుకొని మంగళవారం తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో ఎర్రగొండపాలెం సమీపంలో రోడ్డు పక్కన తాము ప్రయాణిస్తున్న వాహనం దిగి కాలకృత్యంలు తీర్చుకొని రోడ్డు దాటుతుండగా, అటువైపు వస్తున్న జీబు ఆమెను బలంగా ఢీ కొట్టింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందారు. ఆమెతో ప్రయాణిస్తున్న కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. భర్త ఆవులయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుదర్శన్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్ సదుపాయం వినియోగించుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 24: పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సదుపాయం వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో నియోజకవర్గ స్థాయి పోస్టల్ బ్యాలెట్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోస్టల్‌బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 26వ వరకు ఉన్నందున సంబంధిత దరఖాస్తులను సిబ్బంది నుంచి పూర్తి స్థాయిలో సేకరించాలన్నారు. ఈ దిశగా ఇప్పటికే సేకరించిన దరఖాస్తులను సంబంధిత నియోజకవర్గాలవారీగా అధికారులు పరస్పరం బదిలీ చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో డీఆర్వో ఆర్.శ్రీలత, బ్యాలెట్ జిల్లా నోడల్ అధికారి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలోకి చేరికలు



టీడీపీలో చేరిన కార్యకర్తలు

తర్లుపాడు, ఏప్రిల్ 24: మండలంలోని జగన్నాథపురంలో 25 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారికి మార్కాపురం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. మరో 19 రోజుల్లో వైసీపీ పతనమవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను, మాగుంట శ్రీనివాసరెడ్డిలను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీలో చేరిన వారిలో వెన్నా పాండురంగారెడ్డి, తిరుమలరెడ్డి చిన్నపెద్దిరెడ్డి, తిరుమలరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మాజీ సర్పంచ్ కటారి చిన్న కాశయ్య, బొమ్మాజి బాలకోటయ్య, కర్రెటి శేఖర్, వి.వీరగంటాచారి, బత్తుల రంగయ్య, కటారి బాబురావు, మక్కెర కాశీరత్నం వీరితో పాటు మరో 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రావి బాసపతిరెడ్డి, నాయకులు, పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కరువు

- కనిపించని టెంట్లు
- ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు, మజ్జిగ, మంచినీరు పంపిణీ లేదు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

త్రిపురాంతకం, ఏప్రిల్ 24: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసే కూలీలు మండుటెండలో పనులు చేస్తూ మగ్గిపోతున్నారు. కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరిగి 43 డిగ్రీలకు చేరింది. దీంతో ఉపాధి కూలీలు ఎండలకు అల్లాడిపోతున్నారు. దీనికి తోడు పని ప్రదేశాలలో మంచినీరు, మజ్జిగ, ఫస్ట్ ఎయిడ్స్ కిట్‌లు అందుబాటులో లేకపోవటంతో పలు చోట్ల కూలీలు అస్వస్థతకు గురవుతున్నారు.

కనిపించని టెంట్లు

మండలం మొత్తం మీద 16225 జాబ్ కార్డులకు గానూ 25 వేల మంది కూలీలు ఉండగా ప్రస్తుతం 8665 మంది ఉపాధి కూలీలు నిత్యం పనుల్లో నిమగ్నమవుతున్నారు. అయితే పని ప్రదేశంలో నీడను ఏర్పాటు చేసుకోవటానికి టెంట్లు, పట్టలు అందించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. గతంలో ప్రభుత్వం టెంట్‌లు ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం అవి ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. కొత్తగా టెంట్‌లుమంజూరుచేస్తే ఉపాధి కూలీలకు ఉపయుక్తంగా ఉంటుంది.

మెడికల్ కిట్‌లు లేవు

ఉపాధి కూలీలకు అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునేందుకు అధికారులు మెడికల్ కిట్‌లను అందించాల్సి ఉండగా అధికారులు గత ఏడాది నుండి ఆదిశగా అటువంటి చర్యలేమి చేపట్టలేదు. ప్రస్తుతం ఎండతీవ్రత పెరగడంతో అనేక మంది తీవ్ర అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోయిన ఘటనలు అనేకం. పని ప్రాంతాలలో ఎక్కువగా తేళ్ల, పాముకాట్లకు గురయ్యేవారు అనేకం ఉన్నారు. దీంతో ప్రథమ చికిత్స కిట్‌లు లేక కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కనిపించని మజ్జిగ, మంచినీరు

కూలీలకు ప్రభుత్వం మజ్జిగ, మంచినీరు పంపిణీ సరఫరా చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు ఎక్కడా చేపట్టటం లేదు. కూలీలంతా పని ప్రదేశానికి సీసాల ద్వారా నీళ్లు తీసుకెళ్తున్నారు. అవి కొద్దిసేపటికే అయిపోవటంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని కూలీలు చెబుతున్నారు. సగటు వేతనం 300 రూపాయలు పని చేస్తే మజ్జిగ పంపిణీ డబ్బులు వస్తాయని లేదంటే రావని అధికారులు అంటున్నారు.

సింహ వాహనంపై చెన్నయ్య నగరోత్సవం



నృసింహ వాహనంపై చెన్నకేశవుడు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 24: శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా చెన్నకేశవుడు నృసింహ అలంకారంలో సింహ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. బుధవారం రాత్రి జరిగిన ఈ వేడుకల్లో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు స్వామి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. సృష్టిలో ఇతర ప్రాణులకు లేని విశిష్టత సింహానికి ఉందని ధర్మరక్షణకై మహావిష్ణువు నృసింహ స్వరూపాన్ని ధరించారని అర్చకులు తెలిపారు. ఉభయదాతలు పగలు జటప్రోలు దక్షిణామూర్తిశర్మ, రాత్రి చల్లారి పాండురంగయ్య కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి, ఆలయసిబ్బంది ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. భక్తులు అడుగడుగునా స్వామిని దర్శించుకొని కొబ్బరికాయ కొట్టి, కర్పూరం సమర్పించారు. పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జనసేన ఆధ్వర్యంలో విశేషపూజలు



కొబ్బరికాయలు కొడుతున్న జనసేన నాయకులు

గిద్దలూరు, ఏప్రిల్ 24 : టీడీపీ కుటమి ముత్తుముల అశోక్‌రెడ్డి విజయం కాంక్షిస్తూ రాచర్ల మండల జనసేన నాయకురాలు ఉలావు సుజాత ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామి ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నామినేషన్ విజయవంతం కావాలని, మే 13న జరిగే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలువాలని రామలింగేశ్వరునికి 101 కొబ్బరికాయలు కొట్టారు. రాష్ట్రాన్ని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల విజయంతోనే రాష్ట్ర భవిష్యత్తు బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు కె.యోగానంద్, జనసేన పార్టీ అధ్యక్షులు అలిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ, జనసేన నాయకులు వెంకట్రావు, కళ్యాణ్, కాశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రంగనాయకుని కల్యాణం




కల్యాణమూర్తిగా రంగనాయకస్వామి, విశేషంగా హాజరైన భక్తులు

విశేషంగా హాజరైన భక్తులు

గిద్దలూరు, ఏప్రిల్ 24 : శ్రీనెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం రంగనాయకస్వామి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పలువురు దంపతులు, భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారు గరుడవాహనంలో శ్రీవిష్ణుమూర్తి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గజవాహహనంపై సైతం స్వామి వారు భక్తులకు దర్శనమ మిచ్చారు. కృష్ణగణపతి కోలాట బృందం, హనుమాన్ కోలాట బృందం, లక్ష్మీరంగనాయక స్వామి కోలాట బృందాల ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జరిగిన కోలాట ప్రదర్శన పలువురిని ఆకట్టుకొంది. ఈ సందర్భంగా సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకాన్ని నిర్వహించారు. కార్యనిర్వహ ణాధికారి రమేష్ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

అవీ..ఇవీ..

వైసీపీని వీడి టీడీపీలోకి వలసలు

- పార్టీ కండువాకప్పి ఆహ్వానించిన ఎరిక్షన్‌బాబు



టీడీపీలో చేరిన కార్యకర్తలతో ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, ఏప్రిల్ 24: మండలంలోని లేళ్లపల్లి, దువ్వలి, జి.ఉమ్మడివరం, వెంగాయపాలెం గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. లేళ్ళపల్లి, దువ్వలి గ్రామాలలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు పోలా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీని వీడిన 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. జి.ఉమ్మడివరం, వెంగాయపాలెం గ్రామాలలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు డి.ఆంజనేయులు ఆధ్వర్యంలో వైసీపీని వీడిన 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. కొత్తగా పార్టీలో చేరిన వారికి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ కొత్తగా పార్టీలోకి చేరినవారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.వలరాజు, నాయకులు ఎం.శ్రీనివాసరెడ్డి, డి.చలమయ్య, ఎం.అల్లూరిరెడ్డి, కె.కొండలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు

గిద్దలూరు, ఏప్రిల్ 24 : గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు వీలుగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి సమస్యలు ఎదుర్కొనే వారు 9491229135 నెంబరుకు ఫోన్ చేసి తెలిపితే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రోత్సాహకాలకు దరఖాస్తులు ఆహ్వానం

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 24: ఇంటర్మీడియట్, పదవ తరగతిలో ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణులైన విశ్వబ్రాహ్మణ సంఘం విద్యార్థులు ప్రోత్సాహం కోసం దరఖాస్తు చేసుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు ఎం శివశంకరాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన 2023-24 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో 800 మార్కులు, పదవ తరగతిలో 500మార్కులు పైన సాధించిన విశ్వబ్రాహ్మణ సంఘం విద్యార్థులకు ప్రకాశం జిల్లా సంఘం కమిటి ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి తెలిపారు. మండల కమిటీ ద్వారా ఈ నెల 30వతేదీ లోపు దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 24: స్థానిక పూల సుబ్బయ్య కాలనీ బిలాల్ మస్జీద్ సమీపంలో హేన్స్ ఆఫ్ కంపాషన్ సంస్థ ఆధ్వర్యంలో ముత్తూట్, ఎం.జార్జ్ ఫౌండేషన్ సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 80 మంది రోగులను పరీక్షించి ఉచిత మందులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు మేనేజర్ బిజక్‌బాబు, ఓఆర్‌డబ్ల్యూలు శభానా, రంగలక్ష్మీ, అలియాభాను తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శేషశయనారెడ్డి



గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 24 : గిద్దలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పట్టణానికి పాలుగుళ్ల నాగశేషశయనారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం కార్యవర్గం ఎన్నిక సందర్భంగా సభ్యులంతా సమావేశమై అధ్యక్షుడిగా శేషశైనారెడ్డి, కార్యదర్శిగా ఉదయగిరి మల్లికార్జునరావు, ఉపాధ్యక్షులుగా షేక్ ఉస్మాన్‌షరీఫ్, ప్రధాన కార్యదర్శిగా చల్లగాలి పోలయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి యాసిన్‌భాషా తెలిపారు.

12 నామినేషన్లు దాఖలు

గిద్దలూరు, ఏప్రిల్ 24 : గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం 12 నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి వేలసంఖ్యలో పార్టీ శ్రేణులు వెంట నడువగా మరోసెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాచర్ల మండలం చినగానిపల్లె గ్రామానికి చెందిన పగడాల పెద్దరంగస్వామి నామినేషన్ దాఖలు చేశారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అభ్యర్థిగా గిద్దలూరుకు చెందిన షేక్ మహబూబ్ భాషా, స్వతంత్ర అభ్యర్థిగా కంభం మండలం రావిపాడుకు చెందిన వరికుంట్ల నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ డమ్మీ అభ్యర్థిగా ముత్తుముల అశోక్‌రెడ్డి సతీమణి ముత్తుముల పుష్పలీల మరోసెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బీజేపీ నాయకులు పిడతల రమేష్‌కుమార్‌రెడ్డి, మరో స్వతంత్ర అభ్యర్థిగా గిద్దలూరు మండలం కొంగళవీడుకు చెందిన బొంతా రంగారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. కొమరోలు మండలం గోపానిపల్లెకు చెందిన వీరంరెడ్డి ఉషారాణి, గిద్దలూరు మండలం ఎగ్గెన్నపల్లికి చెందిన కొప్పుల నరసింహులు మరోసెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. జైభీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థిగా అర్ధవీడుకు చెందిన దాసరి బాబూరావు, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా నెల్లూరు నేతాజీ నగర్‌కు చెందిన ఇసుకల జయరాజ్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అర్ధవీడు మండలం బొమ్మిలింగానికి చెందిన జానావత్ ఠాగూర్‌నాయక్ నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ డమ్మీ అభ్యర్థిగా మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి సతీమణి కుందురు కల్పన మరోసెట్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి నాగజ్యోతికి అందజేశారు.

మార్కాపురంలో 13 నామినేషన్లు దాఖలు

మార్కాపురం, ఏప్రిల్ 24: మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం పదమూడు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి రాహుల్‌మీనా తెలిపారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో టీడీపీ అభ్యర్థులుగా రెండు, వైసీపీ అభ్యర్థులుగా రెండు, జై భీంరావ్ భారత్ పార్టీ, వీకేసీ, యూనియన్ ముస్లిం లీగ్ నుంచి ఒక్కొక్క నామినేషన్ దాఖలయ్యాయి. స్వతంత్రుల నుంచి ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి.

తాటిపర్తి చంద్రశేఖర్ నామినేషన్ దాఖలు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 24 : ఎర్రగొండపాలెం నియోజకవర్గం అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిగా తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం ఎర్రగొండపాలెం ఆర్వో కార్యాలయంలో తమ మద్దతుదారులతో కలసి వెళ్లి నామినేషన్ వేశారు. నామినేషన్ల ఘట్టం ప్రారంభం అయినప్పటినుంచి ఈయన మూడు నామినేషన్లు వేశారు. బుధవారం నియోజకవర్గం నుంచి తరలివచ్చిన అభిమానులు, వైసీపీ కార్యకర్తలు ర్యాలీగా ప్రస్తుతం నాల్గవ సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్ వేసే సమయంలో మద్దతుగా ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైసీపీ కన్వీనరు కె ఓబుల రెడ్డి, అధికారప్రతినిధి నర్రెడ్ల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 23: జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో ఒంగోలుకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటారు. నగరంలోని ది లార్డ్ కృష్ణ షటిల్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన దండు ఆశశ్రీ, విష్ణుకేదార్ మంగళవారం విజయవాడలో జరిగిన అండర్-11, అండర్-17 విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చాటారు. దీంతో రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులో అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ద్వారకానాథ్, అంకమ్మచౌదరిలు మాట్లాడుతూ చిన్నారులు జాతీయ స్థాయిలో రాణించి అకాడమీకి, జిల్లా అసోసియేషన్‌కు మంచి పేరు తీసుకువచ్చారని అభినందించాఉ. కార్యక్రమంలో ది లార్డ్‌కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్ శిద్దా సుధీర్‌కుమార్, ఫౌండర్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, పీడీబీపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌రెడ్డి, కార్యదర్శి పి.విజయ్ కృష్ణ, ట్రెజరర్ అశోక్‌రెడ్డి, దండు శ్రీనివాసరావు, రఘుబాబు, కోడే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దర్శి అసెంబ్లీకి 12 నామినేషన్లు దాఖలు

దర్శి, ఏప్రిల్ 24: దర్శి అసెంబ్లీకి బుధవారం 12 నామినేషన్లు దాఖలయ్యాయి వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావుకు నామినేషన్ పత్రాలు అందజేశారు. టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తరుపున టీడీపీ నాయకుడు కనకం శ్రీనివాసరావు నామినేషన్ వేశారు. కూటమి అభ్యర్థి లక్ష్మి భర్త డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ తరపున టీడీపీ నాయకుడు కర్నా శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తరుపున వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి నామినేషన్ వేశారు. భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా అరిగెల శ్రీనివాసరావు, కాంగ్రెస్ అభ్యర్థిగా పికొండారెడ్డి నామినేషన్‌లు దాఖలు చేశారు. రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా తరుపున కుంచాల కోటేశ్వర రావు, ఆంధ్రరాష్ట్ర ప్రజా సమితి పార్టీ తరుపున తెనాలి రవిబాబు,. స్వతంత్ర అభ్యర్థిగా పుల్లలచెరువు చిన్న నామినేషన్‌లు వేశారు.

కనిగిరిలో పది నామినేషన్లు

కనిగిరి, ఏప్రిల్ 24: కనిగిరి అసెంబ్లీ స్థానానికి బుధవారం పది నామినేషన్లు దాఖలైనట్లు ఆర్‌ఓ జాన్‌ఇర్విన్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ నుంచి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నామినేషన్ దాఖలు చేయగా, వైసీపీ నుంచి దద్దాల నారాయణ నామినేషన్‌తో పాటు మరో నామినేషన్ ఆయన సతీమణి మంజుభార్గవి వేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా దొరడ్ల రాజారావు, షేక్ సుభాహాన్, షేక్ మస్తాన్‌వలి నామినేషన్లు వేసినట్లు ఆర్‌ఓ తెలిపారు. బీఎస్‌పీ నుంచి తాతపూడి ప్రభుదాసు, ఇండియన్ కాంగ్రెస్‌పార్టీ నుంచి దేవరపల్లి సుబ్బారెడ్డి, ఇండియన్ ముస్లింలీగ్ నుంచి షేక్ అల్లాబక్ష్, పిరమిడ్ పార్టీ నుంచి పందిటి అల్లూరయ్యలు నామినేషన్‌లు దాఖలు చేశారు.

ముండ్లమూరులో 70 మంది వలంటీర్లు రాజీనామా

ముండ్లమూరు, ఏప్రిల్ 24: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 70 మంది వలంటీర్లు బుధవారం ఎంపీడీవో డి.శంకరరావుకు రాజీనామా పత్రాలు అందజేశారు. ఆయా గ్రామాల వైసీపీ నాయకులు, మండలస్థాయి నాయకులు వలంటీర్లను ఎంపీడీవోఓ కార్యాలయానికి తీసుకువచ్చి రాజీనామాలు చేయించారు. వీరిలో కొంతమంది అడ్డం తిరిగినా సీఎంకు సంఘీభావంగా రాజీనామా చేయాల్సిందేనని పట్టుబట్టి రాజీనామాలు చేయించారు. మరికొన్ని గ్రామాల్లో మేమెందుకు రాజీనామా చేయాలంటూ మొఖం చాటేశారు. ఒక్కరోజే 70 మంది వలంటీర్లు రాజీనామాలు చేయడం చర్చనీయాంశమైంది.

దర్శిలో 26 మంది..

దర్శి, ఏప్రిల్ 24: దర్శి నియోజకవర్గంలో వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. తాజాగా మండలంలోని రాజంపల్లికి చెందిన పది మంది, పాపిరెడ్డిపాలెంకు చెందిన ఆరుగురు వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. ఎంపీడీవో హనుమంతరావుకు వీరు రాజీనామా పత్రాలు అందజేశారు. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు చేస్తున్న అధికార పార్టీ రాజకీయ కుట్రకు వలంటీర్లు బలి అవుతున్నారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజన వసతి

దర్శి, ఏప్రిల్ 24: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు 300 మందికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం భోజన వసతి ఏర్పాటుచేశారు. ఈపాఠశాలలో ఐదో తరగతిలో చేరేందుకు జరుగుతున్న కౌన్సిలింగ్‌లో వివిధ ప్రాంతాల నుండి సుమారు 300 మంది విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన పేద విద్యార్థులకు తమవంతు సహకారంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తమ్మవరపు ఫణిబాబు, కార్యదర్శి పానుగంటి సత్యనారాయణల ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటుచేశారు.

ఉగ్ర నామినేషన్‌కు భారీగా తరలివెళ్లిన శ్రేణులు

పామూరు/పీసీపల్లి, ఏప్రిల్ 24: టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కనిగిరి లో బుధవారం నామినేషన్ దాఖలు కార్యక్రమానికి పామూరు మండలం నుంచి భారీగా కూటమి శ్రేణులు తరలివెళ్లారు. పామూరులో పార్టీ కార్యాలయం వద్ద వాహనాలకు టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు జెండా ఊపి ప్రారంభించారు.

ఉగ్ర నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు పీసీపల్లి మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. 200పైగా కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలలో సుమారు నాలుగువేలమంది కనిగిరి తరలివెళ్లి ర్యాలీలో పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లుచేయాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ జె.మధుబాబు అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీఆర్‌వోలు తమ పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా లోటుపాట్లు జరిగితే సంబంధిత వీఆర్‌వోపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీటీ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమి అభ్యర్థిని గెలిపించాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 24: టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న గొట్టిపాటి లక్ష్మిని గెలిపించాలని ఆమె సోదరుడు భరత్ కోరారు. తద్వార నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. బుధవారం మండలంలోని లక్ష్మీనగర్, పెద ఉల్లగల్లు ఎస్సీ కాలనీల్లో పర్యటించారు. ముందుగా లక్ష్మీనగర్‌లో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న అనంతరం చినఉల్లగల్లులో ఆశీర్వాదాన్ని పరామర్శించారు. అనంతరం మండలంలోని పూరిమెట్ల, భీమవరం, ఈదర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటు వేసేటప్పుడు మంచి, చెడులను గుర్తించి ఓటు వేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మండలపు వెంకటరావు, మాజీ జడ్పీటీసీ వరగాని పౌలు, నాగరాజు, సోమేపల్లి శ్రీనివాసరావు, కోడెల మస్తాన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలను తీర్చడంలో వైసీపీ వైఫల్యం



కోటపాటి సమక్షంలో టీడీపీలో చేరిన అప్పమాంబపురం గ్రామస్థులు

పామూరు, ఏప్రిల్ 24: ఎన్నో ఆశలతో జగన్‌రెడ్డికి ఓట్లువేసి అఖండ మెజార్టీ కట్టబెట్టిన ప్రజానీకానికి కనీస అవసరాలను కూడా తీర్చలేని అసమర్థ వైసీపీ ప్రభుత్వం అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు ఆరోపించారు. మండలంలోని బొట్లగూడూరు పంచాయతి అప్పమాంబపురం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా కోటపాటి పిలుపుమేరకు కొత్తపల్లి, అప్పమాంబపురం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు అధికార వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈసందర్భంగా కోటపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ గాలి వీస్తుందని చెప్పారు. చంద్రబాబు నాయకత్వం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఇరిగినేని రవీంద్ర, అడుసుమల్లి నరసింహులు, దుద్దకూరి మల్లికార్జున, యోగానంద్, తదితరులు పాల్గొన్నారు.

కదలని మురుగు.. వీడని నిర్లక్ష్యం

పీసీపల్లి, ఏప్రిల్ 24: మండల కేంద్రమైన పీసీపల్లిలోని ఎన్టీఆర్ విగ్రహం సెంటరులో మురుగుకాల్వలు అధ్వానంగా మారాయి. ఈ కాలువలు ప్లాస్టిక్ కవర్లు, డబ్బాలు, సీసాలు, ఇతర వ్యర్థ పదార్థాలతో పూడుకుపోయాయి. పూడిక తొలగించకపోవడంతో పెద్దఎత్తున మురుగు నిలిచిపోవడంతో దుర్వాసన వస్తుంది. దీంతో ఇళ్లల్లో కూడా ఉండలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు వ్యాప్తిచెంది కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



వ్యర్థాలతో నిండిపోయిన మురుగుకాల్వ

కదంతొక్కిన తెలుగుతమ్ముళ్లు



ర్యాలీలో ప్రజల నుద్దేశించి మాట్లాడుతున్న టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

- డాక్టర్ ఉగ్ర నామినేషన్‌కు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- కూటమి శ్రేణులతో కిక్కిరిసిన కనిగిరి పురవీధులు
- ఆద్యంతర పూలవర్షాల నడుమ సాగిన ర్యాలీ

కనిగిరి, ఏప్రిల్ 24: టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నామినేషన్ సందర్భంగా బుధవారం కనిగిరి పట్టణం పసుపుమయమైంది. స్థానిక అమరావతి గ్రౌండ్స్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అశేష జనవాహనితో పురవీధులు కిక్కిరిసి పోయాయి. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. రాజకీయ ప్రత్యర్థులను సైతం అబ్బురపరిచేలా ర్యాలీ సాగటంతో పాటు ఆద్యంతం డాక్టర్ ఉగ్రకు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా పూలవర్షం కురిపించారు. పామూరు బస్టాండు సెంటరులో ఆర్‌కే రెస్టారెంట్ అధినేత గజమాలతో సత్కరించారు. ఈప్రాంతం జన ప్రభంజనంలా మారింది. అక్కడ ప్రజల నుద్దేశించి ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి ప్రాంతాభివృద్ధి గురించి తన సంకల్పాన్ని వివరించారు. అన్నివర్గాల ప్రజలకు అండగా ఉంటానని చెప్పారు. త్రాగు, సాగు నీటి సమస్య పరిష్కారమే తన ముందున్న ప్రధాన లక్ష్యమన్నారు. ప్రచండభానుడి ప్రతాపాన్ని కూడా లెక్కచేయకుండా వేలాదిమంది ప్రజలు, కార్యకర్తలు, శ్రేణులు ర్యాలీ వెంట నడిచారు.

ఉదయం 10.30 ప్రారంభమైన ర్యాలీ నామినేషన్ కేంద్రం వద్దకు వచ్చే సరికి దాదాపు మూడు గంటలు పట్టి మధ్యాహ్నం 1.30కు చేరుకుంది. నామినేషన్ కేంద్రం వద్ద వాహనం దిగుతూ డాక్టర్ ఉగ్ర ప్రజలకు అభివాదం చేస్తూ మీ అభిమానాన్ని ఎన్నడూ మరచిపోనంటూ చేతులెత్తి నమస్కరించారు. ర్యాలీలో టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, కుందురు తిరుపతిరెడ్డి, కోటపాటి జనార్దన రావు, జనసేన ఇన్‌చార్జ్ వరికూడి నాగరాజు, బీజేపీ నాయకుడు కొండిశెట్టి రమణయ్య తదితరులు పాల్గొన్నారు. నామినేషన్ సందర్భంగా డాక్టర్ ఉగ్ర చేపట్టిన ర్యాలీలో జనసేన, బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు, శ్రేణులు జెండాలు చేతపట్టి టీడీపీ శ్రేణులతో కలసి నడిచారు.



పూలవర్షంతో పసుపుమయంగా మారిన కనిగిరి



శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఉగ్ర, కుటుంబసభ్యులు

సర్వమత ప్రార్థనలతో ర్యాలీ ప్రారంభం

తొలుత డాక్టర్ ఉగ్ర, తన కుమార్తె ఉహశ్రీ, తనయుడు జయసింహారెడ్డి, సోదరితో కలసి కేటీఆర్ స్కూల్‌లో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్థానిక ఒంగోలు బస్టాండు సెంటరులో ఉన్న దర్గాలో ప్రార్థనలు చేశారు. తదనంతరం కనిగిరి దుర్గం బాపిస్టు చర్చిలో ప్రార్థనలు చేశారు. పట్టణసమీపంలోని శంఖవరం వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజాలు చేశారు.

కనిగిరి ప్రాంతమంటే ఎంతో మక్కువ

పామూరు బస్టాండు వద్ద ర్యాలీ వాహనంపై డాక్టర్ ఉగ్ర కుమార్తె ఊహశ్రీ మాట్లాడారు. తనకు, తన తమ్ముడు జయసింహారెడ్డికి నాన్న చిన్నవయసు నుంచి అందుబాటులో ఉండేవారు కారు. తమతో నాన్న గడపక పోయినప్పుడు బాధ వేసేది.. ఎప్పుడైనా గుంటూరులో ఇంట్లోకి అలా వస్తారో లేదో కనిగిరిలో ఎవరికో బాగా లేకపోతే తమ ఆసుపత్రికి తీసుకు వచ్చారంటా.. దగ్గరుండి వైద్యం చేయించి వస్తా అంటూ ఆసుపత్రికి వెళ్ళిపోయేవారు. అప్పుడు లోలోపల బాదేసేది. ఇక్కడికి వచ్చాకా, ప్రచారానికి తిరుగుతున్నప్పుడు నాన్న గురించి, ఆయన చేసిన అభివృద్ధి గురించి ప్రజలు చెప్తుంటే ఎంతో సంతోషం అనిపించింది. నాన్న ఎక్కడ ఉన్నా తమ ఆలనా, పాలనలో ఏలోటు చేయలేదు. మానాన్నను గెలిపిస్తే మంచినీటి సమస్య, రోడ్లు సమస్య, ఇతర సమస్యలన్నీ తీరుస్తారని, ప్రజలు విశ్వసించి గెలిపించాలని ఊహశ్రీ అభ్యర్థించారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధిచేసి చూపిస్తా!

- దర్శి కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి



కురిచేడు: పడమరగంగవరం గ్రామంలో మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి

కురిచేడు, ఏప్రిల్ 24: తనను గెలిపిస్తే దర్శి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి హామీ ఇచ్చారు. బుధవారం ఉదయం కురిచేడు మండలం పడమర గంగవరం, గంగదొనకొండ గ్రామాల్లో, సాయంత్రం పొట్లపాడు, అలవలపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఆమె దేవాలయాలు, చర్చిలలో ప్రార్థనలు చేశారు. ముందుగా పడరగంగవరం గ్రామంలో పర్యటించిన లక్ష్మి అక్కడి ప్రజలతో మమేకమై వారితో మాట్లాడారు. మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో వైసీపీ ప్రభుత్వం అలసత్వం వహించిందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేపాపారావు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

దొనకొండ, ఏప్రిల్ 24: టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని డాక్టర్ కడియాల లలిత్ సాగర్ అన్నారు. మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీలోని నారపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరులైన 12 కుటుంబాలు బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ పార్టీ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల నాయకులు బండ్లా వెంకటనారాయణ, చొప్పరపు మైకెల్ బాబు, మిట్టా కోటిరెడ్డి, పెమ్మసాని లక్ష్మీనారాయణ, పోలు ప్రకాశం, జింకా వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దర్శి పట్టణాభివృద్ధికి కృషి

దర్శి, ఏప్రిల్ 24: దర్శి పట్టణ సమగ్రాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి స్పష్టం చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం ఉదయం వాకర్స్‌తో కలిసి ఆమె నడిచారు. వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రజలు పలు సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అందకు స్పందించిన గొట్టిపాటి లక్ష్మి వైసీపీ అసమర్థ పాలనతో అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. టీడీపీ కూటమి నెలరోజుల్లో అధికారంలోకి వస్తుందని, వెంటనే అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో బేళ్ల శ్రీనివాసరావు, హనుమంతరావు, బొగ్గవరపు సుబ్బారావు, అచ్యుత ప్రకాష్, మునగా సాయి, తదితరులు పాల్గొన్నారు.



దర్శి జూనియర్ కళాశాలలో వాకర్స్‌లో కలిసి నడుస్తున్న డాక్టర్ లక్ష్మి



ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన సర్పంచ్ కొండారెడ్డి

వెలిగండ్లలో సర్పంచ్, 21 కుటుంబాలు టీడీపీలో చేరిక

వెలిగండ్ల, ఏప్రిల్ 24: వెలిగండ్ల మండలంలో వైసీపీకి ఊహించని షాక్ తగిలింది మరపగుంట్ల వైసీపీ సర్పంచ్ యడ్ల రాజేశ్వరి, తన తండ్రి కొండారెడ్డి తన అనుచరులతో కలిసి కనిగిరిలో కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర సమక్షంలో బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే, కంకణంపాడు పంచాయతీలో అగ్రహారం గ్రామానికి చెందిన 21 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి ఉగ్ర పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌లు ఆర్థికంగా చితికిపోయారని అన్నారు కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, శ్యామల కాశిరెడ్డి, దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, కొండు భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడిన వంద కుటుంబాలు

తాళ్లూరు, ఏప్రిల్ 23: ఎంపీపీ తాటికొండశ్రీనివాసరావు స్వగ్రామమైన మాధవరం గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో బీసీలు, ఎస్సీలు వైసీపీ వీడి ఎంపీటీసీ టి.నాగలక్ష్మితో పాటు వంద కుటుంబాలు టీడీపీలో చేరారు. మాగుంట రాఘవరెడ్డి, డాక్టర్ లలిత్‌సాగర్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం రాత్రి వారివురు ఎంపీపీ ఇంటివద్దకు వచ్చి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎస్సీ, బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీ, ఎస్సీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ ఎన్నికల్లో ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని, ఎమ్మెల్యేగా గొట్టిపాటి లక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రావులపల్లి నన్నయ్య, పాలెపోగు పురుషోత్తం, మార్క్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఎం.సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ పాలె పోగుదాసు, నుజుం కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాధవరంలో టీడీపీలో చేరిన ఎంపీటీసీ నాగలక్ష్మి, తదితరులు

అలాగే, రామభద్రాపురం గ్రామానికి చెందిన వైసీపీ కీలక నాయకులు షేక్ చినమౌలాలి, నాగూర్ వలిలు బుధవారం దర్శిలోని టీడీపీ అభ్యర్థి లక్ష్మి నివాసంలో మాగుంట రాఘవరెడ్డి, లలిత్‌సాగర్ సమక్షంలో పార్టీలో చేరారు. టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

దర్శి, ఏప్రిల్ 24: అర్హులైన ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ అన్నారు. మండలంలోని రాజంపల్లిలో బుధవారం రాత్రి ఓటర్లకు జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుందన్నారు. ఎన్నికల ప్రక్రియకు ఎవరైనా ఆటంకం కల్గించాలని చూస్తే జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా సాగేందుకు భద్రతాపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. రాజంపల్లిని సమస్యాత్మక గ్రామంగా గుర్తించినందున ప్రత్యేకంగా ఇక్కడకు వచ్చామన్నారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసందర్భంగా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు కట్టుబడి ఉంటామని ప్రజలచేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రత్యేక సాయుధ దళాలు సాహస విన్యాసాలు ప్రదర్శించి ప్రజల్లో మనోధైర్యం నింపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సిశైర్యమన్ పటేల్, దర్శి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు, డీఎస్పీ అశోక్ వర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ జి.సుజాత, సీఐ షేక్ షమీముల్లా పాల్గొన్నారు. అంతకుముందు ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆధ్వర్యంలో మండలంలోని తూర్పు వీరాయపాలెంలో అవగాహన సదస్సు నిర్వహించారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ దినేస్‌కుమార్, పాల్గొన్న ఎస్పీ సుమిత్ సునీల్

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

తాళ్లూరు, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్ని కలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఎస్పీ గరుడ్ సుమిత్‌సునీల్ అన్నారు. గత ఎన్నికల్లో ఘర్షణలు జరిగి తీవ్ర సమస్యాత్మకంగా ఉన్న శివరాంపురం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు జిల్లా యంత్రాంగం, పోలీస్‌శాఖ అన్ని చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజాస్వామ్య స్ఫూర్తి ఇనుమడింపచేసేలా వ్యవహరించాలన్నారు. దర్శి డీఎస్పీఅశోక్ వర్ధన్‌మాట్లాడుతూ గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియకు ఆటంకాలు కల్గించే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఎంపీడీవో యుగకీర్తి మాట్లాడుతూ గ్రామాల్లో నూరుశాతం ఓటింగ్‌కు ఓటర్లు సహకరించాలని కోరారు. ముందుగా స్వాట్ భద్రత టీం గ్రామంలో డిఫెన్స్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్, సీఐ షమీవుల్లా, ఎస్ఐ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

చల్లని గంగాభవానీ

- నేడు గుంటిగంగ తిరునాళ్ల
- విస్తృత ఏర్పాట్లు



అమ్మవారి మూలవిరాట్



గుంటిగంగలోని గంగాభవానీ ఆలయం

తాళ్లూరు ఏప్రిల్ 24: మండలంలోని గుంటిగంగలో కొలువై ఉన్న గంగాభవానీ అమ్మవారు తిరునాళ్లకు ముస్తాబైంది. జిల్లా ప్రజల ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా దేవదాయ శాఖ ఏర్పాట్లుచేసింది. ఏటా చైత్రబహుళ విదియ రోజున గంగా భవానీ అమ్మవారికి తిరునాళ్ల నిర్వహించటం ఆనవాయితీ. సోమవరప్పాడు, తూర్పుగంగవరం, రామభద్రాపురం గ్రామాల్లో ఉత్సవాలు ఆరంభమయ్యాయి. బుధవారం రాత్రి సోమవరప్పాడు గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం గురువారం ఉదయం 6 గంటలకు ఉత్సవాలు మొదలవుతాయి.

గతంలో గంగమ్మకు మొక్కుబడిగా రాజకీయనేతలు పోటాపోటీగా అధికసంఖ్యలో విద్యుత్తుప్రభలు ఏర్పాటుచేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈఏడాది ఎన్నికల కోడ్ ఉన్నందున పార్టీపరంగా కార్యక్రమాలు ఏర్పాటుచేసే అవకాశంలేదు. తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేందుకు పోలీసుబందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ వైవీ రమణయ్య తెలిపారు. తిరునాళ్లకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఆయా సత్రాల్లో ఉచిత భోజన వసతికి ఏర్పాట్లు చేశారు.

గంగమ్మ పేరు ఇలా..

గంగాభవానీ గుడికి దక్షిణంవైపు రాతి గుండు కిందుగా ఒక నీటి ధార ప్రవహిస్తూ ఉండేది. పూర్వం దీనిని గుండుగంగ అని పిలిచేవారు. చుట్టు ప్రక్కలగ్రామాల వారు కాలువ తవ్వి ఆనీటితో తమచవుడు భూములను పంట భూములుగా మార్చుకునేందుకు యత్నించారు. ఆ రాతి గుండును తొలగిస్తే పెద్దజల ఉంటుందని భావించి ఆయా గ్రామాలకు చెందిన రైతులు రాతిగుండును తొలగించారు. జల పెరగకపోగా పెద్దగుంట ఏర్పడింది. అలా అక్కడవెలసిన గుంటగంగ కాలక్రమేణ గుంటిగంగగా మారింది.





● రిటర్నింగ్ అధికారిణికి నామినేషన్ అందజేస్తున్న అనగాని సత్యప్రసాద్

రేపల్లెలో..జనకెరటం





● రేపల్లె నామినేషన్‌కు భారీగా తరలి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

అనగానికి బ్రహ్మారథం

● రహదారులన్నీ పసుపుమయం
● వేలాదిగా తరలి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

రేపల్లె, ఏప్రిల్ 24: జనకెరటం ఉప్పొంగింది, రహదారులన్నీ జనసముద్రం అయ్యాయి. అడుగడుగున యువత తెలుగు తమ్ముళ్ళు, మహిళలు, ప్రజలు నీరాజనాలు పలికారు. హారతులు పట్టారు. పూల వర్షం కురిపించారు. వేలాదిగా తరలి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలసి భారీ ర్యాలీగా తరలివచ్చి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్‌లు దాఖలు చేసేందుకు అనగానికి చేపట్టిన ర్యాలీకి అపురూప స్పందన లభించింది. రేపల్లె పట్టణం అంతా డీజే సౌండ్లు, డప్పు నృత్యాలు, గజ్జల చప్పుళ్ళు మారుమ్రోగాయి. రహదారులన్నీ పసుపుమయంగా మారాయి. రేపల్లె నియోజకవర్గం నుంచి రేపల్లెరూరల్, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల నుంచి భారీగా నాయకులు పార్టీ కార్యాలయానికి తరలి వచ్చారు. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఇంటి వద్ద నామినేషన్‌లకు బయలుదేరే ముందు సోదరిలు డాక్టర్ మంజుల, కమలలు దిష్టి తీసి హారతులు ఇచ్చారు. రేపల్లె గ్రామదేవత అయిన బూరుగలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. మార్కెట్ వద్ద వినాయకుని గుడిలో పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి పార్టీ కార్యాలయానికి వచ్చి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి నామినేషన్ దాఖలు చేసేందుకు ఆర్డీవో కార్యాలయానికి భారీ ర్యాలీతో వెళ్ళారు. కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తమ నామినేషన్ పత్రాన్ని ఆర్వో హేలా షారోన్‌కు అందజేశారు. వీరి వెంట మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, సీనియర్ టీడీపీ నాయకులు, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ వేములపల్లి సుబ్బారావు, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, ఎలక్షన్ ఛీఫ్ కొమ్మూరు వెంకటేశ్‌లు ఉన్నారు.

◆ ప్రజలకు సేవ చేయడానికే వచ్చాను
◆ సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉంది
◆ నిజాయితీ, ముక్కు సూటితనమే నా బలం
◆ కుప్పడం చీరకు భౌగోళిక గుర్తింపు తెస్తాం



అభివృద్ధే నా ఆశయం

◆ చీరాలలో టీడీపీ జెండా ఎగరడం ఖాయం
◆ కూటమి అసెంబ్లీ అభ్యర్థి ఎంఎం.కొండయ్య

బాపట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 'చీరాల అభివృద్ధే నా ఆశయం. దశాబ్దాల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉంది. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటా. టూరిజం డెవలప్‌మెంట్‌పై దృష్టి పెడితే వేలమందికి ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. నిజాయితీగా ఉంటూ ముక్కుసూటిగా మాట్లాడడమే నాబలం బలహీనత. నేను నమ్ముకున్న విలువలు అవే. తొలుత కొంత అపార్థం చేసుకున్నా తర్వాత అర్థం చేసుకున్నవారు నన్ను వీడరు. ప్రచారంలో కూటమి పార్టీల సహకారం మరువలేనిది. ఎన్డీయే అభ్యర్థిగా చీరాలలో టీడీపీ గెలుపు జెండా ఎగురవేస్తా.' అని ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం.కొండయ్య తెలిపారు. ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా ముచ్చటిస్తూ నియోజకవర్గ సమస్యలపై తనకున్న అవగాహనను, వాటి పరిష్కారానికి ఎంచుకునే మార్గాలతో పాటు వైసీపీ పాలనలో జరిగిన సహజ వనరుల విధ్వంసంపై తన అభిప్రాయాలను వెలిబుచ్చారు. అవి ఆయన మాటల్లోనే...

◆ టూరిజంపై దృష్టి

చీరాలకు సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. అపారమైన ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు. కానీ పాలకులు ఆ దిశగా ఆలోచన చేయకపోవడం ప్రజలకు శాపంగా మారింది. టూరిజం డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తా. టెక్స్‌టైల్ పార్కుతో పాటు కుందేరు–రొంపేరు కాల్వ ఆధునికీకరణ, ఫిషింగ్ హార్బర్‌ను పూర్తి చేస్తాం. ఫైర్ ఆఫీస్ గేటు దగ్గర ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తాం, చేనేత క్లస్టర్లను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభింపచేస్తాం. నేతన్నల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. కుప్పడం చీరకు భౌగోళిక గుర్తింపు తెస్తాం

◆ రూ.కోట్లు దోచేశారు..

వైసీపీ నేతలు సహజ వనరులు దోచేయడంలో పోటీ పడ్డారు. ఐదేళ్లలో వారి దోపిడీ అంతులేకుండా సాగింది. ఇసుక దోపిడీలో కోట్లు దండుకున్నారు. రేషన్ మాఫియాకు అధికార పార్టీ నాయకులు ఒత్తాసు పలికారు. అన్ని వర్గాల ప్రజలు వంచనకు గురయ్యాయి. కార్మికులు మొదలు రైతన్నల వరకు ఎవరినీ వైసీపీ వదల్లేదు. అందరినీ మోసం చేసింది. అన్నీ గమనించిన ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయం. ప్రజల్లో మాకు వస్తున్న ఆదరణ ఇందుకే నిదర్శనం.

◆ అవగాహనతో ముందుకు..

బీజేపీ, జనసేన నేతల నుంచి అందుతున్న సహకారం మరువలేనిది. పూర్తి సమన్వయంతో ప్రచారం సాగిస్తున్నాం. అపార్థాలకు తావులేకుండా కలిసి అవగాహనతో ముందుకు సాగుతున్నాం. జనసైనికులు తోడుగా ఉన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే కూటమి ధ్యేయం. ఆయా వర్గాల అభ్యున్నతి కోసం ఎలాంటి ప్రణాళికలు రచించాలో అవగాహన ఉంది. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని అమల్లో పెడతాం.

◆ ఏకతాటిపైకి క్యాడర్

చీరాల టీడీపీ ఇన్‌చార్జిగా పగ్గాలు అందుకునే సమయానికి పూర్తి ప్రతికూల పరిస్థితులు ఉన్నాయి. అప్పుడు నుంచి దూరమైన వర్గాలను దగ్గర చేసుకునే కార్యక్రమాలను విస్తృతంగా చేశా. టీడీపీ క్యాడర్‌ను ఏకతాటిపై నడిపించడంలో శక్తి మేరకు పనిచేశా. వైసీపీ నుంచి పెద్దఎత్తున టీడీపీలోకి చేరికలు సాగుతున్నాయి. రాబోయే రోజుల్లో మరింత మంది వైసీపీ ద్వితీయ శ్రేణి నేతలు పార్టీని వీడడం ఖాయం.

కిలాడి.. మేత

● ఉద్యోగుల ఇళ్ల స్థలాలు కాజేసిన పొన్నూరు వైసీపీ నేత
● అప్పనంగా ఆరు ప్లాట్లు.. రూ.3 కోట్లు ముడుపులు
● ముఖ్యనేత అండతో రెచ్చిపోయిన ఎన్జీవో నేతలు
● సంఘంతో సంబంధం లేని వారికి రిజిస్ట్రేషన్లు
● పూజారులు, అధికార పార్టీ నాయకులు, వ్యాపారులకు ప్లాట్లు

ఇదీ సంగతి..

పొన్నూరు పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇప్పించే లక్ష్యంతో 2004లో ఒక ఎన్జీవో సొసైటీని ఏర్పాటు చేశారు. సాక్షి భవన్నారాయన స్వామి దేవస్థానంకు చెందిన 18 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. సర్వే నెంబర్ 221-1 లోని ఈ భూమిని ఎకరం రూ.4 లక్షలు చొప్పున అప్పటి ఉద్యోగుల నుంచి సేకరించిన సొమ్ముతో కొనుగోలు చేశారు. 3 సెంట్లు చొప్పు న 98, 4 సెంట్లు చొప్పున 146 ప్లాట్లను ఏర్పాటు చేశా రు. అప్పట్లో ఈ విషయంలో వివాదం తలెత్తడంతో రిజిస్ట్రే షన్ ప్రక్రియ మధ్యలోనే ఆగిపోయింది. అప్పట్లో వున్న చాలామంది ఉద్యోగులు పదవీ విరమణ పొందగా, కొం దరు మరణించారు. కొద్దిరోజుల క్రితం ప్లాట్ల రిజిస్ట్రేషన్ కు మార్గం సుగమం కావటంతో ఎన్జీవో నేతలు పొన్నూ రు నియోజకవర్గ ప్రజాప్రతినిధిని సంప్రదించారు. రిజి స్ట్రేషన్ ప్రక్రియలో సహకరించాలని కోరారు.



గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పొన్నూరులోని ఆ వైసీపీ నేత కన్ను పడితే అంతే. ముడుపులు అయితే ఇంటికి వెళ్ళాలి. స్థలాలు.. పొలాలు అయితే ఆయన బినామీల పేరుతో మారాలి. గడచిన ఐదేళ్ల కాలంలో ఎంత తిన్నా ఆకలి తీరని ఆయన చివరకు చిన్నా చిత క ఉద్యోగుల ఇళ్ల స్థలాలకు ఎసరు పెట్టేసారు. ఎన్జీవో(నాన్ గజిటెడ్ అసోసియేషన్)లకు చెందిన ఇళ్ల స్థలాలను తన బినామీల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అంతటితో ఆగకుండా రూ.6 కోట్లు ఖర్చుల రూపేనా వసూలు చేయించి అందులో రూ. కోట్లు ముడు పులు కింద కొట్టేశారు. నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి అండతో అక్కడున్న ఎన్జీవో నేతలు రెచ్చిపోయారు. ఒక్కొక్కటి రూ.40 లక్షలు విలువ చేసే ప్రభుత్వ ఉద్యోగుల ఇళ్ల ప్లాట్లను టోకున అమ్మేశారు. పూజారులు, వ్యాపారులు, వైసీపీ నాయకులను ఉద్యోగుల కింద చేర్చేసి రిజిస్ట్రేషన్‌లు చేశారు. పొన్నూరు వైసీపీ ముఖ్య మేత, ఎన్జీవో నేతలు ఆడిన ఆ ప్లాట్లాటలో అర్హులైన ఉద్యోగులకు అన్యాయం జరి గింది. ఇప్పటికే రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో ఇక్కడ జరిగిన అక్రమాలపై కేస్ ఫైల్ అయ్యింది.

పక్కా సెటిల్‌మెంట్

ఎన్జీవో సంఘ నేతలు సంప్రదింపుతో అప్రమత్తం అయిన నియోజకవర్గ నేత కొన్ని ప్లాట్లు తనకు రిజిస్ట్రేషన్ చేయాలని సూచిం చారు. కనీసం 10 ప్లాట్లు అయినా తనకు కావాలని పట్టుపట్టారు. చివరకు 6 ప్లాట్లు, వసూలు చేసిన సొమ్ములో సగం ఇచ్చేటట్లు ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియకు తెరలేపారు.

★ అన్నీ అక్రమాలే..

నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి అండతో అక్కడి ఎన్జీవో నేతలు తోటి ఉద్యోగుల ప్రయోజనాలను తుంగలో తొక్కేశారు. అసలు ఉద్యోగులు కాని వారికి ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేశారు. అందుకోసం అనేక అడ్డదారులు తొక్కేశారు. ఒక్కొక్క ప్లాట్ రిజిస్ట్రేషన్ కు ఉద్యోగుల వద్దనుంచి ఖర్చులు కింద రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలు వరకు వసూలు చేశారు. ప్రస్తుతం అక్కడ మంచి ధర ఉండటంతో ఒక్కొక్క ప్లాట్ రూ.40 లక్షల వరకు పలుకుతుంది. దాన్ని సాకుగా చూపించి ప్రతి ఉద్యోగి వద్ద నుండి వీలైనంత ఎక్కువ గుంజేశారు. అసలు ఉద్యో గులు కాని వారికి ప్లా ట్లు కట్టబెట్టారు. అందు కోసం రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. భూమి కొనుగోలుకు నగదు చెల్లించి మధ్యలో మరణిం చిన వారి ప్లాట్లను వారి పిల్లలకు ఇవ్వకుం డా బయట అమ్మేసినట్లు తెలుస్తోంది.

★ తిలా పాపం.. తలా పిడికెడు

మొత్తం మీద పొన్నూరు ఎన్జీవో ప్లాట్లలో భారీగానే వసూలు చేసినట్లు ఆ రోపణలు ఉన్నాయి. అధి కారిక లెక్కలు ప్రకారం సుమారు రూ.6 కోట్ల వరకు చేతులు మారినట్లు చెబుతున్నారు. అందు లో రూ.3 కోట్లు ముఖ్య నేతకు వెళ్లగా, మిగిలిన సొమ్ము ఎన్జీవో నాయకులు వాటాలు వేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గుం టూరులోని ఒక కార్యాలయంలో కొందరు నాయకులు డబ్బులు పంచుకునే విధానాన్ని బాధితుడు వీడియో తీసి మీడియాకు అందించారు. ఈ అక్రమాలపై అక్కడి ముఖ్య నేతలు ఇప్పటికే హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఉద్యోగ సం ఘ నాయకులపై కూడా ఏసీబీకి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది.

భారీగా స్టాంప్ డ్యూటీ ఎగవేత?

ఎన్జీవో సంఘం పేరిట పొన్నూరులో జరిగిన ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భారీగా స్టాంపు డ్యూటీ ఎగవేసినట్లు తెలుస్తోంది. నియోజకవర్గ ముఖ్యనేత ఒత్తిడి కి తలొగ్గిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నామమాత్రపు స్టాంపు డ్యూటీతో ప్లాట్లను బదలాయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి స్టాంపు డ్యూటీ మినహాయింపు పొందాలంటే ప్రభుత్వం ప్రత్యేక అనుమతి ఇవ్వాలి. అటువంటిది ఇక్కడ ఏమి జరగలేదని అంటున్నారు. ఒక వేళ అటువంటి వెసులు బాటు వున్నా అది కేవలం ఎన్జీవో జాబితాలో ముందు నుంచి ఉన్నవారికి మాత్రమే వర్తిస్తుంది. ఇక్కడ ఇష్టం వచ్చినట్లుగా, జాబితాతో పనిలేకుండా ప్రక్రియ జరిగి నందువల్ల స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయానికి భారీగా గండి పడినట్లు సమాచారం.

అసలు ఉద్యోగులే కాదు

పొన్నూరు ఎన్జీవో నేతలు అంతులేని అక్రమాలకు తెరలేపారు. అసలు ఉద్యోగులు కానివారికి ప్లాట్లు రిజిస్టర్ చేశారు. ఉదాహరణకు.. పోతన వెంకట్రావు పేరుతో ప్లాట్ నెంబర్: 21ని డాక్యుమెంట్ 4705/2023 ద్వారా రిజిస్టర్ చేశారు. అతను ఎన్జీవో సంఘానికి చెందిన వారు కాదని తెలుస్తోంది. ప్లాట్ నెం బర్:211ను వి.సత్యనారాయణకు డాక్యుమెంట్ 4775/2023 ద్వారా రిజిస్టర్ చేశారు. ఆయన కూడా ఎన్జీవో కాదని తెలుస్తుంది. జాబి తాలో మరొకరి పేరు ఉండగా, ఈయన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించడం గమనార్హం. ఇప్పటి వరకు మొత్తం 200 ప్లాట్లు వివిధ వ్యక్తుల పేరిట రిజిస్టర్ కాగా, అందులో అధిక భాగం ఇతరుల ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్అండ్‌బీలో పనిచేసే ఉద్యోగుల పేరిట కొన్ని ప్లాట్లు రిజిస్టర్ కాగా అదే రోజున వాటిని వేరే వారి పేరు మీదకు మార్చేశారు. నియోజకవర్గ నేత బినామీలకు అదే పద్దతిలో రిజిస్ట్రేషన్ జరిగింది.





గుర్తుతో బెలూన్‌లు, బాలాజీ బొమ్మతో ఉన్న టీషర్టులు

పట్టుకున్నారు.. మరి కేసు?

● 1525 వైసీపీ అభ్యర్థి టీ షర్టులు స్వాధీనం
● పిట్టలవానిపాలెం చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో గుర్తింపు
● పర్చూరు వైసీపీ అభ్యర్థి యడం బాలాజీ పేరుతో రశీదు

బాపట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా సామగ్రి, నగదు, తాయిలాలకు సంబంధించిన వస్తువులు తరలిస్తుంటే సీజ్ చేసి కేసు నమోదు చేస్తాం.. అని ఎన్నికల అధికారులతో పాటు పోలీసులు నిత్యం హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయితే బుధవారం పిట్టలవానిపాలెం చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో భాగంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రిపై కేసు నమోదు చేయలేదు. ఇందుకు సంబంధించి పర్చూరు వైసీపీ అభ్యర్థి ఎడం బాలాజీ బొమ్మతో ఉన్న 1525 టీ షర్టులతో పాటు 500 ఫ్యాన్ గుర్తుల బెలూన్లను పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టీ (స్టాటస్టిక్ సర్వేలైన్స్ టీమ్స్)తో పాటు పోలీసులూ సంయుక్తంగా సోదాలు నిర్వహించగా హైదరాబాద్ నుంచి చీరాల వెళుతున్న ట్రావెల్ బస్సులో వీటిని గుర్తించారు. వీటికి సంబంధించి రిసీవింగ్ రశీదు ఎడం బాలాజీ పేరు మీద ఉన్నట్లు సమాచారం. వీటిని చందోలు పోలీస్ స్టేషన్‌కు తరలించగా జీఎస్‌టీ అధికారులు వచ్చి వాటి విలువను లెక్కకట్టారు. అయితే సంబంధిత ఆర్వో అనుమతి లేకుండా రూ.10 వేలకు మించి సామగ్రి కొనుగోలు చేయాలి లేదంటే కేసు నమోదు చేయాలని నిబంధనలు చెబుతున్నాయి. అయితే పిట్టలవానిపాలెం వద్ద పోలీసులు పట్టుకున్న వాటి విలువ దాదాపు లక్ష రూపాయలపైనే ఉండొచ్చని తెలుస్తోంది. కానీ కేసు నమోదు లేకపోగా ఆ సామగ్రిని స్టేషన్‌లో ఉంచడంతో సరిపెట్టారు.

హామీలిచ్చి వంచన

● ఒక్క వాగ్దానం నెరవేర్చని జగన్
● కృష్ణానదిపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణం ఎక్కడ?
● రేపల్లె న్యాయయాత్రలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల



మాట్లాడుతున్న వైఎస్ షర్మిలా

రేపల్లె, ఏప్రిల్ 24: అధికారం కోసం జగన్ ఎన్నో హామీలు ఇచ్చారు.. ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక్క వాగ్దానం కూడా నెరవేర్చలేదు. ప్రజలను వంచించారు.. అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రేపల్లెలో షర్మిల న్యాయయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సభలో ప్రసంగించారు. గత ఎన్నికల సమయంలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో ఒక్కటైన అమలైందా అని ప్రజలు ఆలోచించాలని తెలిపారు. పదేళ్లలో అభివృద్ధి గురించి ఆలోచించిన దాఖలాలు లేవన్నారు. ఏ వర్గానికి న్యాయం చెయ్యనిపరిస్థితి నెలకొందన్నారు. రైతులకు లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని, కృష్ణానదిపై రెండు చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తామని హామీ ఇచ్చిన జగన్ ఐదేళ్లుగా వాటి విషయం మరిచిపోయారన్నారు. ఆక్వా రైతులను ఆదుకునేందుకు ఆక్వా పార్కును ఏర్పాటు చేస్తామన్న హామీ హామీగానే మిగిలిపోయిందన్నారు. రేపల్లెలో 100 పడకల అస్పత్రి ఏమైందని ప్రశ్నించారు. నిజాంపట్నం హార్బర్‌ను అభివృద్ధి చేస్తామన్నారని, కానీ కనీసం 20 శాతం పనులు కూడా చేసిన దాఖలాలు లేవన్నారు.

వైఎస్‌ను తిట్టిన వారికే పెద్దపీట

దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌ను తిట్టిన వారికే జగన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. వైఎస్ సతీమణి తన తల్లి విజయమ్మను సైతం అవమానపరిచిన వారిని జగన్ వెనకేసుకు వచ్చారన్నారు. పైగా వారినే పక్కన పెట్టుకుని తండ్రి లాంటి వారని సంభోదిస్తూ ఓట్లు అడగడాన్ని ఎద్దేవా చేశారు. జగన్ తన క్యాబినెట్‌లోకి తీసుకున్న మంత్రులంతా వైఎస్‌ని తిట్టిన వారేనన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మొదలు విడదల రజిని, రోజా అందరూ వైఎస్‌ను తిట్టిన వారేనన్నారు. వీరందరూ జగన్‌కు కావాల్సిన వాళ్లయ్యారని, ఇలాంటి వారంతా జగన్‌కు తండ్రులు, అక్కలు, చెల్లెళ్లని సంభోదిస్తున్నారని తెలిపారు. నిజంగా వైఎస్ కోసం నిలబడినవారు, జగన్ కోసం పాదయాత్రలు చేసిన వారు , జగన్ కోసం పనిచేసిన వారు ఎటుపోయారు, ఏమయ్యారని ప్రశ్నించారు.

రైతులను నాశనం చేసిన జగన్

జగన్ పాలనతో రాష్ట్రంలో అప్పులేని రైతు అంటూ లేడని షర్మిల తెలిపారు. అన్నదాతలను సీఎం నాశనం చేశారని ప్రశ్నించారు. మద్దతు ధర, ధరల స్థిరీకరణ నిధి ఎక్కడన్నారు. ఐదేళ్లలో పంట నష్ట పరిహారం మాటే మరిచారన్నారు. బాపట్ల లోక్‌సభ అభ్యర్థి జేడీ శీలం, సీపీఎం రాష్ట్ర నాయకురాలు డి.రమాదేవి మాట్లాడుతూ వైసీపీ, టీడీపీ మోదీ చేతిలో కీలు బొమ్మలా తయారయ్యాయన్నారు. దేశాన్ని అన్ని విధాలా మోదీ ప్రభుత్వం నాశనం చేసిందని తెలిపారు. మతాల మధ్య చిచ్చులు పెట్టే విధంగా దేశంలో పాలన కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మోపిదేవి శ్రీనివాసరావు, నాయకులు కేసన రామకోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు అంజిబాబు, సీపీఎం నాయకులు సీహెచ్ మణిలాల్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల పార్లమెంట్ ఎలక్షన్ కోఆర్డినేటర్‌గా గరటయ్య



అద్దంకి, ఏప్రిల్ 24: టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఎలక్షన్ కోఆర్డినేటర్‌గా అద్దంకి మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు డాక్టర్ బాచిన చెంచుగరటయ్యను నియమించారు. నాలుగు దశాబ్దలకు పైగా రాజకీయాల్లో ఉన్న గరటయ్య టీడీపీ తరఫున పలు పర్యాయాలు అద్దంకి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దశాబ్ద కాలంగా వైసీపీలో ఉన్నారు. గత ఎన్నికలలో వైసీపీ తరపున అద్దంకి నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. కుమారుడు కృష్ణచైతన్య నాలుగేళ్లుగా అద్దంకి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా ఉండగా, 4 నెలల క్రితం పాణెం హనిమిరెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో గరటయ్య, కృష్ణచైతన్య వైసీపీని వీడి ఇటీవల చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ ఎలక్షన్ కోఆర్డినేటర్లను నియమించిన నేపథ్యంలో అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలలో 4 దశాబ్దాలకు పైగా రాజకీయంలో ఉన్న గరటయ్యకు సముచిత స్థానం కల్పించడంపై బాచిన వర్గీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

7వ రోజు తొమ్మిది నామినేషన్లు

చీరాల, ఏప్రిల్ 24 : ఎన్నికల వేళ నామినేషన్లు వేసే వారి సంఖ్య పెరుగుతోంది. 7వ రోజు బుధవారం వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కలపి 7 నామినేషన్లు దాఖలైనట్లు ఈఆర్వో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. కరణం వెంకటేష్ (యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ), మద్దులూరి మాలకొండయ్య (తెలుగుదేశం పార్టీ), బాలకొండమ్మ మద్దులూరి (తెలుగుదేశం పార్టీ, సబ్స్టిట్యూట్), షేక్ అబ్దుల్ బషీర్ (ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్), దేవరపల్లి రంగారావు (స్వతంత్ర అభ్యర్థి) ఆసాది ఆంజనేయులు (స్వతంత్ర అభ్యర్థి) వారివారి నామినేషన్ పత్రాలు స్వయంగా అందజేశారు. ఆమంచి సుజాత (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, సబ్స్టిట్యూట్) తరఫున ఆమె ప్రతినిధులు నామినేషన్ పత్రాలను అందజేశారు.

కొండయ్య ఆస్తి రూ.19.48కోట్లు

చీరాల, ఏప్రిల్ 24 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య బుధవారం ఓ సెట్ నామినేషన్ పత్రాలను ఈఆర్వో సూర్యనారయణరెడ్డికి అందజేశారు. నామినేషన్ పత్రాలలో పొందుపరిచిన అఫిడవిట్‌లో కొండయ్య (మద్దులూరి మాలకొండయ్య) ఆస్తుల విలువ రూ.19,48,16,505గా పేర్కొన్నారు. అందులో కొండయ్య పేరున రూ.11,82,81,880, ఆయన భార్య బాలకొండమ్మ పేరున రూ.7,65,35,625 ఆస్తులు ఉన్నట్లు చూపారు. కొండయ్య పేరున రూ.1,46,05,579, భార్య పేరున రూ.2,26,11,680 అప్పులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇరువురి వద్ద నగదు రూ.5,15,200 ఉన్నట్లు చూపారు. నేరచరిత్ర లేదని పేర్కొన్నారు.

అసెంబ్లీ అభ్యర్థులుగా 12 మంది నామినేషన్‌లు

పర్చూరు, ఏప్రిల్ 24 : పర్చూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థులుగా బుధవారం 12 మంది నామినేషన్‌లు దాఖలు చేసినట్లు ఆర్వో రవీందర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నల్లగొర్ల శివశ్రీలక్ష్మీజ్యోతి నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏలూరి సాంబశివరావు తరుపున నామినేషన్ దాఖలైంది. ఇండిపెండెంట్ అభ్యర్థిగా అలోకం రమష్‌బాబు, రాడికల్ పార్టీ ఆప్ ఇండియా అభ్యర్థిగా యరిజర్ల ఉద్యుత్ కుమార్, మూడు నామినేషన్‌లను దాఖలు చేశారు. అదేవిధంగా చిమట హనుమంతురావు (ఇండిపెండెంట్), గాలి చింపిరయ్య (ఇండిపెండెంట్), దీపక్ గోపాళం, యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ, యడం బాలాజీ యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ, , శానం సురేష్, జైభీంరావ్ భారత్ పార్టీ తరుపున నామినేషన్‌లను ఆర్వో గంధం రవీందర్‌కు అందజేశారు.

వైసీపీ పాలనలో సంక్షోభంలో వ్యవసాయం

- అన్నదాతల సంక్షేమమే కూటమి లక్ష్యం
- చంద్రన్న హయాంలో స్వర్ణయుగం
- రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీలోకి రండి
- ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి పిలుపు
- పావులూరు, వింజనంపాడులో వైసీపీ వీడి టీడీపీలోకి చేరికలు


ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన పావులూరు ఎస్సీలు

పర్చూరు, ఏప్రిల్ 24 : అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైసీపీ పాలనలో సంక్షోభానికి గురైందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం పావులూరు, వింజనంపాడు గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా జగన్ వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేసారని ఏలూరి మండిపడ్డారు. దేశానికి అన్నంపెట్టే అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. అన్ని వ్యవస్థలతోపాటు, వ్యవసాయ రంగాన్ని జగన్ ధ్వంసం చేశారన్నారు. అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

టీడీపీ హయాంలోనే రైతులకు స్వర్ణయుగం

చంద్రబాబు పాలనలోనే రైతులకు స్వర్ణయుగంగా ఉందని, వైసీపీ ప్రభుత్వంలో అన్నదాలలు అప్పుల య్యారన్నారు. రాష్ట్రంలో ఇసుక, మట్టి, మద్యం, మైన్, ల్యాండ్ మాఫిమా కొనసాగుతుందన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి రావాల్సిన ఆవస్యకత ఉందన్నారు.

వైసీపీకి గుడ్‌బై చెప్పిన పావులూరు, వింజనంపాడు

మార్టూరు : మే 13న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఇంకొల్లు మండలం పావులూరు, యద్దనపూడి మండలం వింజనం పాడు గ్రామాలకు చెందిన వైసీపీ మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు ఏలూరి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఏలూరి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. జగన్‌రెడ్డి విధ్వంస పాలనపై విసుగు చెంది, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం వైసీపీకి గుడ్‌బై చెప్తున్నారన్నారు. చేరుతున్న వారికి టీడీపీ తప్పనిసరిగా గౌరవం ఇస్తుందన్నారు. ఒక్కచాన్స్‌తో వచ్చి రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్‌రెడ్డికి మరోచాన్స్ లేకుండా ఓటుతో పంపాలన్నారు. పార్టీలో చేరిన పావులూరు ఎస్సీ కాలనీకి చెందిన వలేరు ఏసోబు, పాగాల వీరయ్య, వలేరు నాగరత్తయ్య, ఎండ్లూరి ఆదాం, బత్తుల కోటేశ్వరరావు, పల్లపాటి సుబ్బారావు, రావూరి రామయ్య, తెళ్ల బుజ్జి, తెళ్ల ఆదియ్య, పాగల రాంబాబు, బత్తుల ఏసుబాబు, జొన్నలగడ్డ మహిమ కుమార్, సిరిమెల వివేక్, కట్టింపూడి నాగార్జున, వలేరు చిరుతేజ, పాగాల పూర్ణ, ఎండ్లూరి గాంధీ, సోమ ఇజ్రాయేల్, చుండూరి మరియబాబు, వలేరు చిన్న బ్బాయి, సిరిమల కల్యాణ్ తదితరులు ఉన్నారు. అదే విధంగా వింజనంపాడు గ్రామం నుంచి కె.నాగేశ్వరావు, గంగవరపు సురేష్, మేక అంకమ్మ కోరేల లూథర్ తదితరులు పార్టీలో చేరారు. అనంతరం ద్రోణాదుల గ్రామానికి చెందిన తాళ్లూరి రామయ్య పార్టీలో చేరారు. కార్యక్రమంలో కనపర్తి నాగేశ్వరావు, రావిపాటి సీతయ్య, గుదే తారక రామారావు, కొర్రపాటి కాజారావు పాల్గొన్నారు.


యనమదల గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఏలూరి

కూటమి ప్రభుత్వాన్ని గెలిపించండి

యద్దనపూడి, (మార్టూరు) : టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం యద్దనపూడి మండల పార్టీ నాయకులతో కలిసి మండలంలోని యనమదల, అనంతవరం, సూరవరపుపల్లె గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ మూడు గ్రామాలలో ఏలూరి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించిన ఆయన మహిళలు, వృద్ధులతో మాట్లాడారు. వైసీపీ అరాచకాలు, దోపిడీ, అవినీతిని వివరించారు. గ్రామాల్లో సహజ సంపదైన గ్రావెల్, చెరువు మట్టిని వైసీపీ నాయకులు దోచుకొని లక్షలు పోగేసుకున్నారన్నారు. యద్దనపూడి మండలంలో రోడ్లను పట్టించుకున్న వారే లేరన్నారు. ధరల నియంత్రణ, పన్నుల భారం తగ్గాలంటే చంద్ర బాబు ప్రభుత్వం అధికారంలోకి రావలసిందేన న్నారు. మహిళలను ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేలా చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. జగన్‌రెడ్డి అసమర్థ పాలనన చూసిన మీరంతా రాష్ట్రం కోసం, పిల్లల భవిష్యత్ కోసం కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలిపాలని ఏలూరి కోరారు. సైకిల్ గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యేగా తనను, ఎం పీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మూడు గ్రామాల ప్రజలు, మహిళలు ఏలూరికి ఎదురెళ్లి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, బోయపాటి సాంబయ్య, రావి పాటి సీతయ్య, గుదే తారక రామారావు, వంశీ, కోయ సతీష్ పాల్గొన్నారు.


జ్ఞాపికలు అందజేస్తున్న సెయింట్ ఆన్స్ కళాశాల ప్రతినిధులు

అవకాశాలతో ఉన్నతంగా ఎదగాలి

చీరాల, ఏప్రిల్ 24 : తమ కళాశాల నుంచి చదువు పూర్తి చేసుకుని వెళుతున్న విద్యార్థులు అవకాశాలు అందిపుచ్చుకుని, జీవితంలో ఉన్నతంగా ఎదగాలని సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు అన్నారు. కళాశాలలో సీఎస్ఈ ఆఖరి సంవత్సరం పూర్తిచేసుకున్న విద్యార్థులకు బుధవారం కళాశాలలో వీడ్కోలు సభ నిర్వహించారు. పలువురుకి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ పి.హరిణి, అక్రిడిటేషన్స్ డైరెక్టర్ డాక్టర్ సి.సుబ్బారావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వి రమణ మూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీరాలకు వచ్చిన ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్

చీరాల, ఏప్రిల్ 24 : బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రేపల్లె, పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు నియోజకవర్గాలకు సంబంధించి ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్ ఖాజాసింగ్ బుధవారం చీరాలకు వచ్చారు. ఆయన మండలం వాడరేవులో ఐటీసీ అతిథి గృహానికి చేరుకున్నారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఏజెంట్లు, ప్రజలు తమకు సంబంధించి అభ్యర్థనలను ఆయన దృష్టికి తీసుకెళ్లవచ్చని అవసరమైన వారు 8985382855 ఫోన్‌లో సంప్రదించాలని ఆయన ప్రతినిధులు సూచించారు. ప్రతి రోజు ఉదయం 10 గంటలలోపు అందుబాటులో ఉంటారని ఆయన ప్రతినిధులు తెలిపారు.

కూటమితోనే సుపరిపాలన

చినగంజాం, ఏప్రిల్ 24 : టీడీపీ కూటమి ప్రభుత్వ ఏర్పాటుతోనే సుపరిపాలన అందుతుందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయకుమార్, టీడీపీ మండలాధ్యక్షుడు పొద వీరయ్య అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో కూటమి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎంపీ అభ్యర్థి టీ కృష్ణ ప్రసాద్‌లను సైకిల్ గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం టీడీపీ కూటమి నాయకలు విస్తృతంగా ప్రచారం చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనం తరం అంబేడ్కర్ నగర్‌లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో ప్రజలెవరూ సంతోషంగా లేరన్నారు. ఐదేళ్లుగా అరాచకాలు, దౌర్జన్యాలు, దాడులతో అన్నివర్గాలు భయాం దోళనకు గుర య్యారన్నారు. అందరూ ప్రశాంతంగా ఉండాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, అజాద్, చెరుకూరి రాఘవయ్య, టీ.జయరావు, సందు శ్రీనివాస రావు, బెల్లంకొండ రమేష్‌బాబు, నరహరి శ్రీనివాసరావు, పి.పార్ధసారిధి, గంటా చెన్నయ్య, టి.దుర్గారావు, సీహెచ్.రవణమ్మ, సందు శ్రీనివాసరావు, సతీష్, నరహరి గోపి, షేక్ నబీషా, షేక్ జిలాని, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాలను చేరుకోవాలి

ఎమ్మెల్సీ లక్ష్మణరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

చీరాలటౌన్, ఏప్రిల్ 24 : విద్యార్థులు పట్టుదలతో లక్ష్యాలను చేరుకోవాలని తద్వారా ఉన్నతంగా రాణిస్తారని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. సెయింట్‌మార్క్స్ లూథరన్ జూనియర్ కలాశాలలో గ్రూప్-2 అభ్యర్థులకు మెయిన్స్ ఉచిత శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ ముందుగా అందరూ సిలబస్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. చీరాల, చుట్టు పక్కల విద్యార్థులకు ఉచిత శిక్షణ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కష్టపడి చదవడం కంటే ఇష్టపడి అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో డా.ఐ.బాబూరావు, డా.శ్యామసుందర్ రాజు, కళాశాల కరస్పాండెంట్ విద్యాసాగర్, జయశీలరావు, పుష్పరాజ్, భగవాన్‌దాస్, ఎం.బాబురావు, హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతియుతంగా ఎన్నికలకు సహకరించాలి

పంగులూరు, ఏప్రిల్ 24 : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ తిరుపతిరావు కోరారు. ఈ సందర్భంగా పంగులూరు, బూదవాడ, కల్లంవారిపాలెం, మల్లవరం గ్రామాలలో ఎస్ఐ తిరుపతిరావు, కేంద్ర బలగాలు, పోలీసులతో కవాతు నిర్వహించారు. రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రధాన కూడళ్ల వద్ద వాహనాలను తనిఖీ చేశారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ కోరారు.

అనుమతులు వచ్చేవరకు గుడి నిర్మాణం వద్దు

- దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి
- పనులకు సహకరించాలని గంగవరం గ్రామస్థుల వినతి

గంగవరం (ఇంకొల్లు), ఏప్రిల్ 24 : మండలంలోని గంగవరం కోందరామ స్వామి దేవాలయం ఆవరణను దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి బుధవారం పరిశీలించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎన్నికల అనంతరం చట్టప్రకారం దేవదాయ శాఖ అనుమతులు పొంది ఆలయ నిర్మాణానికి శాఖాపరంగా తమ వంతు కృషి చేస్తామన్నారు.అనుమతులు లేకుండా ఎటువంటి ఆలయ పనులు చేయవద్దని హెచ్చరించారు. ఈ దేవాలయం కూల్చివేత, అభివృద్ధి పనులు చేసే విషయంలో అనుమతులు లేకుండా గ్రామస్థులు పనులు చేపట్టడంపై ఇంకొల్లు గ్రూప్ దేవాలయాల కార్య నిర్వహణాధికారి మీనిశెట్టి శ్రీనివాసరావును రెండురోజుల కిందట సస్పెండ్ చేస్తూ చేస్తూ దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు పంపారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి ఆలయ ప్రాంతాన్ని పరిశీలించారు. కానీ గ్రామ స్థులు ఆలయ నిర్మాణ పనులు జరిగేలా అధికారులు సహకరించాలని విన్నవించారు.

తాగునీటి చెరువుల పరిశీలన

నిండేవరకూ నీరివ్వాలని అధికారులకు సర్పంచ్‌ల విజ్ఞప్తి

ఇంకొల్లు, ఏప్రిల్ 24 : ఇంకొల్లు మండలంలోని భీమవరం, కొణికి గ్రామాల్లోని తాగునీటి చెరువులను ఎన్నెస్పీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం కోటపాడు మేజరులో పావులూరు మైనరుకు నీటిని విడుదల చేసామని నీరు వృథా కాకుండా చెరువులను సాధ్యమైన మేరకు నింపాలని సూచించారు. తాగునీటి కోసం గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు సర్పంచ్‌లను అడిగి తెలుసుకున్నారు. తాగనీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలంటే వారం రోజులపాటు నీటిని విడుదల చేస్తే కానీ పూర్తి స్థాయిలో చెరువులు నిండుతాయని సర్పంచ్‌లు అధికారులకు విన్నవించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్నెస్పీ డీఈ స్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విద్యాసాగర్, ఏఈ జ్యోతి, ఎన్నెస్పీ ఏఈ బాలకృష్ణనాయక్, ఎంపీడీవో శ్రీదేవి, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, డీపీవో రవికుమార్, భీమవరం, కొణికి సర్పంచ్‌లు స్వామి, ఆదియ్య పాల్గొన్నారు.


చెరువులను పరిశీలిస్తున్న అధికారులు

రైతులను దగా చేసిన జగన్‌రెడ్డి

ఓటుతో గద్దె దింపండి : ఇంటింటి ప్రచారంలో కమల్‌కిషోర్


ప్రచారం నిర్వహిస్తున్నబాబీ

బల్లికురవ, ఏప్రిల్ 24 : రైతులను దగా చేసిన జగన్‌రెడ్డిని గద్దె దింపాలని యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) అన్నారు. బుధవారం అద్దంకి నియెజకవర్గ టీడీ పీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా కమల్‌కిషోర్ మం డలంలోని వెలమవారిపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి టీడీపీ ప్రవేశ పెట్టిన ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించి ఎన్నికలలో సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మీ ఓటే రాష్ట్ర భవిష్యత్‌ను మార్చేదన్నారు. అక్కడున్న రైతులనుద్దేశించి బాబీ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రైతులకు జరిగిన మేలును గుర్తు చేశారు. సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, సోలార్ మోటార్లు, డ్రిప్‌లు, ట్రాకక్టర్లను అందించారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క పరికరాన్ని ఇవ్వలేదన్నారు. పంటకు గిట్టుబాటు ధర రాక, పోయిన పంటలకు పరిహారం రాక పలు చోట్ల రైతులు ఆత్మహత్య చేసుకున్నారని బాబీ ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం మృతిచెందిన రైతు కుటుంబాలను జగన్‌రెడ్డి పరామర్శించి, వారిని ఆదుకున్నపాపాన పోలేదని ధ్వజమెత్తారు. ఆర్బీకే కేంద్రాలు రైతులకు ఎలాంటి భరోసా ఇవ్వలేకపోయాయన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క రైతు భరోసా కేంద్రంలో కనీసం ఎరువులు, విత్తనాలను కూడా ఉంచలేదన్నారు. అన్నివర్గాల ప్రజలు ఆలోచించి అభివృద్ధిని కాంక్షించే కూటమి ప్రభుత్వానికి మద్దతు పలకాలని బాబీ ఓటర్లను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మలినేని గోవిందరావు, కొండేటి ఇజ్రాయల్, గ్రామ నేతలు మామిళ్లపల్లి ప్రవిణ్‌కుమార్, వేముల వెంకటేశ్వరరావు, నరసింహారావు, యర్రాపు వెంకటేశ్వర రావు, వేముల సత్యనారాయణ, టి.సాయిబాబు, శ్రీనివాసరావు, మీసాల దానారావు, గద్దల కోటేశ్వరరావు, యోహోన్, శంకరయ్య సుబ్బారావు, పాపారావు పాల్గొన్నారు.

తాగునీటి పరిష్కారమే గొట్టిపాటి ధ్యేయం

ఇంటింటి ప్రచారంలో తనయుడు హర్షవర్ధన్


2వ వార్డులో హర్షవర్ధన్ ప్రచారం

అద్దంకి, ఏప్రిల్ 24 : అద్దంకి పట్టణంలో శాశ్వతంగా తాగునీటి సమస్య లేకుండా చేయడమే ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్యేయమని ఆయన తనయుడు హర్షవర్ధన్ అన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌ను గెలిపించాలని బుధవారం 2వ వార్డు కాకానిపాలెం, గరటయ్య కాలనీ తదితర ప్రాంతాలలో హర్షవర్ధన్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వి వరించారు. మళ్లీ రవికుమార్‌ని ఎమ్మెల్యేగా గెలిపిస్తే చేపట్టే అభివృద్ధి పనులను తెలి పారు. అన్ని ధరలూ పెంచింది చాలక, చివరకు చెత్త పన్ను వేసిన చెత్త ప్రభుత్వం వైసీపీ అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పట్టణ ప్రజలకు పాత పన్ను విధానం అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కాకాని అశోక్, సందిరెడ్డి శ్రీనివాసరావు, సందిరెడ్డి రమేష్, బొడ్డపాటి రవిబాబు, ఆదిత్య, మన్నం త్రిమూర్తులు, కౌన్సిలర్ యేజెండ్ల నాగరాజు, జనసేన నేత గోరంట్ల సాయి పాల్గొన్నారు.

పన్ను బాదుడు వైసీపీని తరిమేయండి

గొట్టిపాటి ఝాన్సీ పిలుపు


రేణంగివరంలో ప్రచారం నిర్వహిస్తున్న ఝాన్సీ

పంగులూరు, ఏప్రిల్ 24 : ఎడాపెడా పన్నులతో ప్రజలను బాదిన వైసీపీని ఓటుతో తరిమి వేయాలని గొట్టిపాటి రవికుమార్ సతీమణి గొట్టిపాటి ఝాన్సీ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రేణంగివరం గ్రామంలో బుధవారం ఝాన్సీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యేగా గొట్టిపాటిని, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను భారీ ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఒక్క చాన్స్ అంటూ వచ్చిన జగన్‌రెడ్డి అన్నివర్గాలను మహిళలను, వృద్ధులను ఇబ్బందులకు గురిచేశారన్నారు. కార్యక్రమంలో నేతలు బొరెడ్డి ఓబుల్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ చిన్నా, బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, ఆదిరెడ్డి, నాగిరెడ్డి, గుర్రం ఆదిశేఖర్, శ్రీనివాసరెడ్డి, చింతల విజయలక్ష్మి, గొట్టిపాటి వెంకటరత్నం, మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీరుస్తా

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి


మేదరమెట్లలో కరపత్రాలు అందజేస్తున్న గొట్టిపాటి

మేదరమెట్ల, ఏప్రిల్ 24 : మేదరమెట్లలో ప్రజల తాగునీటి సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఏర్పాటు చేస్తామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు. బుధవారం మేదరమెట్లలో ఎస్సీ కాలనీలో ఇంటింటికీ తిరిగి మేనిఫెస్టోలోని వివరాలు చంద్రబాబు ముఖ్యమంత్రి అమలు చేసే పథకాలను వివరించారు. 25 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు వేసిన నాయకుడిని వదులుకున్నామన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారన్నారు. డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళలకు పొదుపు నేర్పించిన నేత చంద్రబాబు అన్నారు. అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి ఐదు రూపాయలకే పేదల ఆకలి తీర్చిన మహానేత చంద్రబాబు అన్నారు. రూ.16వేల కోట్ల రుణ మాఫీ చేసి విపత్తుల సమయంలో రైతులకు అండగా ఉన్నారన్నారు. టిడ్కో ఇళ్లు, కట్టించి పేదలకు సొంత ఇంటి కళ నెరవేర్చడానికి ఆయన చేసిన ప్రయత్నాన్ని జగన్‌రెడ్డి తుంగలోకి తొక్కారన్నారు. పరిశ్రమలు తెచ్చి 6 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించడంతో పాటు నిరుద్యోగ యువతకు భృతి ఇచ్చింది టీడీపీ అన్నారు. అధికారంలోకి రాగానే సైకో పాలన ఎలా ఉండబోతుందో రూ.14 కోట్ల విలువైన ప్రజల ఆస్తిని ధ్వంసం ద్వారా జగన్ చూపించారన్నారు. కూల్చడం తప్ప నిర్మించడం చేతకాని జగన్ ఏపీ అభివృద్ధిని ఆర్థిక పరిస్థితిని, ప్రజాస్వామ్య వ్యవస్థలను యువత భవిష్యత్‌ను నాశనం చేశారన్నారు. ఎస్సీలకు 26 పథకాలను రద్దుచేయడంతో పాటు సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిన వ్యక్తి జగన్‌రెడ్డి అన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయి రెండేళ్ల అవుతున్నా.. నేటికీ ఏర్పాటు చేయలేని అసమర్థులు వైసీపీ పాలకులన్నారు. దీంతో అటు రై తులకు, జాలర్లు జీవనోపాధి లేకుండా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుండ్లకమ్మలో ఇసుకను దోచేసేందుకే గేట్లు బిగించలేదని ఆయకట్టుదారులందరూ ఆరోపిస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమం అభివృద్ధి చేసి చూపుతామన్నారు. మే 13న పోలింగ్ రోజు ఎమ్మెల్యేగా తనను, బాపట్ల ఎంపీగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఆయన వెంట గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో పలు కుటుంబాల చేరిక

మండలంలోని తిమ్మనపాలెం ఎస్సీ కాలనీకి చెందిన 12 కుటుంబాల వారు అద్దంకి టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. బుధవారం తిమ్మనపాలెం ఎస్సీ కాలనీకి చెందిన అన్నంగి అంజయ్య, పసుమర్తి రవి, అనపర్తి మరియదాసు, తాటిపర్తి రాంబాబు, పసుమర్తి మస్తాన్, తాటిపర్తి యహోషవా, పాలపర్తి జాన్, అన్నంగి ప్రేమ్‌కుమార్, మహేష్, చంటి, యోహాను తదితరులు వైసీపీని వీడి చిలకలూరిపేటలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనకు సంఘీభావం ప్రకటించి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.., వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపుఖాయమన్నారు. వైసీపీ పట్ల రోజురోజుకు ప్రజల్లో నమ్మకం పోతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు.ఈ కార్యక్రయం వారి వెంట గ్రామ టీడీపీ నాయకులు న్నారు.

వైసీపీని వీడిన రామాంజనేయపురం వాసులు

బల్లికురవ, ఏప్రిల్ 24 : మండలంలోని రామాంజనేయపురం గ్రామానికి చెందిన 15 కుటుంబాలు వైసీపీని వీడి బుధవారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో సైకిలెక్కారు. పార్టీలో చేరిన కుంచాల వెంకట్రావు, దాసు, శ్రీనివాస రావు, రవి, అంకమ్మ, ఉప్పుతల సత్తయ్య గుంజి వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి శ్రీనివాసరావు మరి కొందరిని రవికుమార్ పార్టీలోకి ఆహ్వానించి రానున్న ఎన్నికలలో టీడీపీ విజయానికి కృషి చేయాలని పేర్కొన్నారు.


టీడీపీలో చేరిన వారితో గొట్టిపాటి

టీడీపీలోకి జోరుగా వలసలు

- ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య సమక్షంలో చేరిన వైసీపీ శ్రేణులు


కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరిన వాడరేవువాసులు

చీరాల, ఏప్రిల్ 24 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కొండయ్య చీరాల నియోజకవర్గంలో అడుగుపెట్టినప్పటి నుంచి తనదైన శైలిలో పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఆ క్రమంలో శ్రేణులను సమన్వయపరచుకుంటూ వస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడిన తరువాత మూడు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించడంలో ఆయన చేసిన సూచనలు పూర్తి స్థాయిలో సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీలో చేరేవారి సంఖ్య పెరుగుతోంది. ఆ క్రమంలో బుధవారం చీరాల మండలం గవినివారిపాలెంకు చెందిన పలువురు పార్టీ కార్యాలయంలో కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరి, తమ మద్దతు ప్రకటించారు. అలానే మండలంలోని వాడరేవుకు చెందిన పలువురు కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వారి మెడలో కొండయ్య టీడీపీ పార్టీ కండువాలువేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరినవారు కూటమి అభ్యర్థి కొండయ్య గెలుపు పూర్తిస్థాయిలో పనిచేస్తామన్నారు. తమ ఓట్లతో పాటు గణనీయంగా ఇతరులను కూడా ప్రభావితంచేసి పెద్దసంఖ్యలో మెజార్టీ వచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య నామినేషన్

కార్యక్రమంలో పాల్గోనున్న ప్రముఖ సినీ హీరో నిఖిల్

చీరాల, ఏప్రిల్ 24 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య గురువారం నిర్ణయించిన ముహూర్తంకు నామినేషన్ దాఖ లు చేయనున్నట్లు టీడీపీ కార్యాలయ ప్రతినిధులు బుధవారం తెలిపారు. నామినేషన్ ర్యాలీలో ప్రముఖ సినీ హీరో నిఖిల్ పాల్గొంటారని వారు తెలిపారు. ఉదయం 9 గంటలకు హస్తినాపురంలోని వినాయకుని గుడి వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఈఆర్వో సూర్యనారాయణరెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నా యకులు, కార్యకర్తలు, నందమూరి అభిమాను లు, పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ అభిమానులు, ప్ర ముఖ హీరో నిఖిల్ అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.



458 ఆవాసాలకు తాగునీరు

● అనుమతిచ్చిన ప్రభుత్వం ఇప్పటికే 142చోట్ల ట్యాంకర్లతో నీరు

● మిగతా వాటిలో అవసరమైనప్పుడు సరఫరా

ఒంగోలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వేసవి నీటి ఎద్దడి తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరాకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆమేరకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వేసవిలో జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లోని 25 మండలాల్లో ఉన్న 458 ఆవాసాల్లో నీటి సమస్య ఏర్పడుతుందన్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అంచనా వేశారు. ఆమేరకు ప్రభుత్వానికి గతంలోనే నివేదించారు. ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరాకు అనుమతి కోరారు. తొలుత 58, తర్వాత మరో 84 హ్యాబిటేషన్లలో నీటి సరఫరాకు గతంలో ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. తదనుగుణంగా ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారు. ఆ 142 ఆవాసాలకు నీటి సరఫరాను జూన్ ఆఖరు వరకు కొనసాగించడంతోపాటు మిగిలిన 316 హ్యాబిటేషన్లలో కూడా జూన్‌లోపు ఎప్పుడు, ఎక్కడ అవసరమైతే అక్కడ సరఫరాకు చర్యలు తీసుకొనేందుకు జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ట్యాంకర్లతో నీటి సరఫరాకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఆయా హ్యాబిటేషన్‌లలో ఒక్కొక్కరికి రోజుకు 40 లీటర్ల సరఫరాకు అనుగుణంగా నీటి ఆడిట్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. హ్యాబిటేషన్ యూనిట్‌గా జనాభా, మొత్తం నీటి అవసరాన్ని గుర్తించి స్థానికంగా అందుబాటులోని అన్ని వనరుల నుంచి ఉన్న లభ్యతపోను మిగతా నీటిని ట్యాంకర్లతో సరఫరా చేయాల్సి ఉంటుంది. మొత్తం నీటి సమస్య ఎదురయ్యే 458 ఆవాసాల్లో దాదాపు 6.48 లక్షల మంది జనాభా ఉన్నట్లు అధికార వర్గాల సమాచారం.



కిలో పొగాకు రూ.284

● మరింత పెరిగిన గరిష్ఠ ధర

● లోగ్రేడ్ రేట్లపై కొండపిలో నిరసన

ఒంగోలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పొగాకు మార్కెట్‌లో మేలు రకం గ్రేడ్ ధర మెరిసిపోతోంది. బుధవారం దక్షిణాదిలో గరిష్ఠ ధర కిలో రూ.284 పలికింది. నాలుగు రోజుల క్రితం అత్యధిక ధర కిలో రూ.250లోపు ఉండగా సోమవారం రూ.256, మంగళవారం రూ.279 లభించింది. బుధవారం కిలోకు మరో ఐదు రూపాయాలు పెరిగి రూ.284కు చేరింది. ఒంగోలు-1 కేంద్రంలో ఈ ధర దక్కింది. మిగతా అన్ని కేంద్రాల్లోనూ గరిష్ఠ ధర రూ.280పైనే ఉంది. అలాగే లోగ్రేడ్‌లలో నాణ్యత కలిగిన బ్రౌన్ రకం ధర కూడా బుధవారం అధికంగానే ఉంది. ఇంచుమించు అన్ని కేంద్రాల్లోనూ ఈ రకం కిలోకు రూ.250పైన లభించింది. అయితే లోగ్రేడ్‌లోని పచ్చ, ఇతర తక్కువ రకం ధరలు వారం నుంచి తిరోగమనంలో ఉండగా బుధవారం కూడా అదేపరిస్థితి కొనసాగింది. పలు కేంద్రాల్లో నోబిడ్‌లు అధికంగా కనిపించాయి. దీనిపై కొండపి వేలం కేంద్రంలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత సేపు కొనుగోళ్లను ఆపి నిరసన తెలిపారు. బోర్డు అధికారులు వారితో మాట్లాడి తిరిగి వేలాన్ని కొనసాగించారు.



ర్యాలీ సమయంలో ప్రణీత్‌రెడ్డితో ఉన్న కానిస్టేబుల్ రత్నబాబు

కానిస్టేబుల్ రత్నబాబుపై వేటు

● సస్పెండ్ చేసినట్లు ఎస్పీ సుమిత్ వెల్లడి

● వైసీపీ ర్యాలీలో పాల్గొనడమే కారణం

ఒంగోలు (క్రైం), ఏప్రిల్ 24 : ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి వైసీపీ ర్యాలీలో పాల్గొన్న కానిస్టేబుల్ డి.ఎన్.బి. రత్నబాబు అలియాస్ గోపిపై వేటు పడింది. ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ గరుడ సుమిత్ సునీల్ ఉత్తర్వులు ఇచ్చారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జస్వంతరావు ఒంగోలు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు రత్నబాబుపై కేసు కూడా నమోదు చేసినట్లు ఎస్పీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న రత్నబాబు ఎఫ్‌సీఐ గోదాం వద్ద చెక్‌పోస్టులో విధులు నిర్వర్తించాల్సి ఉంది. కానీ ఆయన కోడ్‌ను ఉల్లంఘించి వైసీపీ ఒంగోలు అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి నామినేషన్ సందర్భంగా సోమవారం నగరంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసు అధికారులు నివేదిక ఇవ్వడంతో ఎస్పీ చర్యలు తీసుకున్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఎవ్వరూ రాజకీయ పార్టీల ర్యాలీలో పాల్గొనడం కానీ, వారితో సన్నిహితంగా ఉండటం కానీ చేయకూడదన్నారు. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.



డీజేలో పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తున్న కళాకారులు

వెంకటేష్ నామినేషన్‌లో ప్రజలకు తిప్పలు

చీరాల, ఏప్రిల్ 24 : వైసీపీ చీరాల ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ బుధవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా రామకృష్ణాపురంలోని కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీలో పాల్గొన్న వాహనాలు, శ్రేణులతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ముంతావారి సెంటర్ నుంచి సాల్మన్‌సెంటర్ వరకు వాహనచోదకులు ప్రధానంగా కార్లు, ఆటోలలో ప్రయాణం చేస్తున్నవారు ట్రాఫిక్‌లో ఇరుక్కుని ఇబ్బంది పడ్డారు. డీజే మోతలు, పార్టీ పాటలకు అనుగుణంగా కళాకారుల నృత్యం చూసేందుకు శ్రేణులు ఆగిన చోట ట్రాఫిక్ సమస్య పెరిగింది. ఇదిలావుంటే నామినేషన్‌కు వెంకటేష్ తన తండ్రి ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి ఇతర కుటుంబ సభ్యులతో బయలుదేరారు. అయితే తరువాత ర్యాలీ రథంపై ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి లేకపోవడంపై జనాల్లో కొంత చర్చ జరిగింది. అదే రథం నుంచి వెంకటేష్‌కు మద్దతుగా వైసీపీ పర్చూరు అభ్యర్థి యడం బాలాజీ ప్రసంగించే సమయంలో సామాన్య జనాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. మొత్తమ్మీద కిరాయి కేకలు, డీజే మోతలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

పోటెత్తిన అభిమానం

వెల్లువలా తరలివచ్చిన కూటమి శ్రేణులు

స్వచ్ఛందంగా మద్దతు తెలిపిన ప్రజలు

అట్టహాసంగా దామచర్ల, ఉగ్ర, అశోక్‌రెడ్డి నామినేషన్లు

ఒంగోలు, కనిగిరి, గిద్దలూరుల్లో భారీ ర్యాలీలు

కార్యకర్తలలో వెల్లివిరిసిన ఉత్సాహం

నేడు దాఖలు చేయనున్న బీఎన్, కందుల

నేటితో ముగియనున్న నామినేషన్లు

ఊరూవాడా కదిలొచ్చారు. ఎటుచూసిన పసుపుమయం. కూటమి శ్రేణులతోపాటు, ప్రజలు పెద్దసంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొని తమ మద్దతు ప్రకటించారు. భారీగా పార్టీ జెండాలు చేతపట్టి పసుపు చొక్కాలు ధరించి సందడి చేశారు. జిల్లాలో ఒంగోలు, కనిగిరి, గిద్దలూరులో బుధవారం తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల నామినేషన్ దాఖలు అట్టహాసంగా సాగింది. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు జెండాలతో తరలిరాగా రాజకీయ ప్రత్యర్థులను సైతం అబ్బురపరిచేలా ర్యాలీలు సాగాయి. అన్నిచోట్ల జనం బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా పూలవర్షంతో రోడ్లన్నీ పసుపుమయంగా మారిపోయాయి. దారులన్నీ జనంతో నిండిపోయాయి. మేళతాళాలతో, తప్పెట్ల మధ్య తెలుగుతమ్ముళ్లు కదం తొక్కారు.



ఒంగోలులో ర్యాలీకి హాజరైన అశేష జనం (ఇన్‌సెట్‌లో) అభివాదం చేస్తున్న దామచర్ల, మాగుంట తదితరులు



గిద్దలూరులో అశోక్‌రెడ్డి ర్యాలీకి వెల్లువెత్తిన అభిమానులు

ఒంగోలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాధారణ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగియనుంది. కాగా బుధవారం పలు స్థానాలకు నామినేషన్లు భారీగా దాఖలయ్యాయి. అదేసమయంలో మూడు అసెంబ్లీ స్థానాలకు టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా వారి కార్యక్రమం అట్టహాసంగా సాగింది. జిల్లాలో ఒంగోలు పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు ఈనెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన విషయం విదితమే. టీడీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డితో పాటు మూడు స్థానాల అసెంబ్లీ అభ్యర్థులు ఇప్పటికే నామినేషన్లు వేయగా బుధవారం ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్, కనిగిరి అభ్యర్థి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరు అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డిలు దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు నిర్వహించగా టీడీపీ శ్రేణులు, అలాగే కూటమిలో మిగతా పార్టీలైన జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. నియోజకవర్గాల్లోని నలుమూల నుంచి వేలాదిగా టీడీపీ శ్రేణులు తరలివచ్చి నామినేషన్ల కార్యక్రమంలో పాల్గొనడంతో బుధవారం ఉదయం ఒంగోలు, కనిగిరి గిద్దలూరు పట్టణాలు పసుపుమయంగా మారాయి.

స్వచ్ఛందం.. ఉరిమే ఉత్సాహం

ఒంగోలులో ఉదయం పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించిన టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ పది గంటల సమయానికి మినీ స్టేడియం వద్దకు చేరుకోగా వేలాదిమంది కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి ఇతర నియోజకవర్గ నాయకులతో కలిసి ప్రత్యేక వాహనంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీలో ముందుకుసాగారు. అయితే ఫర్లాంగు దూరంలోని డిమార్ట్ సెంటర్‌కు చేరేందుకు దాదాపు గంట పట్టగా నామినేషన్లు దాఖలు ముహూర్తం దగ్గరపడటంతో వాహనం దిగి బైక్‌పై ఆర్డీవో కార్యాలయానికి జనార్దన్, ఆయన కుటుంబసభ్యులు, పార్టీ నేతలు చేరుకున్నారు. అందరూ కలిసి నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే జనార్దన్ సోదరుడు టీడీపీ యువనేత దామచర్ల సత్య తన తండ్రి పూర్ణచంద్రరావుతో కలిసి వచ్చి పార్టీ డమ్మి అభ్యర్థిగా నామినేషన్ వేశారు. కాగా జనార్దన్ ర్యాలీ కోలాహలంగా, ఆకర్షణీయంగా సాగింది. కేరళ వాయిద్యాలు, పసుపు చీరలు, తలపాగాలతో మహిళలు, కేరింతలు కొడుతూ యువకులు పాల్గొనడం ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాగా కొత్తపట్నం మండలం పల్లెపాలెం టీడీపీ కార్యకర్తలు అక్కడి నుంచి 16 కి.మీ. దూరం పాదయాత్ర చేస్తూ ఒంగోలు వచ్చి ర్యాలీలో పాల్గొనడం విశేషం.

ఉగ్ర దండుతో పులకించిన కనిగిరి

మరోవైపు కనిగిరిలో ఉగ్రనరసింహారెడ్డి నామినేషన్ దాఖలు సందర్భంగా కనిగిరి పట్టణం పసుపుదళంతో నిండిపోయింది. ఉగ్ర కార్యాలయం ఉన్న అమరావతి గ్రౌండ్‌కు ఉదయానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది పార్టీశ్రేణులు తరలివచ్చారు. అశేషంగా తరలివచ్చిన కార్యకర్తలతో ఉదయం పదిన్నరకు ర్యాలీ ఉగ్ర ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన వీధులు, పామూరు బస్టాండు మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు సాగగా కేవలం ఒక కిలోమీటర్ దూరం మాత్రమే ఉన్న ఆ మార్గంలో ర్యాలీ సాగడానికి దాదాపు మూడు గంటలు సమయం పట్టింది. మార్గమధ్యంలో స్థానికులు స్వచ్ఛందంగా ఉగ్రపై పూలవర్షం కురిపించగా వ్యాపారులు దుకాణాల నుంచి బయటకు వచ్చి తిలకించారు. జనసేన ఎమ్మార్పీఎస్, బీజేపీ కార్యకర్తలు కూడా పెద్దసంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

జనసంద్రమైన గిద్దలూరు

ఇక గిద్దలూరులో టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ ఆకర్షణీయంగా సాగింది. ఆర్టీసీ డిపో నుంచి అశోక్‌రెడ్డి, మాగుంట రాఘవరెడ్డితో కలిసి ప్రత్యేక వాహనంలో ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీని చేపట్టగా సుమారు రెండున్నర గంటల పాటు సాగింది. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలిరాగా జనసేన కార్యకర్తలు కూడా అధికంగానే పాల్గొన్నారు. బీజేపీ శ్రేణులు కూడా భారీగా పాల్గొనగా పట్టణంలోని ప్రధానరోడ్లన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. రాచర్ల గేటు సెంటర్ జనసంద్రంగా మారింది.

నేడు బీఎన్, కందుల

ఇదిలాఉండగా గురువారంతో నామినేషన్ల దాఖలు గడువు ముగియనుండగా చివరి రోజున కూడా భారీగానే అభ్యర్థులు వేయనున్నారు. అదేసమయంలో ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ విజయకుమార్, మార్కాపురం టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డిలు గురువారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఆ సందర్భంగా బీఎన్ నేతృత్వంలో చీమకుర్తిలో, కందుల ఆధ్వర్యంలో మార్కాపురంలో భారీ ర్యాలీలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు.



కనిగిరిలో ర్యాలీకి పోటెత్తిన ప్రజలు (ఇన్‌సెట్‌లో) ఉగ్రను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

దొంగలు దొరికారు!

చీమకుర్తిలో భారీ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

ఇద్దరు అరెస్టు

రూ.45లక్షల సొత్తు స్వాధీనం

వివరాలను వెల్లడించిన ఎస్పీ సుమిత్

ఒంగోలు (క్రైం), ఏప్రిల్ 24 : మండల కేంద్రమైన చీమకుర్తిలో ఈనెల 21న జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వారి వద్ద రూ.45లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వివరాలను బుధవారం ఒంగోలులో ఎస్పీ గరుడ సుమిత్ సునీల్ వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. చీమకుర్తి పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన పమిడి పద్మశ్రీ తన సోదరుడు మృతి చెందడంతో ఈనెల 21న బాపట్ల జిల్లా బల్లికురవకు వెళ్లారు. 22వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా బద్దలు కొట్టి ఉంది. అందులో ఉంచిన 75 సవర్ల బంగారు ఆభరణా లు, రూ.60 వేల నగదు కనిపించలేదు. దీంతో ఆమె చీమకుర్తి పోలీసులకు ఫిర్యా దు చేశారు. దీనిపై విచారణ కోసం ఎస్పీ స్వీయ పర్యవేక్షణలో మూడు బృందాలను ఏర్పాటు చేశారు.

దొంగలను పట్టించిన వేలిముద్రలు

రంగంలోకి దిగిన పోలీసులు సంఘటనా స్థలంలో దొరికిన వేలి ముద్రల ఆధారంగా నిందితులను గుర్తించారు. తాళ్లూరు మండలం తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని రామభద్రాపురంనకు చెందిన వదిసేన వేణుగోపాల్‌రెడ్డి, చీమకుర్తిలోని జగనన్న కాలనీకి చెందిన షేక్ తరుణ్ అలియాస్ రఫి ఈచోరీ చేసినట్లు నిర్ధారించుకున్నారు. ఇద్దరినీ బుధవారం రామభద్రాపురంలోని వేణుగోపాల్‌రెడ్డి ఇంటి వద్ద అరెస్టు చేశారు. వారి వద్ద 75 సవర్ల బంగారు అభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.



దొంగల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ సుమిత్

నిందితుల్లో అంతర్‌రాష్ట్ర దొంగ

నిందితుల్లో ఒకరైన వేణుగోపాల్‌రెడ్డి అంతర్‌రాష్ట్ర దొంగ. మన రాష్ట్రంలో 13 కేసులతోపాటు తెలంగాణలో మరో ఆరు కేసుల్లో ఆయన నిందితుడిగా ఉన్నాడు. పగలు రోడ్ల వెంట తిరుగుతూ తాళాలు వేసిని ఇళ్లను గుర్తించి రాత్రుళ్లు చోరీకి పాల్పడతాడు. చీమకుర్తిలో జరిగిన చోరీలో అతనితో షేక్ తరుణ్ కూడా కలిశాడు.

ఇతనిపై కూడా కొన్ని చిన్నచిన్న కేసులు ఉన్నాయి. ముందుగానే వారిని అనుమానించిన పోలీసులు విచారించి వదిలేశారు. అయితే సంఘటనా స్థలంలో దొరికిన వేలిముద్రలతో వారి వేలిముద్రలు సరిపోలినట్లు నిపుణులు గుర్తించడంతో తిరిగి మరోసారి అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో చోరీ చేసింది తామేనని ఒప్పుకున్నారు. కేసును అత్యంత వేగంగా ఛేదించిన అదనపు ఎస్పీ (క్రైమ్స్) శ్రీధర్‌రావు, ఒంగోలు డీఎస్పీ ఎం.కిషోర్ బాబు, చీమకుర్తి సీఐ దుర్గాప్రసాద్, సీసీఎస్ సీఐ టి.విజయకృష్ణలతోపాటు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

చెక్‌పోస్టు వద్ద రూ. 2,12,680 సీజ్

సింగరాయకొండ, ఏప్రిల్ 24 : స్థానిక పెరల్స్ డిస్టలరీ సమీపంలో ఉన్న జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ. 2,12,680 నగదును బుధవారం స్టాటిక్ సర్వెలెన్స్-2 టీం ఇన్‌చార్జి సి. శ్రీధర్‌రెడ్డి సీజ్ చేశారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన అబ్బూరి ప్రవీణ్ చిలకలూరిపేటలో పీఎస్ 5 రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్నారని, అందులో పనిచేస్తున్న సిబ్బందికి నగదు చెల్లించడానికి తీసుకెళ్తున్న తరుణంలో సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారని ఎస్సై తెలిపారు.

చెరువులు నిండితేనే తాగు నీటి కష్టాలు తీరేది

అధికారులకు మొరపెట్టుకున్న గ్రామస్థులు

పంగులూరు, ఏప్రిల్ 24 : వేసవిని దృష్టిలో పెట్టుకొని సాగర్ జలాలతో చెరువులు నింపితేనే తాగునీటి కష్టాలు తీరుతాయని పలు గ్రామాల ప్రజలు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని నూజెళ్లపల్లి, చందలూరు, తూర్పు కొప్పెరపాడు, తక్కెళ్లపాడు గ్రామాలలోని మంచినీటి చెరువులను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగరరావు, డీఈ వేణుగోపాల్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ అధికారులతో కలసి బుధవారం పరిశీలించారు. మండలంలో మొత్తం 10 నోటిఫైడ్ చెరువులు సాగర్ జలాలతో నింపాల్సి ఉండగా, మంగళవారం విడుదలైన నీటితో రామకూరు, జనకవరం చెరువులను 90 శాతం, నూజెళ్లపల్లి చెరువును 30 శాతం నీటితో నింపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య ఉన్నతాధికారులకు వివరించారు. బుధవారవ ఈబీసీకి విడుదలైన నీటితో కోటపాడు మేజర్ పరిధిలోని ఆరికట్లవారిపాలెం, బూదవాడ, కల్లంవారిపాలెం, మల్లవరం, పంగులూరు చెరువులకు సాగర్ జలాలను మళ్లిస్తున్నట్లు తెలిపారు.

పమిడిపాడు మేజర్‌కు నీటిని విడుదల చేయాలి

నూజెళ్లపల్లి, కొప్పెరపాడు, తక్కెళ్లపాడు, చందలూరు చెరువులను సాగర్ జలాలు చేరాలంటే పమిడిపాడు మేజర్‌కు తగినంత నీటిని విడుదల చేయాలని ఆ గ్రామాలకు చెందిన కొండ్రగంటం విబాబు, ఎనికపాటి శ్రీనివాసరావు, మురకొండ సుబ్బారావు అధికారులకు వివరించారు. రామకూరు వద్ద ఏబీసీకి చేరుతున్న సాగర్ జలాలు మొత్తాన్ని ఈబీసీకి విడుదచేస్తున్న విషయాన్ని గ్రామస్థులు ఉన్నతాధికారులకు వివరించారు. సాగర్ జలాలతో చెరువులు నింపేందుకు బొగ్గవాగు నుంచి విడుదలైన నీటిని ఈబీసీకి విడుదల చేస్తున్నట్లు ఎన్నెస్పీ డీఈ స్వామి జిల్లా అధికారులకు తెలిపారు. ఈబీసీ పరిధిలో 69 నోటిఫైడ్ చెరువులకు నీటిని మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాలలో ప్రజల తాగు నీటి అవసరాలు తీర్చేందుకు చెరువులకు నీటిని మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఇంకా కొన్నిరోజులు సాగర్ జలాలు తాగు నీటి అవసరాలకు విడుదల చేసేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలన్న ప్రజల విజ్ఞప్తిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అధికారుల బృందం తెలిపారు. రామకూరు లాకుల వద్దకు చేరుతున్న సాగర్ జలాలను కూడా జిల్లా అధికారులు పరిశీలించారు. పమిడిపాడు మేజర్‌కు కనీసం 200 క్యూసెక్కుల నీటిని ఒక్కరోజైనా విడుదల చేసి మా అవసరాలు తీర్చాలని ఆయా గ్రామ ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎన్నెస్పీ డీఈ బాపయ్య, ఏఈ విశ్వమోహన్, చీరాల డివిజన్ పంచాయతీ అధికారి హనుమంతరావు, ఈవోపీఆర్డీ రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు వందనం పాల్గొన్నారు.






చెరువుల వివరాలను ఉన్నతాధికారులకు వివరిస్తున్న ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ శివయ్య (ఇన్‌సెట్లో)నూజెళ్లపల్లి చెరువుకు అరకొరగా చేరుతున్న జలాలు

ఏకేయూ బీపీఈడీ ఫలితాలు విడుదల

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 24: ఒంగోలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం బీపీఈడీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాలను వైస్ చాన్సలర్ మారెడ్డి అంజిరెడ్డి బుధవారం విడుదల చేశారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో 65.6శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతలో బాలుర కంటే బాలికలదే పైచేయి సాధించారు. బాలురు 62.9శాతం, బాలికలు 73.6శాతం పాసయ్యారు. గిద్దలూరు కళాశాల విద్యార్థి జె.శస్త్రషనకుమార్ 8.29 ఎస్‌జీపీఏతో యూనివర్శిటీ ప్రథమస్థానంలో నిలిచారు. సింగరాయకొండ ఎస్.మల్లికార్జునరెడ్డి, టి.వెంకటశ్రీవిద్యలు 7.99తో రెండో స్థానం, జి.తేంద్రహరిజన్ 7.99శాతంతో మూడో స్థానంలో నిలిచారు. అలాగే డీపీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో కేవలం 48.3శాతం మంది మాత్రమే పాసయ్యారు. దీనిలోనూ బాలుర కంటే బాలికలే ఉత్తీర్ణత సాధించారు. బాలురు 45.5శాతం, బాలికలు 12శాతం అదనంగా 57.2శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను వీసీ అంజిరెడ్డి, రిజిస్ట్రార్ హరిబాబు, సీఈ కేవీఎస్.రాజు, ప్రిన్సిపాల్ రాజమోహన్, ఆర్.శ్రీనివాసులు అభినందించారు. అయితే విద్యార్థుల వివరాలు లేకుండా ఫలితాలు ప్రకటించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 25 ఏప్రిల్ 2024





ఆర్వోకు నామినేషన్ ప్రతులను అందజేస్తున్న సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి, పక్కన తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్



వెంకటాచలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల ర్యాలీ



వెంకటగిరిలో జరిగిన ర్యాలీలో అభివాదం చేస్తున్న కురుగొండ్ల

నామినేషన్లకు నేడే ఆఖరు!

- చివరి రోజున భారీగా దాఖలయ్యే అవకాశం
- 6వ రోజు 47 మంది అభ్యర్థులు.. 55 సెట్లు
- నెల్లూరు పార్లమెంటుకు ఆరు నామినేషన్లు

నెల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల్లో తొలిఘట్టం నామినేషన్ల స్వీకరణకు గురువారం గడువు ముగియనుంది. చివరిరోజున భారీగా నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశం ఉంది. కాగా, 6వ రోజు బుధవారం కూడా నామినేషన్లు వెల్లువలా దాఖలయ్యాయి. నెల్లూరు పార్లమెంటుతోపాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 47 మంది అభ్యర్థులు 55 సెట్ల నామినేషన్ ప్రతులను ఆర్‌వోలకు అందజేశారు. కందుకూరులో ఏడుగురు, కావలిలో ఆరుగురు, ఆత్మకూ రులో ఐదుగురు, కోవూరులో ఐదుగురు, నెల్లూరు సిటీలో ఎనిమిది మంది, నెల్లూరు రూరల్‌లో ముగ్గురు, సర్వేపల్లిలో ముగ్గురు, ఉదయగిరిలో నలుగురు చొప్పున అభ్యర్థులు నామినేషన్లు వేశారు. నెల్లూరు పార్లమెంట్ స్థానానికి ఆరు నామినేషన్లు దాఖ లు అయ్యాయి. సర్వేపల్లిలో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, ఉదయ గిరిలో వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఆత్మకూరులో మేకపాటి విక్రమ్ రెడ్డిలు నామినేషన్లు వేశారు. ఈ మూడు చోట్లా వీరి కుటుంబ సభ్యులు డమ్మీగా మరో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. అలానే వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్య ర్థులు నామినేషన్లు వేశారు. బుధవారంతో అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. ఇక నామినేషన్ల స్వీకరణకు కూడా ఒక్క రోజే మిగిలింది. గురువారం గడువు ముగియనుండటంతో భారీగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది. కాగా, శుక్రవారం వచ్చిన నామినేషన్లను అధికారులు పరిశీలించనున్నారు.

వెంకటగిరిలో కురుగొండ్ల

వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. పట్టణంలోని కాశీవిశ్వనాథ స్వామి వారిని దర్శనం చేసుకుని అనంతరం ర్యాలీగా బయలుదేరి ఆర్వో కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆర్వోకు నామినేషన్ ప్రతులు అందజేశారు.

ఎన్నికల సందేహాలను నివృత్తి చేసుకోండి

నెల్లూరు (క్రైం) : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవచ్చని జిల్లా పోలీసు పరిశీలకుడు అశోక్ టి దుధే ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు పరేడ్ మైదానంలోని గెస్ట్‌హౌస్‌లో ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు అందుబాటులో ఉంటానని తెలిపారు. అత్యవసర సమయంలో 7569618685 నెంబరుకు ఫోన్ చేయవచ్చని లేదా పోలీస్ అబ్జర్వర్73 జీమెయిల్.కమ్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

నీటి సమస్యా.. 91001 21702 ఫోన్ చేయండి!



నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 24, జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారానికి జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ హరినారాయణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలు, పంచాయతీలు, గ్రామాల్లో నీటి సమస్యలు ఏర్పడితే ప్రజలందరూ 9100121702 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు. సమస్యను వెంటనే అధికార యంత్రాంగం పరిష్కరిస్తుందని పేర్కొన్నారు.

న్యాయాధికారుల నియామకం

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 24: నెల్లూరు జిల్లావ్యాప్తంగా ఖాళీగా ఉన్న జూనియర్ సివిల్ జడ్జిల కోర్టులకు న్యాయాధికారులను నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరులో చాలాకాలంగా ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకు గుంటూరు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న జీ. స్వాతిని నియమించారు. ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జిగా గుంటూరు జిల్లా రేపల్లె ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎల్. జగదీష్ కుమార్‌ను నియమించారు. కావలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఈ సుధాకర్‌రావును నియమిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా కేంద్రానికి ఉత్తర్వులు అందాయి.


ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 24 : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ఈనెల 30వతేదీవరకు పొడిగించినట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు కూడా ఈ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటి వరకు ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకుని విద్యార్థులు ఫీజులు చెల్లించి, పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



కిలో పొగాకు రూ.274

కలిగిరి, ఏప్రిల్ 24 : పొగాకు ధర పెరుగుతుండటంతో సాగుదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. బుధవారం కలిగిరి పొగాకు వేలం కేంద్రానికి రైతులు 447 పొగాకు బేళ్లు తీసుకొచ్చారు. వేలంలో 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 356 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-75, సీఆర్-6, జంపింగ్ లాట్స్-10 కారణాలతో 91 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.274, కనిష్ఠ ధర రూ.218, సగటు ధర రూ.237.97గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.



సోమశిలలో 8.345 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఏప్రిల్ 24 : సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా బుధవారం నాటికి ప్రాజెక్టులో 8.345 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర కాలువకు 100, దక్షిణ కాలువకు 25 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

నిండు ప్రాణాలను బలిగొన్న అతివేగం

- ఆగి ఉన్న కంటైనర్ లారీని ఢీకొన్న కారు
- ముగ్గురు మృతి, ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

కావలి రూరల్, ఏప్రిల్ 24 : త్వరగా గమ్యానికి చేరుకోవాలన్న ఆతృత.. మితిమీరిన వేగం ముగ్గురు ప్రాణాలను బలిగొంది. బుధవారం తెల్లవారుజామున కావలి సమీపంలోని ముసునూరు వద్ద జాతీయ రహదారిపై ఆగివున్న లారీని ఓ కారు వేగంగా వచ్చి ఢీకొంది ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరికి గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలోని అశోక్‌నగర్‌కు చెందిన తిరునాతి సుబ్రహ్మణ్యం కుమార్తె కల్యాణి కొయ్యలగూడెంలో ఓ ఫ్యాన్సీషాపు నిర్వహిస్తోంది. వన్‌గ్రామ్ గోల్డు ఆభరణాల కొనుగోలు కోసం హిజ్రా ఎర్రాబత్తిన సిరి అలియాస్ రాజ్‌కుమార్‌తోపాటు వంగల కుమార్, ఈయన భార్య కుమారితో కలిసి కల్యాణి కారులో సోమవారం రాత్రి చెన్నై బయలుదేరారు. అక్కడ షాపింగ్ ముగించుకుని మంగళవారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో కావలి సమీపంలోని ముసునూరు టోల్‌గేట్ వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో రోడ్డు పక్కన ఆపి ఉన్న కంటైనర్ లారీని కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో కారులో ఉన్న కల్యాణి (21), రాజ్‌కుమార్ (30), వంగల కుమార్ (53) అక్కడికక్కడే మృతి చెందారు. కంటైనర్ లారీ కిందకు కారు దూసుకువెళ్లడంతో నుజ్జునుజ్జు అయింది. విషయం తెలిసిన వెంటనే కావలి డీఎస్పీ వెంకటరమణ, రూరల్ సీఐ కాటూరి శ్రీని వాసరావు, టూ టౌన్ సీఐ కొండవీటి శ్రీనివాసరావు టోల్‌ప్లాజా మేనేజర్ గణేష్, హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరకున్నారు. ట్రాఫిక్‌ను పక్కకు మళ్లించి క్రేన్ సాయంతో కారులో చిక్కుకుని తీవ్రగాయాలతో ఉన్న డ్రైవర్ షేక్ జిలాని, కుమారిని బయటకు తీసి 108 వాహనంలో నెల్లూరుకు తరలించారు. అలాగే మృతదేహాలను కూడా వెలికి తీసి కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు రూరల్ సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు కుమార్ (ఫైల్)



మృతులు ఎర్రాబత్తిన సిరి అలియాస్ రాజ్‌కుమార్, కల్యాణి (ఫైల్)

రేపు జిల్లాలో బాలకృష్ణ పర్యటన

- నెల్లూరు, కందుకూరులలో సభలో

కందుకూరు, ఏప్రిల్ 24 : 'స్వర్ణాంధ్ర సాకార యాత్ర'లో భాగంగా సినీ హీరో, టీడీపీ సీనియర్ నేత నందమూరి బాలకృష్ణ ఈ నెల 26న జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం హెలికాప్టర్‌లో రామాయపట్నం అతిథిగృహానికి చేరుకోనున్న బాలకృష్ణ మధ్యాహ్నం వరకు అక్కడే విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 3.30 గంటలకు కందుకూరు నియోజకవర్గంలోని గుడ్లూరులో జరిగే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి నెల్లూరు రూరల్, సిటీ నియోజకవర్గాలలో జరిగే బహిరంగ సభల్లో బాలకృష్ణ పాల్గొంటారని టీడీపీ నాయకులు తెలిపారు. గుడ్లూరు సభను విజయవంతం చేసేందుకు కందుకూరు అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కాకాణి ఇలాకాలో మరో మద్యం డంప్!

- ఈసారి పొదలకూరులో గుర్తించిన అధికారులు



అధికారులు గుర్తించిన మద్యం ఇదే!

పొదలకూరు, ఏప్రిల్ 24 : రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సొంత ఇలాకాలో మద్యం డంప్‌లో పట్టుబడుతూనే ఉన్నాయి. మొన్న ముత్తుకూరు మండలం పంటపాళెంలో వైసీపీ నాయకుడి ఇంట్లో మద్యం గుర్తించగా, తాజాగా పొదలకూరు లోనూ మద్యం కేసులు పట్టుబడ్డాయి. విరువూరులోని వైసీపీ నాయకుడు చిర్రా రాజగోపాల్‌రెడ్డి చెందిన రైస్‌మిల్లులో భారీ మద్యం డంప్‌ను సెబ్ అధికారులు, పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల ఎఫ్ఎస్‌టీ మెంబర్స్ ఎన్‌వీ సుబ్రహ్మణ్యం, వై.శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపిన తనిఖీల్లో మిల్లులోని అటకపై 54 మద్యం కేసులను గుర్తించారు. 2,069 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకుని, వీటి విలువ సుమారు రూ.4.05 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. రైస్‌మిల్లు యజమానికి సహాయకుడిగా ఉన్న పెంచలయ్యను అరెస్ట్ చేసి, సెబ్ సీఐ వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ తనిఖీల్లో పొదలకూరు సీఐ రాంబాబు, ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ మద్యం ఎక్కడిది!?

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సొంత మండలంలో ఆయన అనుచరుడు వద్ద పట్టుబడ్డ మద్యం ఎక్కడ నుంచి వచ్చిందనేది అంతుపట్టడం లేదు. కాకాణి తరఫున ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేసేందుకే వీటిని నిల్వ చేసినట్లు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవల ముత్తుకూరు మండలం పంటపాలెంలో పట్టుబడ్డ మద్యం బ్రాండ్లే పొదలకూరులో కూడా గుర్తించారు. రాయల్ ప్యాలెస్, వైట్‌హాల్ బ్రాండ్లు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో లభించేవి. ఒక వ్యక్తి వద్ద మూడు సీసాలకు మించి మద్యం ఉండకూడదు. అలాంటిది వైసీపీ నాయకులకు అన్ని వేల మద్యం సీసాలు ఎలా వచ్చాయి? ఎక్కడి నుంచి వచ్చాయి? డిస్టిలరీ నుంచి దుకాణాలకు వెళ్లాల్సిన సరుకును నేరుగా వైసీపీ నాయకులకు ఇళ్లకు చేర్చారా? లేదంటే దుకాణాల నుంచే తరలించారా!? ఇలా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



వేమిరెడ్డి, బీద, కావ్యలకు హారతి ఇస్తున్న మహిళ

వైసీపీ ప్రభుత్వానికి పతనం తప్పదు

- అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వండి
- కావలి ప్రచారంలో కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి, కావ్య

కావలి, ఏప్రిల్ 24 : నవరత్నాల పేరుతో నవ మోసాలు చేసిన వైసీపీ ప్రభుత్వానికి ఈ ఎన్నికలలో పతనం తప్పదని ఎన్డీఏ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావ్య క్రిష్ణారెడ్డిలు తెలిపారు. కావలిలోని 26, 29 వార్డులలో బుధ వారం సాయంత్రం టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, జనసేన కావలి ఇన్‌చార్జి అళహరి సుధాకర్, బీజేపీ కన్వీనర్ సీవీసీ సత్యం స్థానిక నేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కూటమి అభ్యర్థులకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి ఏమిటో చేసి చూపుతామని తెలిపారు. ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అరాచకాలను అంతమొందించేందుకు టీడీపీకి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో అరాచకపాలన నడుస్తోందని దానిని అంతమొందించి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించేందుకు చంద్రబాబును ముఖ్యమంత్రి గా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల నేత చంద్రబాబు నాయుడని అన్నారు. ఈ ప్రచారంలో కూటమి నేతలు మన్నవ రవిచంద్ర, గంగినేని వెంకటేశ్వర్లు నాయుడు, తటవర్తి వాసు, కే. బ్రహ్మానందం, పొబ్బా సాయి విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్భాటం చేసి వదిలేశారు!?



వైకుంఠపురంలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్



బెడ్లపై పరుపులు, దిండు ఏవీ!?

ఎన్నికల కోడ్ వస్తోందని హడావుడి చేసి హెల్త్ సెంటర్‌ను ప్రారంభించేంశారు. అయితే, ఆ తర్వాత అందులో కనీస వసతులు లేకపోవడంతో రోగులు పడుతున్న బాధలు అన్నీఇన్నీ కావు. కావలిలోని వైకుంఠపురంలో రూ.1.10 కోట్ల వ్యయంతో నిర్మించిన హెల్త్ సెంటర్‌లో అన్ని వసతులు సమకూర్చకుండానే ఎన్నికల కోడ్ సమీపిస్తుందనే ఉద్దేశంతో గత నెల 13వ తేదీన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య ప్రారంభించేశారు. అప్పటినుంచి ఇప్పటిదాకా అంటే ఒకటిన్నర గడుస్తున్నా హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన 10 బెడ్లపై పరుపులు, దిండ్లు ఏర్పాటు చేయలేదు. కేవలం దుప్పటి పరిచి మమ అనిపించారు. అలాగే వైద్యాధికారితో కలిపి ఏడుగురు సిబ్బంది ఉండే ఈ హెల్త్ సెంటర్‌లో సమయపాలన బోర్డులు లేకపోవటంతో డాక్టర్, సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు ఉంటారో కూడా తెలియడం లేదు. రక్తపరీక్షలకు సంబంధించి బోర్డు ఏర్పాటు చేయలేదు. అన్నిరకాల జబ్బులకు మందులు లేకపోవడంతో బయట కొనుగోలు చేయాల్సి వస్తోందని రోగాలు వాపోతున్నారు. రక్తపరీక్షలు చేసే ల్యాబ్‌లో మందులు, అట్టపెట్టెల గుట్టలు తప్ప ల్యాబ్ పరికరాలు లేవు.

- కావలి రూరల్



అట్టపెట్టెలతో నిండి ఉన్న ల్యాబ్ రూం



డాక్టర్ లేకుండా ఖాళీ కుర్చీ, తిరుగుతున్న ఫ్యాన్

కావలిలో 6 నామినేషన్లు

కావలి, ఏప్రిల్ 24: కావలి అసెంబ్లీకి 7వ రోజు బుధవారం వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు 6 నామినేషన్లు వేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పొదలకూరి కల్యాణ్, స్వతంత్ర అభ్యర్థులుగా పోకల రఘువర్మ, వాయిల తిరుపతి, జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా ముప్పసాని నరేంద్ర రెండో సెట్ నామినేషన్, జై భీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థిగా షైనంపాటి ఏసు రత్నం రెండో సెట్ నామినేషన్, స్వతంత్ర అభ్యర్థిగా పసుపులేటి సుధాకర్ రెండో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో శీనానాయక్‌కు అందచేశారు.

300 కుటుంబాలు టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన బీకే అగ్రహారం సుబ్బయ్యకాలనీ ఎస్టీలకు పార్టీ కండువాలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే వంటేరు

జలదంకి, ఏప్రిల్ 24: కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణు గోపాల్‌రెడ్డి సమక్షంలో బుధవారం బ్రాహ్మణ క్రాక పంచాయతీ బీకే అగ్రహారం సుబ్బయ్య గిరిజన కాలనీకి చెందిన 300 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎస్టీ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో వారందరికీ వంటేరు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను వారు వంటేరు దృష్టికి తీసుకురాగా టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంటేరు జయచంద్రారెడ్డి, గంగపట్ల మాలకొండయ్య, వల్లెపు ఏడుకొండలు, స్వర్ణ కొండపనాయుడు, బీజేపీ నాయకుడు మారెళ్ల బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం

● జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్


అంబేడ్కర్, పూలే చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కొండాపురం, ఏప్రిల్ 24: బీసీ, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని జడ్పీ మాజీ చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని సత్యవోలులో ఉదయగిరి నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గద్దె రామక్రిష్ణ ఆధ్వర్యంలో జరిగిన మండలస్థాయి ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని దూరం చేసుకోవడం వలన వైసీపీ ప్రభుత్వంలో బీసీ, బడుగు, బలహీన వర్గాలు చాలా వెనుకబడిపోయామన్నారు. అభివృద్ధి, సంక్షేమం, కులవృత్తుల పరంగా తీవ్ర నష్టం జరిగిందన్నారు. రానున్న ఎన్నికలలో ఐక్యంగా ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించుకొని నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మండల కన్వీనర్ ఎమ్.ఓంకారం, కాకర్ల వెంకట్, పార్టీ పరిశీలకుడు కే.సుబ్బారావు, గంజాం రాఘవేంద్ర, పదర్ల తిమోతి, బద్దిపూడి మాచెర్ల, మందపల్లి మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు


టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో ఇంటూరి

కందుకూరు, ఏప్రిల్ 24: కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు మండలం చినలాటిరిపి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు పలువురు బుధవారం ఆపార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. చినలాటిరిపి ఎస్సీ కాలనీకి చెందిన వార్డుమెంబరు పూరిమిట్ల నారాయణ ఆధ్వర్యంలో పూరిమిట్ల సుబ్బారావు, మధు, శివ, శ్రీరాములు, రాము, మనోజ్, మనోహర్ తదితర కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వారికి టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

లింగసముద్రం : కందుకూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండలంలోని పెంట్రాల గ్రామ పంచాయతీ పరిధిలోని చీమలపెంటకు చెందిన మానికొండ బ్రహ్మయ్య చౌదరి కందుకూరు ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో బుధవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. నాగేశ్వరరావు ఆయనకు టీడీపీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బొల్లినేని రమణయ్య, ముత్తులూరి సుధాకర్, గోపి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే సమాజంలో గౌరవం



రమణయ్య, స్వర్ణలతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కలిగిరి, ఏప్రిల్ 24: సమాజంలో అన్ని వృత్తులకన్నా ఉపాధ్యాయ వృత్తికే గౌరవ మర్యాదలు ఉంటాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని క్రాకుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు యెండ్లూరు రమణయ్యకి బుధవారం స్థానిక ఆవుల రమణారెడ్డి కల్యాణ మండపంలో ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించి నిత్యం విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసిన రమణయ్య ఆదర్శనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పవిత్ర విద్యాసంస్థల చైర్మన్ యెండ్లూరి వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ పీ చెంచలబాబుయాదవ్, మాజీ మండలాధ్యక్షుడు ఎంపీ రామిరెడ్డి, బిజ్జం కృష్ణారెడ్డి, గంజాం రాఘవేంద్ర, యెండ్లూరు భాస్కరనాయుడు, మాదాల శ్రీనివాస్, మాదాల శ్రీహరి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాతబిట్రగుంటలో టీడీపీ ప్రచారం


ఇంటింటి ప్రచారంలో తెలుగు తమ్ముళ్లు

బిట్రగుంట, ఏప్రిల్ 24: బోగోలు మండలం పాతబిట్రగుంట పంచాయతీలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అన్నివర్గాలకు న్యాయం జరగాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డిలను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దగుమాటి వేణుగోపాల్‌రెడ్డి, రేమాల పద్మారెడ్డి, కొర్కుపాటి బసిరెడ్డి, ఎల్.సుధీర్‌బాబు, పాలకీర్తి రమణయ్య, రావి విజయ్‌కుమార్ యాదవ్, రేమాల సంజీవరెడ్డి, తిరుపతి, మందా రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

● దగదర్తి మండలం ఉలవపాళ్ల అరుంధతివాడలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మలేపాటి సుబ్బానాయుడు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ పాలనల్లో దళిత వాడల్లో రోడ్లు అధ్వానంగా ఉండటంతో పాటు వీధిదీపాలు వెలగక అవస్థలు పడుతున్నారన్నారు.


30 ఏళ్లుగా గిరిజనులు రోడ్డు మార్జిన్‌లో ఏర్పాటు చేసుకొన్న గుడిసెలు

ఉన్నోళ్లకే ఇళ్లు..

కాలువ గట్లపై గుడిసెలు!



మోసం గురూ!

- నవరత్నాలకు వీరు అర్హులు కారా?
- దశాబ్దాల తరబడి కాలువ గట్లు, రోడ్డు మార్జిన్లలోనే నివాసం
- ప్రభుత్వాలు మారినా మారని గిరిజనుల తలరాత


ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు రాపూరు వెంకట రమణమ్మ. ఈమె గిరిజన మహిళ. గోగులపల్లి రోడ్డు మార్జిన్లోని స్థలంలో గుడిసె వేసుకొని తన కుటుంబంతో జీవిస్తోంది. గత ఏడాది వర్షాలకు గుడిసె దెబ్బతిని వీరి కుటుంబం రోడ్డున పడింది. ఆమెకు ఎలాంటి గృహం మంజూరు కాలేదు. కానీ ఈమెను ఎందుకు అధికారులు గుర్తించి ఇళ్లు మంజూరు చేయలేదో తెలియదు. కనీసం నాయకులు కూడా పట్టించుకోలేదు.


ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు బండోలు శేషయ్య. ఈయనకు తూర్పు గోగులపల్లిలో రోడ్డు పక్కనే కాలువ గట్టుపై పూరి గుడిసె ఉంది. కేవలం నాలుగు కర్రలపై కప్పు వేసుకుని కుటుంబంతో బతుకుతున్నాడు. ఇతనికి పూటగడవడమే కష్టం. కానీ ఇతనికి జగనన్న గృహం మంజూరు కాలేదు. ఉన్నవారికి గృహాలు మంజూరు చేయడంలో ఉన్న ఆసక్తి ఇతనికి మంజూరు చేయడంలో ఎందుకు లేదో తెలియదు.

అల్లూరు, ఏప్రిల్ 24: నవరత్నాల పథకంలో పేదలందరికీ ఇళ్లు అన్నారు.. కానీ ఇళ్లు మాత్రం ఇవ్వలేదు. దశాబ్దాల తరబడి కాలువ గట్లు, రోడ్డు మార్జిన్‌లలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న నిరుపేద గిరిజనుల గురించి పట్టించుకోలేదు కానీ ఆర్థికంగా ఉన్నోళ్లకు మాత్రం ఇళ్లు ఇచ్చే శారు. ఇది వైసీపీ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి పక్కా గృహం ఉండాలన్న దృఢసంకల్పానికి నిదర్శనం. సొంతిల్లు ఉన్నవారికి మళ్లీ ఇళ్లు మంజూరు చేసిన ఘనత కూడా ఈ రాష్ట్ర ప్రభుత్వానిదే. ఈ క్రమంలో పేదలు పేదలుగానే మిగిలిపోయారు తప్ప ఈ పథకం ద్వారా అసలైన ఇల్లులేని అర్హుడికి ఒరిగిందేమీ లేదు. ప్రభుత్వాలు దశాబ్దాల నుంచి పేదలందరికీ సొంతిల్లు ఇవ్వాలన్న దృఢ సంకల్పంతో అనేక రకాల పథకాలు ప్రవేశపెడుతున్నా కొందరు గిరిజనులకు మాత్రం ఈ పథకాలు దరిచేరడం లేదు. దీంతో వేల కుటుంబాల గిరిజనులు సమాజానికి దూరంగా కాలువ గట్లపైన, గుంట కట్టలపైన గుడిసెల్లో జీవనం సాగిస్తున్నారు. వారి గుడిసెలకు వాడే తాటాకులైనా రెండేళ్లకో మూడేళ్లకోసారో మారుతున్నాయి కానీ వీరి జీవితాల్లో మాత్రం ఏమాత్రం మార్పు కానరావడం లేదు.

● అల్లూరు మండలం సింగపేటలో గిరిజనులకు ఇంటి నివేశన స్థలాల కోసం కేటాయించిన స్థలం ఇప్పటి వరకు చదును చేయలేదు. వీరి నుంచి ఓట్లు మాత్రం వేయించుకుంటారు తప్ప వారు ఇళ్లు నిర్మించుకునేందుకు అటు వైసీపీ ప్రభుత్వం కానీ ఇటు ఆ పార్టీ నాయకులు కానీ ముందుకు రాకపోవడంతో గుంటమిట్టలుగా ఆ స్థలం అలానే మిగిలిపోయింది. దీంతో ప్రతి ఒక్కరికీ గృహాలు అనే మాట గిరిజనులకు కాదన్నట్లు మారింది.

● అల్లూరు మండలం తూర్పు గోగులపల్లిలో రోడ్డు మార్జిన్లో దాదాపుగా 30 ఏళ్ల నుంచి గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నాయి. దాదాపు 30 కుటుంబాలు ఈ గుడిసెల్లోనే మగ్గుతున్నాయి. వానొచ్చినా.. వరదొచ్చినా.. ఎండ కాసినా.. అగ్ని ప్రమాదాలు జరిగినా వీరి పరిస్థితి అగమ్యగోచరమే. గత వేసవిలో ఈ ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగి నాలుగు గుడిసెలు కాలిపోయాయి. దీంతో ఆ నాలుగు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అదే గ్రామంలో గుంటకట్టపై జీవించే గిరిజనులలో ఇటీవల ఇద్దరు పాముకాటుకు గురయ్యారు. గుడిసెల్లోకి దూరిన విషసర్పాల కారణంగా వీరి ప్రాణాలకు ముప్పు పొంచి ఉందనే చెప్పవచ్చు. ఇలాంటి దుర్భర జీవనం సాగిస్తున్న వారికి ఇళ్లు ఇస్తామని చెపి చేయకపోడం మోసం కాదా?.

గిరిజనులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు


పేద గిరిజనులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నాయకులు, రైతులు వీరి వద్దకు వెళ్లి పనులకు తీసుకెళుతున్నారు తప్ప వారికి సహాయం చేసే వారు లేరు. వీరిని అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. అందరిలా వీరికి గృహాలను నిర్మించుకునే స్తోమత లేదు. ప్రభుత్వం ఇచ్చే గృహాలను వీరికి కేటాయించి కాంట్రాక్టరు ద్వారా గృహాలు నిర్మించి ఇస్తే ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ఉంటాయి.

- ఎస్.మల్లి, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు

వైసీపీ పాలనలో దళితుల జీవనం విచ్ఛిన్నం

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర

అల్లూరు, ఏప్రిల్ 24 : దళితులకు విద్య, ఉపాధి అవకాశాలను దూరం చేసి వారి జీవన విధానాన్ని విచ్ఛిన్నం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డితో కలసి బుధవారం మండలంలోని ఇందుపూరు, పురిణి పంచాయతీల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ అందించారన్నారు. దళిత యువత ఉన్నతస్థాయి ఉద్యోగ అవకాశాలు పొందేందుకు ఏర్పాటు చేసిన అంబేడ్కర్ స్టడీ సర్కిల్స్‌ను సీఎం జగన్ వేసివేశారన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఏదో ఒక పథకం ఇచ్చేవారని, ఎస్సీ, ఎస్టీలకు ఎటువంటి పథకాలు లేకుండా చేసిన దేశంలో ఒకే ఒక్క ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. విదేశీ విద్య, కార్పొరేషన్లు మూయించి వేశారన్నారు. సభల్లో తాను మీ మేనమామ అని ఒకసారి, మీ బిడ్డని కాపాడుకోండని, పెత్తందారుకి పేదవారికి యుద్ధమని మరోసారి అంటుంటాడని, పేదోళ్ల పథకాలు మూసేసిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని, ఇటువంటి ముఖ్యమంత్రిని తరిమికొట్టి పేదల అభ్యున్నతి కోసం పాటుపడే చంద్రబాబును గెలిపించుకుని ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు.

కావలి ఎమ్మెల్యేగా ప్రతాప్‌రెడ్డి అనర్హుడు : కావ్య

పదేళ్లుగా కావలి ఎమ్మెల్యేగా కొనసాగుతున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆ పదవికి అనర్హుడని టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అన్నారు. గ్రామాల్లో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయని, రోడ్లు, తాగునీరు, అభివృద్ధి తదితర కార్యక్రమాలు గత టీడీపీ ప్రభుత్వంలో వేసినవని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. అనేక సంక్షేమ పథకాలతో ఆదుకుని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపించిన ముఖ్యమంత్రి చంద్రాబాబునాయుడు అన్నారు. కొట్టేవాడు జగన్.. పెట్టేవాడు చంద్రబాబు... అని కొనియాడారు. చంద్రబాబు పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ది చేకూరుతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం వస్తే పింఛన్ రూ.4 వేలుతోపాటు మహిళలకు నెలకు రూ.1500, చదువుల కోసం రూ.15 వేలు, మూడు సిలిండర్లు, ఉద్యోగ అవకాశాలు తదితర పథకాలు అమలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి అమర్‌రెడ్డి, పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, గునపాటి ఫణికుమార్, భవాని శంకర్‌రెడ్డి, కోడూరు హజరత్‌రెడ్డి, చెన్నారెడ్డి రవీంద్రరెడ్డి, యేటూరు శ్రీనివాసులురెడ్డి. యేలూరు శివకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి తూర్పు గోగులపల్లి సర్పంచు, వార్డు సభ్యులు

మండలంలోని పురిణి, ఇందుపూరులలో జరిగిన టీడీపీ ప్రచారంలో పాల్గొన్న జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డిల సమక్షంలో తూర్పు గోగులపల్లి సర్పంచు తోట మహాలక్ష్మమ్మ, ఆమె భర్త తోట శీనయ్యలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. తూర్పు గోగులపల్లిలోని వారి నివాసంలోనే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ రెబల్ అభ్యర్థిగా తూర్పు గోగులపల్లి పంచాయతీ నుంచి పోటీ చేసి గెలుపొందిన సర్పంచు మహాలక్ష్మమ్మ, ఆమె భర్త తోట శీనయ్యలు పార్టీలోకి రావడం స్థానికంగా బాలన్ని చేకూర్చినట్టయింది. అదేవిధంగా వార్డు సభ్యులు కోమిట్ల శ్రీధర్‌రెడ్డి, గోళ్ల వెంకట రమణయ్య, రామలింగం బలరామిరెడ్డి, ముంతా పద్మలతోపాటు స్థానిక నాయకులు పుట్టా వెంకటేశ్వర్లురెడ్డి, కోటా రమేష్‌రెడ్డి, పినికాటి వెంకటేశ్వర్లురెడ్డి, గూడూరు ప్రవీణ్, గోళ్ల తిరుమలరావు, కమతం సూలాం, కత్తి రామయ్య, ఆవుల కొండయ్య, ఆవుల మాల్యాద్రి, ముంతా రమేష్, ముంతా హరి, పెల్లేటి మధు, పల్లిబోయిన శ్రీనివాసులు రెడ్డి, కరేటి శ్రీహరి, గునిమిని ఉమాశంకర్‌రెడ్డి, గరుతోటి సురేంద్ర, దాసరి మునెయ్యలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మూకుమ్మడిగా పంచాయతీ కార్యవర్గం టీడీపీలో చేరడంతో తూర్పు గోగులపల్లిలో వైసీపీకి తీవ్ర దెబ్బ తగిలింది. ఈ కార్యక్రమంలో రేబాల శంకర్‌రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, పాపనబోయిన రత్తయ్య, కార్తీక్ శర్మ, అరగల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.


కావలి : టీడీపీలో చేరిన నాయకులతో వేమిరెడ్డి, కావ్య, రవిచంద్ర


సర్పంచు మహాలక్ష్మమ్మ, శీనయ్యలను ఆహ్వానిస్తున్న బీద, కావ్య

● విశ్వనాథరావుపేటకు చెందిన..


టీడీపీలో చేరిన బొంతా సుధీర్, జయకుమార్

బోగోలు మండలం విశ్వనాథరావు పేటకు చెందిన వార్డు సభ్యుడు బొంతా సుధీర్, ఎం.జయకుమార్‌లు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి బీద రవిచంద్ర, కావ్య క్రిష్ణారెడ్డిలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బోగోలు నాయకులు మాలేపాటి నాగేశ్వరరావు, లేళ్లపల్లి సుధీర్, టి.శ్రీధర్, మాజీ ఎంపీపీ పి.శ్రీనివాసులు, నాటకరాని రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ముఖ్య నాయకులు టీడీపీలో చేరిక

కావలి : అల్లూరు మండలానికి చెందిన పలువురు వైసీపీ ముఖ్యనాయకులు బుధవారం కావలి టీడీపీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. వారికి కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కావ్య క్రిష్ణారెడ్డి, జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్రలు పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. అల్లూరు చెన్నకేశవుల స్వామి దేవస్థానాల ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్, రామకృష్ణ జూనియర్‌కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మేడా రామకృష్ణారెడ్డి, నూకలపాటి వెంకటేశ్వరరెడ్డి, సహకార పరపతి సంఘం చైర్మన్ మేడా శ్రీనివాసులురెడ్డి, మాజీ కోఆపరేటివ్ డైరెక్టర్, రైతు నాయకుడు యరటపల్లి శేఖర్‌రెడ్డిలు వైసీపీని వీడారు. అలాగే అల్లూరు మండలం నార్త్‌మోపూరుకు చెందిన వైసీపీ నాయకురాలు యెల్లు మధులత మరో 200 మంది రేబాల శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కావలిలో టీడీపీలో చేరారు.

ఆశాజనకంగా పొగాకు ధరలు

కలిగిరి, ఏప్రిల్ 24: వాణిజ్య పంట పొగాకు సాగు చేసిన రైతులకు ప్రస్తుత గిట్టుబాటు ధర ఆశాజనకంగా ఉంది. ఏడాదికేడాది పొగాకు పంట సాగులో ఖర్చులు విపరీతంగా పెరిగిపోతోంది. పొగ మొక్క నాటే సమయం నుంచి తోటల్లో పొగాకు రెలచడం, బ్యారన్‌లలో ఆకు కాల్చడం, మండెలు, చెక్కులు వేయడంతోపాటు, వేలం కేంద్రానికి తీసుకొచ్చేవరకు ప్రతి విషయంలో ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. గత నాలుగైదేళ్ల క్రితం ఒక బ్యారన్‌కు పొగాకు సాగు చేయాలంటే సుమారు రూ.6 లక్షల వరకు ఖర్చు కాగా, ప్రస్తుతం కూలీలు, ఖర్చులు అమాంతం పెరిగిపోయి ఒక్కొక్క బ్యారన్ సాగుకు రూ.11లక్షలు ఖర్చు అవుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. అయితే పొగాకు కిలో గరిష్ట ధర గతేడాది అనూహ్యంగా రూ.280కి పైగా పలికింది. దాంతో రైతులు ఈ ఏడాది గతేడాది కన్నా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. గతేడాది 4 మిలియన్ కేజీలు దిగుబడి సాధించగా ఈ ఏడాది 7.4 మిలియన్ కేజీల దిగుబడి రావచ్చని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది అమ్మకాల చివర్లో పొగాకు ధర అమాంతం పెరగడంతో ముందుగా అమ్మకాలు చేసుకున్న రైతులు నష్టపోయారు. అయితే ఈ ఏడాది కొనుగోళ్ల ప్రారంభం నుంచి నాణ్యమైన పొగాకుకు కేజీ రూ.230కి మొదలై ప్రస్తుతం రూ.274వరకు అందుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కేజీ పొగాకు ధర రూ.300వరకు పలుకుతుందని, ఆశాభావం వ్యక్తం చేస్తూ, పొగాకు రేట్లు ఇదేస్థాయిలో ఉంటే నష్టాల నుంచి గట్టెక్కుతామని రైతులు పేర్కొంటున్నారు.


కలిగిరి వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు కొనుగోళ్లు

వైసీపీ అభ్యర్థి బుర్రా నామినేషన్ దాఖలు

కందుకూరు, ఏప్రిల్ 24: వైసీపీ కందుకూరు అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. పామూరురోడ్డులోని వైసీపీ కార్యాలయం నుంచి ఓపెన్‌టాప్ వాహనంపై నిర్వహించిన ర్యాలీలో వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డితో పాటు కందుకూరు సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి పాల్గొన్నారు. పామూరు బస్టాండ్ సెంటర్‌లో మహీధరరెడ్డి దిగిపోయారు. అనంతరం ఏరియా హాస్పిటల్, అంకమ్మ దేవాలయం, పోస్టాఫీసు సెంటర్‌ల మీదుగా సబ్ కలెక్టరు కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది.

మద్యం సీసాల స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు, నిందితుడితో ఎస్ఐ భోజ్యా

బిట్రగుంట, ఏప్రిల్ 24: బోగోలు మేజర్ పంచాయతీ రైల్వే ఎల్సీగేట్ 144 పడమర వైపు అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని బుధవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తిప్ప ఎస్సై భోజ్యా వివరాల మేరకు.. సుందరగిరివారి కండ్రికకు చెందిన పసుపులేటి ప్రభాకర్‌ను అనుమానంతో తనిఖీ చేయగా అతని వద్ద 30 మద్యం సీసాలు ఉండగా స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతనిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి


ఎన్డీఏకి మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నేతలు

కావలి, ఏప్రిల్ 24: ఎస్సీ వర్గీకరణ సాధనలో భాగంగా ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నేతలు ప్రచారం చేపట్టారు. కావలి రూరల్ మండలం చలంచర్లలో బుధవారం ఇంటింటికి తిరిగి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డికి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగల అభివృద్ధి చిరకాల వాంఛ అయిన ఎస్సీ వర్గీకరణ ఎన్డీఏ కూటమితోనే సాధ్యమవుతోందన్న పిలుపులో భాగంగా ఈ ప్రచారం చేపడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో చంద్రబాబు సీఎం, కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధానమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ, ఇన్‌చార్జి అక్కిల గుంట ఏసు రత్నం మాదిగ, కో ఇన్‌చార్జిలు ఏసుపోగు జయరాజు మాదిగ, చేవూరి కిరణ్ మాదిగ, కత్తి శివయ్య మాదిగలు, తదితరులు పాల్గొన్నారు.



కాపులేని మామిడి తోట

మామిడికి మద్దతేది ?

- అందని రాయితీలు
- పట్టించుకోని ప్రభుత్వం
- నాలుగేళ్లుగా తగ్గిన దిగుబడులు
- ఆదుకుంటామన్న జగన్ హామీలు ఏమయ్యాయి..?

కోలగట్లకు చెందిన రైతు రాధారెడ్డికి 25 ఎకరా ల మామిడి తోట ఉంది. మొక్కలు నాటి రెండేళ్లు దాటినా కాపురాలేదు. గతంలో క్వినాపి మేనేజ్‌మెంట్ పథకం కింద రూ. 5 వేల వరకు రాయితీ ఇచ్చేవారు. ఆ డబ్బులతో మొక్కల కొమ్మలు కత్తిరించగా, కొత్త జంటలు వచ్చి కాపు కాసేవి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎలాంటి నిధులు అందడం లేదని రాధారెడ్డి వాపోయారు.

తలుపూరుపాడుకు చెందిన రమణయ్యకు ఏడు ఎకరాల మామిడి తోట ఉంది. ప్రతిఏటా వాతావరణ పరిస్థితులు అనుకూలించక మామిడికాపు సక్రమంగా లేక నష్టపోతున్నారు. పంట నష్టానికి ప్రభుత్వం పరిహారం కూడా చెల్లించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి వీరిద్దరే కాదు... జిల్లాలోని మామిడి రైతులందరిదీ.

జగన్ ప్రతిపక్షంలో ఉన్న ప్పుడు సంకల్ప యాత్ర పేరుతో పాదయాత్ర చేశాడు. తాను అధికారంలోకి రాగానే ఉద్ధరిస్తానని అన్ని రంగాల ప్రజలను మోసం చేశారు. అలాగే మామిడి రైతులను కూడా దగా చేశాడు. మామిడి రైతులకు ప్రోత్సాహమిస్తామని హామీ గుప్పించిన జగన్ సీఎం అయిన తరువాత పట్టించుకున్న పాపాన పోలేదు.జిల్లాలో ఉద్యాన పంటల్లో భాగమయిన మామిడి తోటలు విస్తారంగా ఉన్నాయి. అయితే రైతులు ప్రతి ఏటా తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారు. దిగుబడి ఉంటే ధర ఉండదు, ధర ఉంటే దిగుబడి లేక రైతులు నష్టపోతున్నారు. ఇదిలా ఉంటే ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు.. మరోవైపు ప్రభుత్వ ప్రోత్సాహం లేక వారు కుదేలవుతున్నారు.

● రాయితీలు కరువు

మామిడి తోటలకు వైసీపీ ప్రభుత్వం ఎలాంటి రాయితీలు కల్పించలేదు. గతంలో ఐదేళ్ల నుంచి పదేళ్ల లోపు మామిడి తోటలకు క్వినాపి మేనేజ్‌మెంట్ పథకం కింద కొమ్మల కత్తిరింపు కోసం హెక్టార్‌కు రూ. 5వేలు ఇచ్చేవారు. ఎరువులు, మందులపై కూడా రాయితీ కల్పించేవారు. 20 ఏళ్లలోపు తోటలకు పునరుద్ధరణ పథకం కింద హెక్టార్‌కు రూ. 20 వేల రాయితీతో వివిధ రకాల పరికరాలు ఇచ్చేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాయితీల ఊసే లేదు. ఈ క్రమంలో జిల్లాలో మామిడి సాగు విస్తీర్ణం తగ్గుముఖం పడుతుంది.

● ఐదు వేల హెక్టార్లలో సాగు

జిల్లాలో సుమారు 5 వేల హెక్టార్లలో మామిడి సాగు అవుతుంది. సంగం, ఆత్మకూరు, వింజమూరు, దుత్తలూరు, ఉదయగిరి, కలిగిరి, ఏయస్‌పేట, జలదంకి, దగదర్తి, ఉలవపాడు తదితర మండలాలల్లో అధికంగా మామిడి సాగు చేస్తున్నారు. బంగినపల్లి, అంటుమామిడి, నీలం, రసాలు వంటి రకాలు సాగవుతున్నాయి. వీటిల్లో ప్రధానంగా బంగినపల్లి మామిడికి మంచి గిరాకీ, డిమాండ్ ఉంటుంది. ఇతర రాష్ట్రాలు, విదేశాలకు జిల్లా నుంచి ఎగుమతి అవకాశం ఉంది. ప్రస్తుతం దిగుబడి సరిగా లేదు. ఉన్నా గిట్టుబాటు ధరలు ఉండడం లేదు. దిగుబడి బాగా వచ్చిన ఏడాది కాయలు కోత కోసిన వెంటనే నిల్వ ఉంచేందుకు కోల్డ్‌స్టోరేజ్‌లు అందుబాటులో లేవు. మామిడి పంట అంతా ఒకేసారి కోయడం వల్ల మార్కెట్‌లో ధరలు తగ్గుతున్నాయి. దీంతో తాము మరింత నష్టపోతున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది కూడా ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే సూచనలు కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించి రాయితీలు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

- సంగం



చెట్లకు కాపు లేకపోవడంతో నరికేసిన కొమ్మలు




పోలింగ్ రోజున సెలవు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మేనెల 13న అన్ని వ్యాపార సంస్థలు, దుకాణాలు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సంస్థల్లో పని చేస్తున్న రోజువారీ సాధారణ, షిఫ్ట్‌లపై పనిచేసే కార్మికులంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈ ఉత్తర్వులు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఆ రోజున ఏ యజమాని కూడా వేతనం తగ్గించరాదన్నారు. ఎవరైనా ఈ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే కార్మిక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- నెల్లూరు (సాంస్కృతికం)

ప్రజాతత్వం మన ఓటు

● లియో టాల్ స్టాయి



పెద్దల మాట

ప్రభుత్వాల బలం ఎప్పుడూ ప్రజల అజ్ఞానంలో ఉంటుంది. ప్రభుత్వాలకు ఈ విషయం తెలుసు కాబట్టి ప్రజల్లో నిజమైన జ్ఞానాన్ని ఇవి వ్యతిరేకిస్తాయి. ఈ సత్యాన్ని మనం గుర్తించాల్సి ఉంది. ఒకవైపు ప్రజల్లో అజ్ఞానాన్ని వ్యాప్తి చేస్తూ, జ్ఞానాన్ని పెంపొందించేందుకు తీరిక లేనట్లుగా నటిస్తున్న ప్రభుత్వాన్ని అలాగే వదిలివేయడం అత్యంత హానికరం. వ్యతిరేక ఓటుతో ఇంటికి పంపండి.

- నెల్లూరు (సాంస్కృతికం)





అబ్బా.. ఏం సెగ

పరుగులు పెట్టించిన ప్రభాకరుడు

ఉదయగిరి వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ఆనకట్ట సమీపం నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ప్రజలు ఎండ వేడిమికి తట్టుకోలేక ప్రదర్శన నుంచి బయటకు పరుగులు తీశారు. ర్యాలీలో పాల్గొన్న ప్రజలకు మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లతోపాటు ఒక్కొక్కరికి రూ.300ల చొప్పున నగదు, భోజనం ప్యాకెట్లు ఇచ్చినట్లు సమాచారం. అయినా కూడా జనం మధ్యలోనే పరుగులు తీశారు.

- ఉదయగిరి



అడుగంటిన కావలి పెద్ద చెరువు

నెరవేరని మాటలు.. కావలి ప్రజల పాట్లు !

నీటిమీద రాతల్లా సీఎం హామీలు

అటకెక్కిన వాగ్దానాలు

కావలి, ఏప్రిల్ 24: చుక్కల భూముల సమస్య పరిష్కార విషయమై గత ఏడాది మే12న కావలిలో జరిగిన సభ సాక్షిగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నీటిబుడగల్లా మారాయి. ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి కోరిక మేరకు కావలికి సీఎం జగన్ రూ.151 కోట్లతో వరాలు జల్లు కురిపించగా అవేమీ కూడా అమలుకు నోచలేదు.

● కలగానే రిజర్వాయర్

కావలి పెద్దచెరువును రిజర్వాయర్‌గా చేస్తే.. దాని దిగువన ఉన్న చెరువుల ద్వారా ఏడెనిమిది వేల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతుందని చేసిన ప్రతిపాదనకు సీఎం రూ.35 కోట్లు మంజూరు చేశారు. 11 నెలలు గడిచినా నిధులు మంజూరు కాక, చెరువుల కింద పైర్లకు నీరందక ఎండిపోయాయి.

● లింక్ కెనాల్ పనులు కూడా..

సంగం బ్యారేజీ నుంచి చినక్రాక రిజర్వాయర్‌కు వెళ్లకుండా నేరుగా కావలి కాలువకు సాగునీరు వచ్చేందుకు అక్కడ లింక్ కెనాల్‌కు రూ.20 కోట్లు మంజూరు చేస్తానని సీఎం హామీ ఇచ్చారు. ఆ నిధులు మంజూరు చేసి ఉంటే ఆ కాలువ నుంచి జలదంకి, కావలి మండలాల చెరువులకు నేరుగా నీరు వచ్చి పంటలు పండేవి. ఆ అవకాశం లేకపోకడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

● సాగని ట్రంకురోడ్డు పనులు


కావలి ట్రంకురోడ్డు పనులు నత్తనడకన నడుస్తుండ టంతో వాటిని ఎన్నికలలోపు పూర్తి చేసేందుకు మరో రూ.16 కోట్లు అవసరమని కోరగా, వాటిని మంజూరు చేస్తున్నట్లు సీఎం చెప్పారు. ఎన్నికలు వచ్చినా అవి మంజూరు కాకపోగా ట్రంకు రోడ్డు విస్తరణ పనులు కూడా ఆగిపోయాయి.

● మౌలిక వసతులు లేని కాలనీ

గతంలో రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నపుడు నిర్మించిన ఇందిరమ్మ కాలనీల్లో మౌలిక వసతులు లేవు. దీంతో అనేక ఇళ్లు అర్ధంతరంగా ఆగిపోయి ఉన్నాయని, వాటి అభివృద్ధికి నిధులు కోరగా రూ.80 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. కాని ఇప్పటికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో ఆ ఇళ్లు అర్ధంతరంగా ఆగిపోయి నిరుపయోగంగా మారాయి.



మౌలిక వసతులు లేక అర్ధంతరంగా ఆగిన ఇందిరమ్మ ఇళ్లు



● హామీలన్నీ కాగితాలపైనే..

సీఎం కావలికి ఇచ్చిన రూ.151 కోట్ల హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదు. ఇటీవల సిద్ధం సభకు కావలి వచ్చిన పుడు పట్టణ అభివృద్ధి గురించి మాట మాత్రం కూడా మాట్లాడక పోవటమే కాక గతంలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిన ఈ సీఎంను చూసి ఓట్లు ఎలా వేయాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

డిపాజిట్ దక్కడమంటే...?

ఈ ఎన్నికల్లో ఫలానా నాయకుడికి డిపాజిట్ వస్తుందా.. అని అప్పుడప్పుడూ అడుగుతుంటాం. అసలీ డిపాజిట్ అంటే ఏమిటో తెలుసుకుందాం. ఎన్నికల్లో పోటీ చేసే వారు 1951 ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం కొంత నగదు డిపాజిట్‌గా చెల్లించాలి. అసెంబ్లీ ఎన్నికల్లో అయితే జనరల్ కేటగిరికి చెందిన వారు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5 వేలు చెల్లించాలి. పార్లమెంట్ స్థానాలకైతే జనరల్ అభ్యర్థులు రూ.25 వేలు, రిజర్వేషన్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు రూ.12,500లు చెల్లించాలి. ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత విజయం సాధించిన వారి వివరాలు ప్రకటిస్తారు. పోలైన ఓట్లలో ఆరింట ఒక వంతు 16.5 శాతం ఓట్లు సాధించిన వారికి కట్టిన డిపాజిట్ సొమ్ము వెనక్కి ఇస్తారు. అంతకంటే తక్కువ ఓట్లు సాధించిన వారికి డిపాజిట్ సొమ్ము ఇవ్వరు. దీన్ని డిపాజిట్ గల్లంతు అంటారు.

- ఉదయగిరి రూరల్





ఓటు మంత్రం


వీక్లీ ఆఫ్.. తుస్!

పోలీసుశాఖలో మూణ్నాళ్ల ముచ్చటగా వారాంతపు సెలవులు

పోలీసులకు వారాంతపు సెలవులు అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి రాగానే వాటిని అలా అమలు చేసి.. ఇలా తీసేశాడు. సరిగ్గా నాలుగేళ్ల కిందట జూన్ 19న జిల్లాలోని పోలీసులకు వారంతపు సెలవులు అమలు చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో తొలిరోజు 45 మందికి మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలీసుశాఖలోని సివిల్, ట్రాఫిక్, ఏఆర్ ఇలా పలు విభాగాల పరిధిలో ఉన్న అన్ని స్టేషన్లలో వారాంతపు సెలవుల చార్టులను సిద్ధం చేశారు. ఈ చార్టులో ఆ స్టేషన్ పరిధిలోని సిబ్బంది ఏ రోజు వారంతపు సెలవు తీసుకోవాలన్న సమాచారం పొందుపరిచారు. సెలవు లేని ఉద్యోగం ఏదైనా ఉందా ? అంటే అది పోలీసు ఉద్యోగమేరా ? అనుకునే ఈ రోజుల్లో వారంలో ఒక రోజు సెలవు అమలు చేస్తారని తెలిసాక పోలీసు సిబ్బందితోపాటు వారి కుటుంబసభ్యులు ఎంతో ఆనందపడ్డారు. అయితే వారిలో ఈ ఆనందం ఎక్కువకాలం నిలవలేదు. రోజులు గడిచే కొద్దీ సిబ్బంది కొరత ఉంది.. సెలవులు లేవంటూ అధికారులు వారంతపు సెలవులను పక్కన పెట్టేశారు. దీంతో ప్రభుత్వ తీరుపై పోలీసు సిబ్బంది ఆగ్రహిస్తున్నారు.

- నెల్లూరు (క్రైం)





హామీపత్రం అడగండి !

యువతకు ఆహ్వానం

ఎన్నికల వేళ ఎర్రికూతలు కూసి, కుర్రకారు గుండెల్లో తిష్టవేసి, గిర్రుగిర్రున తిరుగుతూ ప్రచారాలు సాగిస్తే కుప్పి గంతులు వేసే యువకులారా... మీకు సంబరాలెందుకు? ఎన్నికల సభల్లో ఉన్నవి లేనివి ఆశ పెట్టి, నన్ను గెలిపిస్తే అభివృద్ధి చేస్తా... ఉపాధి కల్పిస్తా.. ఉద్యోగాలు ఇస్తా.. ఇళ్లు కట్టిస్తా... అని వాగ్దానాల వరాలిచ్చే నాయకుల హామీలపై పంచిన కరపత్రాలపై చిత్తశుద్ధిగా అమలు చేస్తామని సంతకం చేసి హామీపత్రం ఇవ్వమని అడగండి. యువ ఓటర్లారా ఎవడొచ్చి, ఎన్ని వాగ్దానాలు చేసినా ఓటరుగా మీరు సరైన నిర్ణయం తీసుకోండి. విచక్షణతో ఓటు వేయండి.

- నెల్లూరు (సాంస్కృతికం)

ఇంకెన్ని రోజులురా.. బాబూ ?

ఖర్చుల్లో ఎన్నికలు

ఈసారి ఎన్నికల షెడ్యూల్ ప్రకటన, నోటిఫికేషన్, నామినేషన్లు, పోలింగ్‌తేదీ, ఫలితాల వెల్లడికి సుదీర్ఘమైన సమయం ఇచ్చింది కేంద్ర ఎన్నికల సంఘం. దీంతో బరిలో నిలచిన అభ్యర్థులకు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఎన్నికలతేదీ ఎప్పుడు వస్తుందా ? అని వారు ఎదురు చూస్తున్నారు. ఓ వైపు మండుతున్న ఎండలు..మరో వైపు విస్తృత ప్రచారంలో పార్టీ కేడర్‌ను వెంటనడిచేలా చూసుకోవడం అభ్యర్థులకు సవాల్‌గా మారింది. వారికి రోజు వారీగా మర్యాదలు, ఇతర ఖర్చులు భరించలేక నానా తంటాలు పడు తున్నారు. చేయలేక ఇబ్బంది పడుతున్నారు. కార్య కర్తలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రికి డిన్నర్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు టీ, కాఫీలు, చల్లటీనీరు, శీతలపానీయాలు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రచారం చేసేందుకు కొందరు కూలీలను ఏర్పాటు చేసుకోగా, వారికి మద్యం, రోజువారీ భత్యంతోపాటు చోటామోటా నాయకులకు ప్యాకేజీలు, వాహనాల ఖర్చులకు రోజుకు రూ. లక్షల్లో ఖర్చవుతున్నారు. ఇవన్నీ భరించలేక ఎన్నికలెప్పుడు ముగు స్తాయిరా.. బాబూ.. అంటూ అభ్యర్థులు తలపట్టుకుంటున్నారు.

- అనంతసాగరం



అప్పట్లో సేవ.. ఇప్పుడు సంపాదన

నా జ్ఞాపకం

మా రోజుల్లో ఎన్నికలకు, ఇప్పటి ఎన్నికలకు ఎంతో తేడా ఉంది. అప్పట్లో పోటీ చేసే అభ్యర్థులు కనిపించేవారే కాదు. గ్రామ నాయకుడి వద్దకు మాత్రమే వచ్చి పోయేవారు. ఆయన వచ్చి ఫలానా అభ్యర్థికి, ఫలానా గుర్తుపై ఓటు వేయాలని చెప్పేవాడు. అది కూడా పోలింగ్‌కు ఒకటి, రెండు రోజుల ముందు... కానీ ఈ రోజుల్లో అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు ఇళ్లిళ్లు తిరుగుతున్నారు. ఓటర్లను ప్రలోభపెడుతున్నారు. దీంతో ఏ నాయకుడు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో తెలియడంలేదు. నాడు ఎలాంటి ప్రలోభాలు ఉండేవికావు. అప్పటి నాయకులు సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాలు చేసేవారు. నేడు సంపాదనే లక్ష్యంగా మారింది. ఎన్నికలనేవి డబ్బు, మద్యం మయమయ్యాయి. అందుకనే ప్రస్తుత రాజకీయాలు రోత పుట్టిస్తున్నాయి.

- సుబ్బరామానాయుడు (92), ఏఎస్ కండ్రిక, రైతు



పెచారానికి ఎలితే తాగినంత మందట!

ఎన్నెలకతి

యంకటయ్య : రేయ్ శీనా... ఎలచన్ల పెచారానికి ఎలితే తాగినోడికి తాగినంత మందంట కదరా...?

శీనయ్య : అవునంటా మావా... మొన్న మా చిన్నాయాన పోయి పుల్‌గా తాగేసి వచ్చాడు. మా చిన్నమ్మ తెగ తిడతావుంది.

యంకటయ్య : అవునేగాని రే... ఏ మందు పోస్తున్నారు.. వాళ్లు ?

శీనయ్య : మావా.. అల్లా పార్టీవోళ్లేమో చీప్‌లిక్కరంట. ఈలోళ్లు మాత్రం ఒకరకమైంది ఇస్తున్నారంట.

యంకటయ్య : మరి డబ్బులు ఈయట్లేదా శీనా ?

శీనయ్య : దానిలెక్క దాందే మావో... దీని లెక్క దీందే...! డబ్బులు ఈయకపోతే మనోళ్లు ఊరుకుంటారా...?

యంకటయ్య : మగోళ్లకి మందుపోయిస్తే.. మరి ఆడోళ్లరా...?

శీనయ్య : మావో వాళ్లూ ఇప్పుడు ముదిరిపోయారే.. మందు బదులు డబ్బులు, లేదా మందే ఈయమంటున్నారంటా. ? అదీ మందల.

- నెల్లూరురూరల్

